నా రేడియో ప్రసంగాలు

దేవులపల్లి రామానుజరావు

నా
రేడియో
ప్రసంగాలు

దేవులపల్లి రామానుజరావు

ప్రతులు 2000
1976

వెల : రు. 5—00

ప్రాప్తిస్థానము
ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్ :: హైదరాబాదు

ముద్రణ
శివాజీ ప్రెస్
సికిందరాబాదు

విషయసూచిక . . .

మార్గదర్శి లక్ష్మణరావు

చిన్నతనంలో సిరిసంపదలతో తులతూగే గారాబంగాని, అన్ని సదుపాయాలతో చదువుకొనే అవకాశంగాని ఆయనకు లభించలేదు. కారణం తండ్రిగారి అకాలమరణం. అందుచేత విద్యాభ్యాసమంతా యించుమించుగ ఆంధ్రదేశానికి దూరంగా ఉన్న మహారాష్ట్ర ప్రాంతంలోని నాగపూరులో అక్కబావల యింట జరిగినది. సహజంగా కర్తవ్యపరాయణుడైన ఆ బాలకుడు ఆనాటి పద్ధతి ప్రకారం ఇంగ్లీషు ద్వార ఎం. ఏ పట్టభద్రుడై యింటికి వచ్చినాడు. అప్పుడు స్వర్గీయులైన తన తండ్రిగారి పలుకుబడి వలన సంస్థానంలో దివాన్‌గిరి ఉద్యోగం లభించినది. ఇటువంటి జీవిత ప్రారంభము సారస్వత కృషికి అంత అనుకూలమైనది కాదు. అయినప్పటికిని తన జీవిత సర్వస్వాన్ని ఆంధ్రభాషాభివృద్ధికి అంకితం చేసినాడంటే కొంత ఆశ్చర్యం కలిగి తీరుతుంది. ఆ మహనీయుడే స్వర్గీయ కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావు.

కేవలం ఇంగ్లీషు చదువుతో తృప్తిపడక హిందీ, బెంగాలీ,

కన్నడము, మహారాష్ట్రము మొదలైన భాషలలో ఆయన ప్రావీణ్యము సంపాదించిరి. విశేషించి మహారాష్ట్ర భాషలో ఆయన పాండిత్యము మిక్కిలి గొప్పది. ఆ రోజులలో మరాఠీలో వెలువడే పత్రికలలో అనేక విషయాల మీద మహారాష్ట్ర విద్వాంసులతో వాదోపవాదాలు గావించి మరాఠీలో మంచి రచయితగా పేరు పొందిన ఆంధ్ర మేధావి ఆయన ఒక్కడేనేమో !

తెలుగు సారస్వత రంగంలో వీరేశలింగం విజృంభించిన కాలమది. ఆయన సమకాలికుడుగా లక్ష్మణరావు ఆంధ్రభాషా రంగంలో అడుగుపెట్టి, వీరేశలింగానికి పరమాప్తుడైనాడు. తెలుగులో అప్పటివరకు విజ్ఞానవాఙ్మయము లేదు. చరిత్ర పరిశోధన తగినంత జరుగలేదు. వచనరచన వికాసము పొందలేదు ; వ్యాసానికి సరియైన స్వరూపము యేర్పడలేదు ; యీ లోటులను గమనించి వానిని తీర్చడానికి కంకణబద్ధుడై లక్ష్మణరావు ముందడుగు వేసినాడు. జీవించినది కొద్దికాలమైనప్పటికి, తన ఆశయాల సాధనలో చాలమట్టుకు ఆయన కృతకృత్యుడైనాడని, యీనాడు మనముందున్న ఆయన రచనలు వేనోళ్ల చాటుతున్నవి.

లక్ష్మణరావు యింటిపేరు కొమఱ్ఱాజు. విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన కృష్ణరాయలకు సమకాలికుడైన కొమఱ్ఱాజు అనే మహాశయుని వలన యీ కుటుంబానికి యీ పేరు కలిగినది. లక్ష్మణరావు జన్మించిన వారి స్వగ్రామమైన పెనుగంచిప్రోలు, నందిగామ తాలూకాలో ఉన్నది ; వీరి పూర్వీకులు సాహిత్యములోను, శాస్త్రాలలోను మంచి అభినివేశము కలిగినవారు. ఆయన తండ్రిగారు కొమఱ్ఱాజు వెంకటప్పయ్య, తల్లిగారు గంగమాంబ. అక్కగారు సుప్రసిద్ధ విదుషీమణి అచ్చమాంబగారు. అబలా సచ్చరిత్రమాల యీమె రచించిన గ్రంథమే. సోదరీ సోదరులు

సాంస్కృతికరంగములో పరస్పర ప్రభావితులు. లక్ష్మణరావుకు చిన్నప్పటి నుండియే భాషా సంస్కృతులు అభిమాన విషయాలు. స్వయంగా మేధావి. అందుకు, బహుభాషా పరిచయము, బహు గ్రంథావలోకనము తోడైనది. మహారాష్ట్ర భాషలో మోరోపంతు రచించిన భారతప్రతిని పరిశీలించి, పాఠాలను నిర్ణయించి, లక్ష్మణ రావు పత్రికలలో ప్రకటించినారు. ఆ విధంగా ఆయన సారస్వతో పాసన ప్రారంభమైనది. ఈ పరిశోధన మహారాష్ట్ర విద్వాంసుల ఆదరణ పొందినది. తరువాత వారితో వాదోపవాదాలు జరిపి ఆ రోజులలో భారతదేశానికి నాయకమణి, మహామేధావియైన బాల గంగాధర్ తిలక్ దృష్టిని ఆకర్షించి, రామాయణంలో పేర్కొనిన పర్ణశాల తెలుగుదేశములోని భద్రాచలంలోనిదేనని, నాసిక్ వద్దది కాదని లక్ష్మణరావు ప్రతిపాదించగా బహుజనామోదము పొందినది.

తెలుగుదేశానికి వచ్చి ఉద్యోగ బాధ్యత స్వీకరించిన తరువాత మునగాల రాజా గారితో ఆయనకు గాఢమైత్రి యేర్పడినది. ఆ మైత్రి ఫలితంగా నిజాం రాష్ట్ర ఆంధ్రులతో సన్నిహిత సంబంధాలు యేర్పడినవి. లక్ష్మణరావు వేషభాషలలో మహారాష్ట్ర సంస్కృతీ ప్రభావం కొట్టవచ్చినట్లుండేది. అందుచేత ఆనాటి నిజాం రాష్ట్రంలో సమష్టికుటుంబంగా ఉన్న ఆంధ్ర మహారాష్ట్ర కర్ణాటకులకు లక్ష్మణరావు ఆప్తబంధువైనాడు.

నిజాం రాష్ట్రాంధ్రులతో యేర్పడిన స్నేహ సంబంధాల ఫలితంగా మునగాల రాజాగారి ప్రోత్సాహంతో, మిత్రుడైన రావిచెట్టు రంగారావుగారి సహకారంతో ౧ సెప్టెంబరు ౧౯౦౧ నాడు శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం స్థాపనతో లక్ష్మణ రావు కార్యరంగంలోనికి దిగినాడు. తరువాత కొన్ని సంవత్సరాలకు హనుమకొండలోని రాజరాజనరేంద్ర భాషానిలయము, వరం

గటులోని శబ్దానుశాసన ఆంధ్రభాషానిలయము స్థాపితమైనవి. ఈ విధంగా గ్రంథాలయోద్యమానికి లక్ష్మణరావు నాయకత్వం వహించి, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, మాదపాటి హనుమంతరావు మొదలైన వారికి మార్గదర్శకుడైనాడు. తెలుగు దేశములో గ్రంథాలయోద్యమము జాతీయోద్యమేగదా!

ఉత్తమశ్రేణికి చెందిన పరిశోధకుడూ పండితుడూ రచయితా అయిన లక్ష్మణరావుకు గ్రంథాలయోద్యమ వ్యాప్తితో తృప్తి కలుగలేదు అందుచేత విజ్ఞానచంద్రికా గ్రంథమండలిని మొట్టమొదట హైద్రాబాదులో స్థాపించి, అప్పటి రాజకీయ పరిస్థితుల వలన మద్రాసుకు మరలించి గ్రంథప్రకటనకు పూనుకొనినాడు. చరిత్రపరిశోధన, విజ్ఞాన వికాసము అనే రెండు ఆశయాలతో లక్ష్మణరావు సారస్వతయాత్ర సాగినది. వారికి పెట్టనికోటగా ఉండినారు మునగాలరాజా నాయని వేంకటరంగారావుగారు. మహారాష్ట్ర సంస్కృతీ ప్రభావము వలన కాబోలు లక్ష్మణరావు శివాజీ చరిత్రను ప్రామాణికముగా తెలుగులో రచించినారు. తరువాత హిందూమహాయుగము, మహమ్మదీయ మహాయుగములను రచించి, చరిత్ర రచనలకు ఒరవడి పెట్టినారు. శాసనాలను సేకరించి వానిలోని లిపులను అన్వయించుకొని, అవసరమైన సామగ్రిని అంతా సమకూర్చుకొని సత్యాన్వేషణ దృక్పథముతో లక్ష్మణరావు చరిత్ర పరిశోధన కొనసాగినది. స్వర్గీయ మల్లంపల్లి సోమశేఖరశర్మ, లక్ష్మణరావు వద్ద శిక్షణపొందిన పరిశోధకాగ్రణి. స్వర్గీయ ఆదిరాజు వీరభద్రరావు లక్ష్మణరావు వద్ద పనిచేసి, భాషారంగములో తొలిపాఠాలను నేర్చుకొన్నారు. ఆంధ్రుల చరిత్రను వ్రాసిన స్వర్గీయ చిలుకూరి వీరభద్రరావు మీద లక్ష్మణరావు ప్రభావముస్నదని చెప్పక తప్పదు. వీరి ఆంధ్రులచరిత్ర విజ్ఞానచంద్రికా గ్రంథమండలి పక్షాన ప్రకటితమైనది.

లక్ష్మణరావుది విజ్ఞానదృక్పథమని గూడ చెప్పినాను. అందుచేతనే తన గ్రంథమాలకు విజ్ఞానచంద్రిక అనే పేరు పెట్టి నారు. ఈ గ్రంథమాలలో దేశచరిత్రలు, జీవిత చరిత్రలే కాక తర్కశాస్త్రము, పదార్థవిజ్ఞానశాస్త్రము, రసాయనశాస్త్రము, జంతు శాస్త్రము, భూగర్భశాస్త్రము, అర్థశాస్త్రము మొదలైన వానికి సంబంధించిన గ్రంథాలు వెలువడినవి. ఆనాటి విద్యాధికులను దగ్గరకు దీసి, వారిచేత యీ గ్రంథాలను లక్ష్మణరావు వ్రాయించి నారు. అంతేకాక సాహిత్యములో చరిత్రలో, ప్రకృతిశాస్త్రములో పోటీ పరీక్షలు పెట్టి బహుమతులను యిప్పించినారు.

తెలుగుభాషలో విజ్ఞాన సర్వస్వమును ప్రకటించవలెనని లక్ష్మణరావుకు సంకల్పము కలిగి అందుకై కృషిని వెంటనే ప్రారంభించినాడు. ఆలోచనకూ ఆచరణకూ మధ్య ఆలస్యమును సహించే స్వభావము లక్ష్మణరావుది కాదుకదా! అందుచేత ఆయన జీవితకాలంలోనే విజ్ఞానసర్వస్వము మూడు సంపుటాలుగా ప్రక టితమైనది. ఈ మూడు సంపుటాలలోని, రెండువేల పేజీలలో వేయి వ్యాసాలవరకు ఉన్నవి. ఈ వ్యాసాలలో స్వయంగా లక్ష్మణ రావు వ్రాసినవి ముప్పైయిదు. ఈ ముప్పయిఅయిదు వ్యాసాలను పరిశీలించినప్పుడు ఆయన సర్వతోముఖమైన విజ్ఞానము మనకు స్పష్టమవుతున్నది. ఎందుకనగా యీ వ్యాసాలు భాష, గణితము, ధర్మశాస్త్రము, జ్యోతిషము, చరిత్ర, ప్రకృతిశాస్త్రము, రాజకీయ శాస్త్రము, తర్కశాస్త్రము, కళలు, సాహిత్యము మొదలైన అనేక విషయాలకు సంబంధించినవిగా ఉన్నవి. ఈ వ్యాసాలు ఆయన అద్వితీయమైన మేధాశక్తికీ, అపూర్వమైన వైదుష్యానికి ఉత్తమ మైన నిదర్శనాలు. ఇంతేకాక చరిత్రకు సంబంధించిన అనేక విష యాలను గూర్చి పరిశోధకుల సందేహాలను తన ప్రజ్ఞాపాటవముచేత

తీర్చినాడు. అణువు నుండి అజాండము వరకు సమస్త విజ్ఞానము ఆయనకు సుపరిచితం. దేనిని గూర్చి వ్రాసినా సమగ్రతలేనిదే ఆయన తృప్తి పడలేదు. ప్రామాణికత ఆయన పాటించిన క్రమ శిక్షణలో ప్రముఖమైనది. తెలుగులో కొత్త పదాలు కొన్నింటిని రూపొందించవలసిన అవసరం ఆయనకు కలిగినది. యూనివర్సిటీ అంటె - విశ్వవిద్యాలయము ; ఎడ్యుకేషన్ అంటే - శిక్షణ, ఎడిటర్ అంటే సంపాదకుడు, ఫలానా అంటే అముక ; అనే పదాలు ఆయన రూపొందించినవే ;

ఒక దీపము అనేక దీపాలను వెలిగించగలదు. కాని సొంత కాంతి మాత్రం తగ్గించుకోదు. లక్ష్మణరావు జీవితము యిందుకు గూడ నిదర్శనము. తన సొంత శక్తిని, వైదుష్యాన్ని ఆంధ్ర భాషాభివృద్ధికి ఉపయోగించడమే గాక విద్యార్థికులైన యువకులను ఆహ్వానించి, వారిచేత తెలుగు సరస్వతికి పూజాప్రసూనాలు అర్పింపజేసినారు. ఇటువంటి ఔదార్యము గల పెద్దలు మనదేశములో కొద్దిమంది మాత్రమే ! గాడిచర్ల హరిసర్వోత్తమరావు వంటి దేశభక్తుని, సాహిత్యవేత్తను గ్రంథాలయోద్యమాభిమానిని ఆయన దగ్గర దీసి తోడ్పడినాడు. అభినవాంధ్ర కవిత్వానికి ఆచార్యులైన రాయప్రోలు సుబ్బారావుగారికి ఆయన ఆదరము లభించినది. చిలుకూరి వీరభద్రరావు, మల్లంపల్లి సోమశేఖరశర్మ, ఆదిరాజు వీరభద్రరావు గార్లను గూర్చి యిదివరకే ప్రస్తావించినాను. ఒకసారి విజ్ఞానచంద్రికా గ్రంథమండలి ప్రచురణలను పరిశీలించితే ఆనాడు యువకులై తరువాత అనేక రంగాలలో నాయకత్వము వహించి దేశానికి వన్నె తెచ్చినవారి రచనలను మనము పోల్చుకోవచ్చును. డా. ఆచంట లక్ష్మీపతి, డా. కట్టమంచి రామలింగారెడ్డి, డా. భోగరాజు సీతారామయ్య, అయ్యదేవర కాళేశ్వరరావు మొద

లైన వారు యీ శ్రేణిలో చేరుతున్నారు. ఇంతమంది మేధావులను ప్రోత్సహించిన ఉదారగుణ భూషణుడు లక్ష్మణరావు. దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులుగారు తరువాత విజ్ఞానసర్వస్వమును సిద్ధము చేసే పనికి పూనుకొని లక్ష్మణరావుగారి రెండు సంపుటాలు పునర్ముద్రణ గావించినారు. నాగేశ్వరరావు పంతులుగారి మీద లక్ష్మణరావు ప్రభావము కొంత ఉండక తప్పదు.

భారతదేశానికి స్వాతంత్ర్యము వచ్చిన తరువాత దేశభాషలకు ప్రాధాన్యము హెచ్చినది. అధికార స్థాయిలో దేశభాషలకు సముచిత స్థానము లభింపజేయడానికి కృషి జరుగుతున్నది. ఇందుకు అనుగుణంగా మన ప్రభుత్వము తెలుగును అధికార భాషగా ప్రకటించినది. ఉన్నత విద్యాబోధన తెలుగులో జరిపించడానికి అవసరమైన కృషి జరుగుతున్నది. జాతీయస్థాయిలోను, అంతర్జాతీయస్థాయిలోను తెలుగుకు కావలసిన పరిగణన సంపాదించడానికి ప్రయత్నాలు జరుగుతున్నవి. తెలుగుభాషను సంపన్నము చేయవలెననే ఉద్దేశముతో బహుముఖమైన వ్యాసంగం జరుగుతున్నది. ఇదంతా ఆనాడు లక్ష్మణరావు ఊహించి ప్రారంభించిన కార్యక్రమాలకు అనుగుణమైనదే కదా ! ఆ రోజులలో యీనాటి అవసరమును ఊహించి ముందడుగువేసిన ఆయన దూరదృష్టి మనకు ఆశ్చర్యము కలిగిస్తున్నదిగదా ! ఆత్మ అనేది ఉంటే యీనాటి కృషిని ఆయన యెక్కడినుంచో పరిశీలిస్తూ ఆనందిస్తున్నారేమోనని అనుకోవచ్చుగదా !

సంచార విజ్ఞానసర్వస్వము అయిన లక్ష్మణరావు ఒక వ్యక్తికాదు ; మహాసంస్థ ; వాస్తవానికి సర్వాంధ్ర సంస్కృతీ ప్రవర్తకుడు. ఆయన నిర్యాణ సందర్భములో ఒక కవీశ్వరుడు వ్రాసిన పద్యము యీ సందర్భములో జ్ఞప్తికి వస్తున్నది.

"తెలుగును నాట్యరంగమున దివ్యులుమెచ్చ ప్రధానపాత్రగా
నిలిచి విమర్శగీతముల నిందితరీతిని పాడుచుండగా
కలిగిన కాలమృత్యువను కాండపటంబును జారనన్న వా
రలు గనలేరు నిన్ను కొమరాజకులాగ్రణి లక్ష్మణాగ్రణీ"

(15–9–75)

గాలిబ్ జీవిత విశేషాలు

ఒకవేయి ఎనమన్నూట అరువదితొమ్మిది సంవత్సరము ఫిబ్రవరి 17వ తేదినాడు ఉర్దూకవులలో ప్రథమగణ్యుడైన గాలిబ్ పరలోకగతుడైనాడు. ఈ సంఘటన జరిగి నూరు సంవత్సరాలు గడచిపోయినందున గాలిబ్‌కవి నూరవ వర్ధంతి అఖిల భారత స్థాయిలో వైభవంగా జరిగినది. భారతదేశములోనేకాక ఇంగ్లాండు, రష్యా, పాకిస్తాన్, అమెరికా మొదలైన దేశాలలో గాలిబ్ శత వర్ధంతి ఉత్సవాలు జరిగినవి. ఈ విధముగా విశ్వసాహితికి గాలిబ్ పరిచయము కలిగినది. వివిధ భాషలలో గాలిబ్ రచనలు అనువదించుటకు ప్రయత్నాలు జరుగుతున్నవి. ఈ ప్రయత్నాలు సఫలమైతే మానవాళికి గాలిబ్ సందేశము సువిదితము కాగలదు. నిజానికి గాలిబ్ సమస్త ప్రపంచమును తన కుటుంబముగా భావించుకొనినాడు. మతము, ప్రాంతము, జాతి అను భేదాలను పాటించని గాలిబ్ విశ్వజనీనుడైన మహాకవి. ఒకానొక స్నేహితునికి ఉత్తరము వ్రాయుచు "... ... ఎవరేమనుకొన్నప్పటికిని మానవులందరిని

వారు యెక్కడనున్నను, యే మతమవలంబించినను నా సోదరులుగా భావించుకొనుచున్నాను" అని ఆయన వ్రాసినారు. ఆయన రచనలలో యిందుకు ఉదాహరణలు అనేకములు—

గాలిబ్ తండ్రి, తాతలు మధ్య ఆసియాలోని సల్జూఖ్ రాజ కుటుంబానికి చెందిన తురుష్కులు. రణతంత్రములో ఆరితేరిన యోధులు. వీరు సుమారు మూడునూర్ల సంవత్సరాలు మధ్య ఆసియాను పరిపాలించిన తరువాత క్షీణదశను యెదుర్కొని తత్ ఫలితముగా కుటుంబము వివిధ భాగాలై ఆసియాలోని అనేక ప్రాంతాలకు వలసవెళ్లుట తటస్థించినది. పదునెనిమిదవ శతాబ్ద మధ్యకాలములో యీ విధముగా వలస వెళ్ళిన ఒక కుటుంబ విభాగానికి చెందిన గాలిబ్ తాతగారు భారతదేశానికి సమర్కండ్ నుండి బయలుదేరి అప్పుడు ఢిల్లీ పరిపాలించుచున్న షా ఆలంను ఆశ్రయించినాడు. అయితే అప్పటికే ఢిల్లీలోని మొగల్ సామ్రాజ్యము పతనావస్థలో ఉండెను. అందుచేత ఆయన తరువాత జయపూర్ మహారాజా ప్రభృతులను కూడ ఆశ్రయించి జీవనోపాధిని గడించి తుట్టతుదకు ఆగ్రాలో స్థిరపడినాడు. ఈయన కుమారుడు మిర్జా అబ్దుల్లా బేగ్ ఆగ్రాలోని ఒక ఉన్నత వంశానికి చెందిన యువతిని వివాహమాడినాడు. ఈ యువతీ, యువకుల జ్యేష్ఠపుత్రుడే మహాకవి మిర్జా అసదుల్లాఖాన్ గాలిబ్. ఈయన 27వ డిసెంబర్ 1769 నాడు జన్మించినాడు. ఈయనకు సోదరీ సోదరులు ఇద్దరు ఈ ముగ్గురు చాలా చిన్నవారుగా నున్నప్పుడే తండ్రిగారు మరణించినందున పినతండ్రి అసదుల్లాబేగ్ వీరిని చేరదీసినాడు. కాని దురదృష్టవశాత్తు పినతండ్రి గూడ త్వరలోనే మరణించినందున చాలా చిన్నవయసులో వీరు ఆర్థికమైన ఇబ్బందులను యెదుర్కొనవలసి వచ్చినది. ఇంచుమించుగా యీ ఇబ్బం

దులు గాలిబ్‌ను ఆజన్మాంతము వెంబడించినవి. గాలిబ్ పినతండ్రి బావమరదియైన నవాబ్ అహమద్ బక్ష్‌ఖాన్ యీ కుటుంబమును ఆదరించి ఈస్టిండియా కంపెనీ నుండి కొంత పెన్షన్ యిప్పించి యుండెను. ఇందులో గాలిబ్ వంతుకు దొరికిన పెన్షన్ సంవత్స రానికి ఏడునూర్ల ఏబది రూపాయలు. ఆజన్మాంతము ఆయనకు యీ పెన్షనే నికరమైన ఆదాయము.

గాలిబ్ బాల్యమంతయు ఆగ్రాలోనే గడచినది. గాలిబ్‌కు పదమూడవ సంవత్సరమున నవాబ్ అహమద్ బక్ష్‌ఖాన్ బంధు వర్గములోని ఒక బాలికతో వివాహము జరిగినది. ఆదాయము లేకపోయినప్పటికిని గాలిబ్ చిన్నప్పటినుండియు జాగీర్దారి కుటుం బాల పిల్లలతో కలసిమెలసి ఆ వాతావరణములో మెలగినందున ఆ వాతావరణములోనే పెరిగినందున డాబు, దర్పాలతో, ఆట పాటలతో ఆయన తిరిగినాడు. ఆయన విద్యాభ్యాసము సక్రమమైన పద్ధతిలో జరగలేదు. కావ్యరచనలో ఆయనకు గురువెవ్వరును లేరు. స్వయం కృషివలన గాలిబ్ ఫారసీ, ఉర్దూ భాషలలో అసా ధారణమైన పాండిత్యము గడించినాడు. ఆయన ధారణాశక్తి అనన్య సామాన్యము. ఒకసారి చదివిన విషయము స్మృతి పథములో అట్లే నిలచిపోయెడిది. సహజ ప్రతిభయే ఆయన సాహితీ వ్యాసంగమునకు మూలకారణము. ఆయన మాతామహుడు సాహిత్య ప్రియుడు. మామగారు సుప్రసిద్ధ కవి. విద్వాంసులు, కవులు. వీరిద్దరి చుట్టుచేరి కవితా చర్చలు, విద్వద్గోష్ఠులు గావిం చెడి వారు. ఈ ప్రభావానికి లోనై చిన్నారి పొన్నారి చిరుత కూకటి నాడే గాలిబ్ కావ్యరచనకు ఉపక్రమించి పదునేడవ యేట ఢిల్లీ చేరుకొనినాడు. గాలిబ్ ప్రాథమిక రచనలు కఠిన శైలిలో నుండి నందువలన సామాన్యుల కర్థముగాక పరిహాసమునకు గురియైనాడు.

తరువాత ఆయన సులభశైలి అవలంబించి విశిష్టమైన రచనలు గావించినాడు. ఏది వ్రాసినను గాలిబ్ బాగుగా ఆలోచించి కొద్దిగా, చక్కగా వ్రాయువాడు. కావుననే అతని కవితలో ఆవేశము, ఉద్వేగముకంటె నిదానము, ఆలోచన యెక్కువగా కన్పించుచున్నవి. ఈ విధముగా సాహితీరంగములో అడుగుపెట్టిన గాలిబ్ తన కుటుంబ సంప్రదాయము నుండి పితృ, పితామహుల వృత్తి నుండి విడిపోయి సంపూర్ణముగా భిన్నమార్గములో సంచరించినాడు. పితృ, పితామహులు కత్తితో కసరత్తు గావించగా గాలిబ్ కలముతో కసరత్తు జేసినాడు. పితృ, పితామహులది తాత్కాలికమైన కీర్తి మాత్రమే. కాని గాలిబ్ యశస్సు ఆచంద్రతారార్కమైనది.

మొట్టమొదలు ప్రస్తావించినట్లుగా గాలిబ్ శ్రీమంతుల యింటిలో జన్మించినప్పటికిని అతనికి వారసత్వముగా సంక్రమించినవి ఋణము, దారిద్ర్యము మాత్రమే. కాని ఆయన స్థిరచిత్తముతో సడలని ధైర్యముతో జీవితయాత్ర గావించినాడు. అడుగడుగున పోరాటమే ఆయన జీవితము. ఈ కథ ఒక విషాదగాథ. స్వేచ్ఛగా డబ్బు ఖర్చుచేయుటకు అలవాటుపడిన గాలిబ్ పొదుపరితనమును అలవరచుకొనలేక పోయినాడు. కావుననే జీవితాంతము అప్పుల బాధ ఆయనకు తప్పలేదు. ఈ బాధ భరించలేక చిత్తశాంతి కొరకు జూదమాడుటకు అలవాటుపడిన గాలిబ్ తుదకొక పర్యాయము ఖైదుకు వెళ్ళుట గూడ తటస్థించినది.

గాలిబ్ వ్యక్తిత్వము విశిష్టమైనది. స్వాభిమానము, అహంకారము ఆయనలో మూర్తీభవించి యుండెను. పేదరికపు పోరు నుండి తప్పించుకొను ఉద్దేశ్యముతో గాలిబ్ ఉద్యోగ ప్రయత్నము గావించినాడు. ఆ కాలమున ఈస్టిండియా కంపెనీ స్థాపించిన ఢిల్లీ కళాశాలలో ఫారసీ అధ్యాపకుని స్థానము ఒకటి ఖాళీ కాగా,

దానికి గాలిబ్ దరఖాస్తు పంపగా, ఆయనను ఇంటర్వ్యూకు రమ్మని పిలుపు వచ్చినది. ఈ పిలుపునందుకొని ఆయన కళాశాల అధికారుల వద్దకు ఒక పల్లకీలో యెక్కి అస్థాన కవి తరహాలో వెళ్ళగా ఆయనకు ఆ స్థాయిలో ఆదరణ జరగలేదు. కళాశాల పక్షాన యెవరో వచ్చి తనకు సాగతమిచ్చి లోనికి తీసికొనిపోవుదురని గాలిబ్ భావించెను. కాని అటువంటి స్వాగతము ఆయనకు లభించనందున, సాధారణ అభ్యర్థులవలెనే ఆయనను చూచినందువలన "ఈ ఉద్యోగము లేకున్న మానె. నా గౌరవానికి భంగము మాత్రము సహించను." అని భావించి గాలిబ్ గృహోన్ముఖుడైనాడు. తరువాత లక్నో నవాబును ఆయన ఆశ్రయించగా అక్కడ గూడ తనకు స్థానము దొరకనందున స్వాభిమానముతో గాలిబ్ ఆ ఆశ్రయమును గూడ వదలుకున్నాడు. ఆ రోజులలో మొగలు వంశానికి చెందిన తుదిరాజైన బహదూర్‌షా ఢిల్లీని పరిపాలించుచుండెను. గాలిబ్ ఆయనను ఆశ్రయించుటకు ప్రయత్నించెను. కాని యీ ప్రయత్నము గూడ సులభముగా జయప్రదము కాలేదు బహదూర్‌షా స్వయముగా కవియై యుండెను. ప్రసిద్ధుడైన జౌఖ్ ఆయన ఆస్థాన కవిగా నుండెను. జౌఖ్ బహదూర్ షాకు ఆస్థానకవియేగాక, కవితా గురువు. జౌఖ్ బ్రతికి యుండగా గాలిబ్‌కు ఆస్థానకవి పదవి లభించు అవకాశము లేకుండెను ఆ పదవి దొరకిననే తప్ప గాలిబ్ రాజాస్థానములో అడుగుపెట్టుటకు ఇష్టపడలేదు. జౌఖ్ మరణించిన తరువాత బహాదూర్‌షా ఆదరము కొంత గాలిబ్‌కు లభించినది. తైమూరు వంశ చరిత్ర ఫారసీభాషలో వ్రాయు పనిగూడ గాలిబ్‌కు జఫర్ అప్పగించెను. లక్నోలో నవాబు వాజిదలీషా అధికారములోనికి వచ్చిన తరువాత ఆయన ఆదరము గూడ మన కవీశ్వరునికి కొంత

లభించినది. కాని ఆ మంచి రోజులు యెక్కువకాలము నిలువ లేదు. 1856 లో వాజిదలీషా పదవీచ్యుతుడైనాడు. 1857 లో సిపాయీల తిరుగుబాటు సందర్భమున బహదూర్‌షా జఫర్ బంధితుడైనాడు. ఈ రెండు సంఘటనల ఫలితముగా గాలిబ్ తిరిగి నిరుద్యోగియై యథాప్రకారము దీనస్థితికి గురియైనాడు. ఆ పిమ్మట ఆయన రామపూర్ నవాబును ఆశ్రయించినప్పటికిని యేదో ఒక సాహిత్యచర్చ సందర్భములో అభిప్రాయ భేదాలు వచ్చినందున ఆయనకు ఆ ఆశ్రయము గూడ త్వరలో తొలగి పోయినది. 'భగవంతుడు నా నుదుట కష్టాలు వ్రాసిపెట్టినాడు' అని ఆ సందర్భమున ఆయన చెప్పుకొన్నాడు. అప్పుడు హైద్రాబాద్‌నుండి ఆయనకు దివాన్ చందూలాల్ వద్దనుండి ఆహ్వానము వచ్చినప్పటికిని అప్పటి చిత్తవృత్తితో ఆయన వెళ్ళ లేదు. ఢిల్లీలో ఆంగ్ల ప్రభుత్వము స్థిరపడినది. అందుచేత తనకు పెన్షన్ లభించగలదని గాలిబ్ ఆశించెను. ఆయన కలకత్తాకు వెళ్ళి ఇంగ్లీషువారిని ఆశ్రయించినాడు విక్టోరియా రాణీమీద ప్రశంసా పద్యాలు వ్రాసినాడు. కాని ఆ ప్రయత్నము గూడ ఆయనకు యెక్కువగా లాభించలేదు. మొత్తముమీద చాల ప్రయత్నము చేసిన తరువాత ఆయనకు కొంత పెన్షన్ లభించినది. అయితే యీ పెన్షన్‌వల్ల ఆయన అప్పులు తీరలేదు ; అవసరాలు తీరలేదు. క్రమక్రమంగా ఆర్థిక బాధలతో ఆయన చితికిపోయి 1869 లో పరలోకగతుడైనాడు. జీవితాంతము ఆయన కష్టాలతో గడపినాడు. ఆయన మరణానంతరమే ఆయనకు గణ్యత, కీర్తి లభించినవని నచో సత్యమునకు తలవంపులు కలుగజాలవు. మనదేశములో అరాజకత్వము, అధికారముకోసము పెనుగులాట విజృంభించిన కాలములో ఇంగ్లీషువారు, మహారాష్ట్రులు భారతదేశ పరిపాలన

హస్తగతము గావించుకొనుటకు సంఘర్షణ పడిన రోజులలో గాలిబ్ జీవించినాడు అప్పటి రాజకీయ పరిస్థితులు కవి పండితుల పోషణకు అనుగుణముగా లేకుండెను. బహదూర్‌షా జఫర్ స్వయముగా కవి, రసికుడు, సారస్వతాభిమాని యైనప్పటికిని చాలినంత అర్థ బలముగాని, అంగబలముగాని లేనివాడు. ఈ కారణాలవలన గాలిబ్‌కు తగిన ఆదరణ లభించలేదు.

గాలిబ్‌కు ఫారసీభాషపట్ల అత్యధికమైన అభిమానము ఆయన తాను వ్రాసిన ఉర్దూ కవిత్వానికన్న తన ఫారసీకవిత్వము మేలైనదని ఉద్ఘాటించెడివాడు 'ఫారసీ నా స్వభావానికి సరిపడిన భాష' అని ఆయన ఒకసారి చెప్పియుండెను. ఈ ఫారసీ వ్యామోహము వలన సాహిత్యరంగములో ఆయనకు చాలమంది శత్రువులైనారు కాని చిత్రమేమనగా ఆయన ఫారసీ కవిత్వము యీనాడు ప్రచారములో లేదు. ఫారసీభాషలో ఆయన రచనలు ప్రామాణికములైనవని సాహితీ విమర్శకులు అంగీకరించినప్పటికిని ఆయనకు శాశ్వతమైన కీర్తి తెచ్చిపెట్టినది ఆయన ఉర్దూ కవితయే. ఉర్దూ భాషలో గాలిబ్ కవితకున్న ప్రభావము మరెవ్వరి కవితకు లేదు. ఉర్దూ వాఙ్మయములో ఉత్తమోత్తమమైనది గాలిబ్ కవిత్వము— ఉర్దూ కవులలో ఉన్నతోన్నతుడు గాలిబ్. ఉర్దూ సాహిత్యములో గాలిబ్ యెంత గొప్ప కవియో అంత గొప్ప వచన రచయిత. నిజానికి ఆధునిక వచన రచనకు ఒరవడి పెట్టినవాడు గాలిబ్. గాలిబ్ తాను వచన రచయితనని యెన్నడు అనుకోలేదు. ఆయన ఉద్దేశ్యపూర్వకముగా వచన రచన గావించలేదు. ఆయన కొందరు మిత్రులకు వ్రాసిన జాబులే వచన రచయితగా ఆయనకు ఉర్దూ వాఙ్మయములో ఉత్కృష్ట స్థానము లభింపజేయుచున్నవి. ఆయన వ్యక్తిత్వము, ప్రజ్ఞా ప్రభావము మనము యీ జాబులలో చూడ

వచ్చును. ఈ జాబులలో ఆయన ఉపయోగించిన శైలి సహజ సుందరమైనది; సరళ మనోహరమైనది. ఇటువంటి వచన శైలి యింతకు ముందెవ్వరు వ్రాయలేదని విజ్ఞుల అభిప్రాయము. ఆయన తర్వాత వచన రచయితలుగా సుప్రసిద్ధులైన హాలీ, షిబ్లీ, సర్ సయ్యద్ అహమద్‌లకు గాలిబ్ శైలి ఒరవడియైనది. ఉర్దూ వాఙ్మయములో అన్నిటికన్న రసవంతమైన కవిత గజల్. ఈ గజల్ రచనలో సర్వోత్తముడు గాలిబ్ మహాకవి. ఆయన ఉర్దూ గజల్‌కు ఒక విశిష్టత గలిగించినాడు. ఉర్దూ కవితా సామ్రాజ్యానికి గాలిబ్ నిర్మకుట చక్రవర్తి. ఆ రంగములో ఆయనతో సమానులు మరొకరు లేరు. ఆధునిక ఉర్దూ కవులలో అగ్రగణ్యుడైన ఎక్బాల్ మీద గాలిబ్ ప్రభావము స్పష్టముగా కనిపించును.

గాలిబ్ మహాకవిని తలచుకొన్నప్పుడు ఆంధ్రకవి సార్వభౌముడు శ్రీనాథుడు మనకు వెంటనే జ్ఞప్తికి వచ్చును. భాషా ప్రౌఢిమలో, భావగాంభీర్యములో శ్రీనాథుని కవిత్వము గాలిబ్ కవిత్వమును జ్ఞప్తికి తెచ్చును. ప్రతిభా వ్యుత్పత్తులు యీ ఉభయుల రచనలలో గోచరించుచు శక్తివంతమైన వారి వ్యక్తిత్వమును ప్రతిబింబింప జేయును. శ్రీనాథునివలె గాలిబ్ గూడ విలాస ప్రియుడు. జీవితములోని మంచిని పూర్తిగా అనుభవించవలెనను అభిప్రాయము గలవాడు. ఎవ్వరికిని యెన్నడును జంకని స్వతంత్రుడు. శ్రీనాథుని వలె గాలిబ్ గూడ ఆనాటి జమీందారులను ఆశ్రయించి సుఖ జీవనమును గడపుటకు ప్రయత్నించినాడు. కాని శ్రీనాథునివలె పాపము గాలిబ్ కృతార్థుడు కాలేకపోయినాడు. శ్రీనాథుడు చరమ దశలో సకల కష్టాలు అనుభవించగా గాలిబ్ జీవితమంతయును ఇక్కట్టులతో, ఇబ్బందులతో గడపినాడు.

గాలిబ్ వ్యక్తిత్వము మిక్కలి ప్రత్యేకమైనది. ఆయన

జీవితమునందును, భావములయందును, శైలియందును యీ ప్రత్యేకత గోచరించును. గాలిబ్ శైలిని తరువాతవారు అనుకరించి అపజయము పొందిన తార్కాణములు యీ సత్యమును ఋజువుచేయుచున్నవి.

జీవితకాలములోనే ఆయన రచనలు రెండుమారులు ప్రచురితమైనవి. ఆయన చనిపోయిన తరువాత అనేక పర్యాయములు ఆయన రచనలు విశేషించి దీవాన్ ఎ-గాలిబ్ అను ఉర్దూ కవితా సంపుటము పెక్కుసార్లు సంపాదకులచే ముద్రితమైనది. ఒక్కొక్క ప్రతి నూట ఏబది రూపాయలవరకు అమ్ముడుపోయిన ఉదాహరణలున్నవి. 1928 లో ప్రచురితమైన సంపుటములో చౌఘ్తాయివంటి ఉత్తమ చిత్రకారుడు ఆయన రచనలకు వ్యాఖ్యానములైన మంచి చిత్రాలను చేర్చినాడు. సైగల్ వంటి గాయకుడు ఆయన గీతాలను గానముచేసి రసికులను ఆనందింపజేసినాడు. హాలీవంటి గొప్ప సాహిత్యవేత్త గాలిబ్ కవి జీవితచరిత్రను వ్రాసినాడు. ఈ విధముగా ఒక చిత్రకారుడు, ఒక గాయకుడు, ఒక సారస్వత విమర్శకుడు గాలిబ్ మహాకవిని అజరామరమైన మూర్తినిగావించి ఉర్దూ సారస్వతములో ఆయన అద్వితీయమైన స్థానమును స్థిరీకరింపజేసినారు.

భారతదేశ చరిత్రలో నాటినుండి నేటివరకు యెన్నియో రాజవంశములు పరిపాలించినవి. ఈ రాజవంశాలను గురించి చెప్పవలసిన మంచి చెడ్డలు చాల గలవు. బాబర్ నుండి బహదూర్‌షా వరకు పరిపాలించిన మొగలాయి రాజుల పరిపాలన సుదీర్ఘమైనది-ప్రత్యేకమైనది. ఈ పరిపాలనను గురించి యెవరు యేమి చెప్పినప్పటికిని ఒక సత్యము మాత్రము అంగీకరించక తప్పదు. ఈ పరిపాలనలో నిర్మితమైన ఉత్తమ కళాఖండము తాజ్‌మహల్. ఈ

పరిపాలన తుది రోజులలో అవతరించిన గాలిబ్ మహాకవి ఉర్దూ సాహిత్య ప్రపంచానికి సూర్యునివంటివాడు. స్వతంత్ర భారత అవతరణకు కారణభూతుడై, స్వరాజ్య సాధనకు అనేక త్యాగాలు గావించిన మహాపండితుడు, మహామేధావి, ఉత్తమ రచయిత, ఉదాత్త సంస్కృతీ పరుడునైన మౌలానా ఆజాద్ తన మీద గాలిబ్ ప్రభావము ఉన్నదని స్వయముగా చెప్పినాడు. ఆయనను ప్రభావితుని జేసిన గాలిబ్ కవిత్వము, వ్యక్తిత్వము, యెంతటి ప్రతిభావంతమైనవో సులభముగా ఊహించుకొనవచ్చును.

(16—7—69)

మహాత్ముని సమకాలికులు

ఏ దేశమందైనా, ఏ కాలమందైనా సమస్త ప్రపంచాన్ని తమ కుటుంబంగా భావించుకున్న మహాపురుషులు సర్వదా కారణ జన్ములు. నిరుపేదలను, నిర్భాగ్యులను ఆత్మీయులనుగా భావించుకొని వారి ఇక్కట్టులను కడగండ్లను తమవిగా భావించుకొని మానవసేవయే మాధవసేవయని భావించిన మహనీయులలో ముగ్గురిని మనము ఒకే తరగతిలో చేర్చవచ్చును. గౌతమబుద్ధుడు, ఏసుక్రీస్తు, గాంధిమహాత్ముడు యీ శ్రేణిలోనివారు. కరుణా స్వరూపులైన యీ ముగ్గురిని మనము స్మరించినపుడు మొదటి యిద్దరి సమకాలికులు యెవ్వరో, వారి ప్రభావము యీ మహనీయుల మీద ఎంతవరకుండినదో మనకు చాలకొద్దిగా తెలుసును. మూడవవాడైన గాంధీ మహాత్ముని మనము స్వయముగా చూచి ఉన్నందువలన ఆయన చరిత్రను ప్రత్యక్షంగా పరిశీలించినందున, ఆయన సమకాలికుల గూర్చిన సమాచారము తగినంత మనముందున్నది.

చాల చిన్నతనములో ఆయనను ప్రభావితుని జేసిన వ్యక్తి ఆయన మాతృదేవి. శైశవముననే సదాశయాలకు ఆయన జీవితము తల్లిగారి ఆజ్ఞచే అంకితమైనది.

విదేశాలలో ఉన్నప్పుడు ఆయనపైన పడిన మొట్టమొదటి ప్రభావము రస్కిన్ రచనలు. ఆయన సర్వోదయ ఆదర్శాలు రస్కిన్ చేతనే ప్రేరితమైనవి. అయితే రస్కిన్ ఆయన సమకాలికుడు కాడు. అంతలో బైబిలు [illegible] గాంధీ మహాత్మునిలోని ఉదారాశయాలను ప్రోత్సహించినది. ఈ పరిస్థితిలో టాల్‌స్టాయ్ రచనలు ఆయనను ఆకర్షించినవి. టాల్‌స్టాయ్ ప్రభావము ఇంచుమించుగా జీవితాంతము మోహనదాసుమీద ఉండినది. టాల్‌స్టాయ్‌తో తరువాత ఆయనకు స్నేహము కలిగి ఉభయుల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు కూడ జరిగినవి. రస్కిన్, క్రీస్తు, గౌతమబుద్ధులతో పాటు భగవద్గీత గాంధీమహాత్ముని జీవితమును సరియైన మార్గములో మలచినది.

స్వదేశ విదేశాలలో మహాత్మునితో కలసి మెలసి పనిచేసిన సహచరులు, ఆయన జీవితాన్ని కొంతవరకు ప్రభావితము చేసిన పెద్దలు, ఆయనను గౌరవించినవారు; ఆయన గౌరవానికి పాత్రులైనవారు, ఆయనతో అభిప్రాయ భేదాలు కలిగినప్పటికి ఆయన ఆదరానికి పాత్రులైనవారు, ఆయనకు సలహాదారులు, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టిన మిత్రులు, శిష్యులు మనముందు చాలమంది కన్పించెదరు. వీరిని గురించి ఇప్పుడు మనము ప్రస్తావించుకోవలసి ఉన్నది.

మహాత్ముని సమకాలికులలో స్వదేశీయులు, విదేశీయులు కూడ ఉన్నారని చెప్పినాను. ఆయనను శాకాహార సమస్యలపట్ల

శ్రద్ధ తీసుకొనునట్లుగా చేసిన ఇంగ్లీషు మిత్రులు కొందరు ఉన్నారు. ప్రపంచ ప్రఖ్యాత రచయిత అయిన రోమారోల గాంధీజీ జీవిత చరిత్రను రచించి తాను ధన్యుడైనట్లు ప్రకటించుకున్నారు దక్షిణ ఆఫ్రికాలో జనరల్ స్మట్సుతో గాంధీమహాత్మునికి సంఘర్షణ సంభవించినది. ఆయన సత్యాగ్రహ విధానానికి మొదటి ప్రయోగ శాల దక్షిణాఫ్రికా. అహింసాత్మకమైన సంఘర్షణ తరువాత గాంధీ స్మట్సుల మధ్య గౌరవాభిమానములు జీవితాంతము వరకుండినవి. మహాత్ముని సమకాలికులై, అతని సహచరులై ఉండిన యిద్దరు విదేశీయులను మనము యీ సందర్భములో పేర్కొనవలసి ఉంటుంది. దీనబంధు, సి. యఫ్. ఆండ్రూస్ మహాత్ముని అడుగు జాడలలో నడిచి భారత స్వాతంత్ర్యోద్యమమున పాల్గొనిన త్యాగ మూర్తి. మిస్ స్లేడ్ అను ఆంగ్ల వనిత మహాత్ముని ఆశ్రమములో చేరి తన పేరును మీరాబాయిగా మార్చుకొని ఆయన ఆశయాల కనుగుణముగా భారత స్వాతంత్ర్యోద్యమానికి తన జీవితమును అంకితము చేసినది

మహాత్ముడు భారత రాజకీయరంగములో అడుగుపెట్టిన కాలమున దిగ్గంతులవంటి వారు, వివిధ రంగాలలో దేశానికి నాయకత్వము వహించి ఉండిరి. భారత మహాపురుషులైన దేవేంద్రనాథ ఠాగూరు, వివేకానందుల పట్ల మహాత్మునికి అపారమైన ఆదరాభిమానాలుండి నప్పటికిని వారిని ఆయన కలసికోవడము జరుగలేదు. దాదాభాయి నౌరోజి వంటి మహామేధావులను, భారత రాజకీయ రంగములో మహాత్ముడు కలసికొన్నాడు. వారిపైన ఆయనకు అపారమైన గౌరవము ఉండినప్పటికిని ఆయన జీవితముపై వారి ప్రభావము హెచ్చుగా పడలేదు. వాస్తవానికి ఆ రోజులలో ఆయనను ప్రభావితము చేసిన వ్యక్తి గోపాలకృష్ణ గోఖలే. యావజ్జీవి

తము మహాత్ముడు గోఖలేను తన గురువుగా భావించుకున్నాడు భారత రాజకీయరంగంలో మహాత్మునికి తొలిశిక్షణ యిచ్చినవాడు గోఖలే. ఆ రోజులలో గోఖలే, తిలక్, ఫిరోజ్‌షా మెహతా భారత రాజకీయ రంగములో ప్రముఖులుగా ఉండిన ముగ్గురు మూర్తులు. ఈ ముగ్గురు పెద్దలను సందర్శించిన మహాత్ముడు తన ఆత్మకథలో కన్నులకు కట్టినట్లుగా వారి వ్యక్తిత్వాలను చిత్రించినాడు. మహాత్మునికి ఫిరోజ్‌షా హిమాలయ పర్వతశ్రేణివలెను, లోకమాన్య బాలగంగాధరతిలక్ మహాసముద్రమువలెను, గోఖలే గంగామతల్లి వలెను కనుపించినారు. హిమాలయపర్వతమునధిరోహించుట అసాధ్యమైన ప్రయత్నము. సముద్రములో దిగి ఈదుట భయంకరమైన కార్యము, కాని గంగానదిలో స్నానముచేసి ఆమె ఒడిలో ఆడుకొనుట చాల ఆహ్లాదకరమైన అనుభవము అని— ఈ ముగ్గురి విశిష్ట వ్యక్తిత్వాలను గూర్చి మహాత్ముడు మనోహరముగా వివరించినాడు. భారతభూషణ మదనమోహన మాలవ్యాపండితుడు మహోన్నతమైన వ్యక్తిత్వముగల మహానాయకుడు. ఆయన హిందూ మతాభిమానము నిస్సీమమైనది విద్యా వ్యాసంగములో ఆయన రక్తి అపరిమితమైనది. సంస్కృతము, హిందీ, ఇంగ్లీషు భాషలలో ఆయన వైదుష్యము, వచోవిలాసము నిరుపమానమైనవి. కాశీ విశ్వవిద్యాలయ స్థాపనలోను అనంతరము దాని అభివృద్ధిలోను గాంధీమహాత్ముడు మాలవ్యా పండితునికి కుడి భుజముగా నిలచినాడు. దేశ స్వాతంత్ర్య సాధనకై ఈ ఉభయులు కలసి మెలసి పనిచేసినారు. కాని వారి వ్యక్తిత్వాల మధ్య ఉత్తర దక్షిణ ధృవాలకున్నంత దూరము. అనేక విషయాలలో వారిరువురికి తీవ్రమైన భేదాభిప్రాయాలుండినవి. అభిప్రాయ భేదాలున్నప్పటికిని గౌరవాభిమానాలకు లోటు వాటిల్లని సమకాలిక మిత్రులు మహాత్మునికి చాల

మంది. శ్రీనివాసశాస్త్రి, తేజ్‌బహదూరు సప్రూలు యీ తరగతికి చెందినవారు శ్రీనివాసశాస్త్రిగారు, గోఖలే శిష్యులు; వారసులు; రాజకీయరంగములో మితవాదులు. అందుచేత మహాత్ముని విధానాలతో ఆయనకు తీవ్రమైన అభిప్రాయ భేదాలుండినవి. అయితే మహాత్ముడు హృదయపూర్వకముగా శ్రీనివాసశాస్త్రిని గౌరవించి ఆదరించినాడు. శాస్త్రిగారికి మహాత్మునిపట్ల అపారమైన అభిమానము. సప్రూగారు గొప్ప న్యాయవాది. ఆయన కూడ మితవాది. మహాత్ముని తీవ్ర విధానాలను ఆయన యెన్నడు హర్షించలేదు. అయినప్పటికి మహాత్ముడు ఆయనను అభిమానించి ఆయన సలహాలను తీసికొన్న నిదర్శనాలను చూపించవచ్చును. స్వాతంత్ర్య ప్రాప్తి తరువాత రాజ్యాంగ పరిషత్తుకు సప్రూగారిని మహాత్ముడు ఆహ్వానించినాడు

రాజకీయరంగములలో మహాత్మునితో సన్నిహితముగా పని చేసిన వారిలో మోతిలాల్, చిత్తరంజన్‌దాస్‌లను మొట్టమొదట పేర్కొనవలెను. మొదట అభిప్రాయ భేదాలను కలిగియుండి తరువాత క్రమక్రమముగా ఆయన కనుచరులై, ఆయన ఆదేశాల ప్రకారము సర్వస్వము త్యాగము గావించిన న్యాయవాద శిరోమణులు మోతిలాల్, చిత్తరంజన్‌దాస్‌లు. చక్రవర్తి రాజగోపాలచారిని కూడ ఈ శ్రేణిలోనే చేర్చవలెను. ఒకప్పుడు మహాత్ముని పక్షాన నిలచి మోతిలాల్ చిత్తరంజన్‌లతో పోరాడి, విజయము సాధించిన రాజగోపాలాచార్యులు తరువాత కొన్ని సంవత్సరముల పిమ్మట కొన్ని ముఖ్య సమస్యల మీద మహాత్ముని వ్యతిరేకించిన సంఘటనలు మనముందున్నవి. రాజగోపాలాచార్యుల కుశాగ్రబుద్ధిపైన, చిత్తశుద్ధిపైన, ప్రతిభాసంపదపైన మహాత్మునికి అచంచల విశ్వాసము. కండ్లు మూసికొని మహాత్ముని అనుసరించిన వారిలో

అబ్దుల్ గఫార్‌ఖాన్, రాజేంద్రప్రసాద్, వల్లభాయి పటేల్‌లను పేర్కొనవలసి యున్నది. కాని ఒకే గురువుకు శిష్యులైన యీ ముగ్గురి ప్రకృతులు భిన్నమైనవి. సత్యాహింసలలో అకుంఠిత విశ్వాసము కలిగిన గఫార్‌ఖాన్ సత్యాగ్రహ సమరసైనికుడు. అజాతశత్రువైన రాజేంద్రబాబు భారత ప్రజానీకానికి మహాత్మునితో సమానమైన ప్రతినిధి. శ్రీరామునికి హనుమంతునివలె మహాత్మునికి నమ్మినబంటుగా నుండిన సర్దార్ పటేల్ రాజనీతికోవిదుడై కార్యశూరుడైన పరిపాలనాదక్షుడు. మహాత్ముని ఆదేశాలను మారు మాటాడక శిరసావహించినవారు వీరు. కాని చిత్రమేమనగా వీరిలో ఒక్కరిని గూడ తన రాజకీయ వారసునిగా ఆయన ఎన్నుకొనలేదు ఆయన రాజకీయరంగములో తన వారసుడని నిర్ణయించిన వ్యక్తి జవహర్‌లాల్. అయితే మౌలానా ఆజాద్‌వలె జవహర్‌లాల్ మహాత్ముని ఆశయాలపట్ల సంపూర్ణమైన విశ్వాసమును కలిగి ఆచరించినవాడు కాదు. కాని నామరణానంతరం నా భాష జవహర్‌లాల్ మాట్లాడునని మహాత్ముడు చెప్పిన మాటలు తరువాత సత్యమైనవి. చిన్నతనముననే సీమకేగి, విద్యాభ్యాసము అంతా అక్కడనే పూర్తిచేసికొని పడమటి సభ్యతను ఆకళించుకొన్న సామ్యవాది జవహర్లాల్. తూర్పు పడమరల సంస్కృతీ సమన్వయము జవహర్లాల్‌లో మనము చూడవచ్చును. ఇటువంటి చిత్తవృత్తి గల జవహర్లాల్ గాంధేయుడుగా పరిణతి చెందడానికి కొంత కాలము పట్టినది. జయప్రకాశ్‌నారాయణ మహాత్మునితో అభిప్రాయభేదాలు కలిగి తొలిదశలో అహింసలో యెక్కువ నమ్మకము లేకపోయినప్పటికి తరువాత క్రమక్రమముగా మానసిక పరిణామము పొంది సర్వోదయానికి గాంధీ వాదానికి ప్రధాన ప్రతినిధిగా నిలచియున్నాడు. మహాత్ముడు తన చేతులార పెంచి పెద్దజేసిన పెంపుడు కూతురు

ప్రభావతీదేవిని జయప్రకాశ్‌నారాయణకు యిచ్చి పరిణయము జేసినాడు. సుభాష్‌చంద్రబోసు మహాత్ముని శిష్యుడుగా ప్రారంభించి తరువాత ఆయనను ధిక్కరించిన నాయకుడు. సుభాష్‌చంద్రబోసు పట్ల మహాత్మునికి సర్వదా ప్రేమాభిమానములుండినవి. సరోజినీదేవి మహాత్మునికత్యంత సన్నిహితురాలైన విదుషీమణి. మహాత్మునితో ఆమెకు ఉండిన చనువు మరొకరికి లేకుండెను. అనేక పర్యాయాలు మహాత్మునికి సేవచేసే భాగ్యము ఆమెకు లభించినది. తెలుగువారిలో మహాత్ముని అంతరంగ శిష్యులు చాలమంది— మహాత్ముడు సూత్రకారుడైతే, ఆయన భాష్యకారుడని ప్రఖ్యాతిగాంచిన మేధావి పట్టాభిసీతారామయ్యగారు. మహాత్మునికన్న వయసులో కొన్ని సంవత్సరాలు పెద్దవాడైన— అనేక పర్యాయాలు ఆయన అభిప్రాయాలను వ్యతిరేకించి ఆయన మార్గాలను అనుసరించనప్పటికిని, మహాత్ముని నాయకత్వానికి గొప్ప నైతిక బలమును సమకూర్చినవాడు రవీంద్రుడు. ఆ ఉభయుల స్నేహము విచిత్రమైనది. రవీంద్రుడు సౌందర్యానికి చిహ్నమైతె, జవహర్లాల్ శాంతికి ప్రతిబింబమైతె, మహాత్ముడు సత్యానికి స్వరూపము. ఈ ముగ్గురి వ్యక్తిత్వాల సమ్మేళనమే భారతీయ సంస్కృతి. రవీంద్రుని మహాత్ముడు గురుదేవుడని పిలిచినాడు. భారతదేశానికి మహాత్ముని యేకైక నాయకత్వాన్ని రవీంద్రుడు బలపరచినాడు. ఆజన్మాంతము వారి మధ్య ప్రేమాభిమానాలు దినదినాభివృద్ధి జెందినవి.

మహాత్ముని ఉదారాశయాలు త్రికరణశుద్ధిగా నమ్మి ఆచరించిన శిష్యులు ముగ్గురు వినోబాభావే, ఆచార్య భాన్సాలీ, కాకా కలేల్కరులు మహాత్ముని నమ్మిన బంటులు. సంయమీంద్రులైన యీ ముగ్గురు మహనీయులు విజ్ఞానసముద్రమును ఆపోశనము పట్టిన అగస్త్యులు ; గాంధీ మహాత్ముని ఆస్థాన విద్వాంసులు.

మహాత్ముని ఆశయాల కనుగుణముగా తమ జీవితమును మలచి కొన్న వ్యక్తులు ఆచార్య కృపలానీ, ప్యారీలాల్, సుశీలానయ్యర్‌లు. ఈ ముగ్గురు మహాత్మునితో చాల దగ్గరగా మెలగిన వ్యక్తులు. మహదేవదేశాయ్ తన జీవితమును మహాత్మునికంకితము జేసినాడు. నిజానికి మహాత్ముని హృదయమును ఆయన భాషలోనే విప్పి చెప్పగలిగిన వాడు మహదేవదేశాయ్. మహదేవదేశాయ్ అకాల మరణము మహాత్మునికి పుత్రశోకము కలిగించినది.

మహాత్ముని జీవితములో పాలుపంచుకొని మొట్టమొదలు కొన్ని విధానాలను యిష్టపడక తరువాత క్రమక్రమముగా అన్నింటి లోన సంపూర్ణ విశ్వాసము కలిగి ఆయనను అనుసరించిన సాధ్వీ మణి కస్తూరిదేవి. వశిష్ఠునికి అరుంధతివలె మహాత్మునికి కస్తురబా తోడునీడయైనది.

మహాత్ముని సాహచర్యముచేత ప్రతిభావితుడైన వాడు మౌంట్‌బాటన్– చాల ఆలస్యముగా మహాత్మునితో ఈయనకు స్నేహము తటస్థించినప్పటికి మౌంట్‌బాటన్‌కు మహాత్మునిపట్ల ఏర్పడిన భక్తి విశ్వాసాలు అద్వితీయమైనవి. మహాత్ముడు నిస్స హాయుడై నౌఖాలిలో శాంతియాత్ర సాగించిన సందర్భములో మౌంట్‌బాటన్ చెప్పిన మాటలు ఎల్లప్పుడు మన చెవులలో ప్రతి ధ్వనించును. "ఒకవైపు సుమారు అరలక్షమంది సైనికులు సాయుధులై పంజాబు సరిహద్దు మీద రక్తప్రవాహాలను ఆపి శాంతిస్థాపన చేయుచుండగా, మరొకవైపున నిరాయుధులైన యిద్దరు, ముగ్గురు సహచరులతో పాదయాత్ర జేస్తూ బంగాళా ప్రాంతమున గాంధీజీ శాంతిస్థాపన గావించినాడు" ఆ సైనికుల కృషికన్న మహాత్ముని కృషి మహత్తరమైనది. మానవాళికి మార్గ దర్శకమైనది. ప్రపంచ కల్యాణానికి వెలుగుబాట యైనది

మహాత్ముడు పురుషోత్తముడగునోకాదో, ఆ చర్చ యెట్లు న్నప్పటికీ, ఆయన ఉత్తమోత్తముడైన పురుషుడని నిస్సందేహంగా చెప్పవచ్చును. హరేరాం హరేరాం అంటూ అసువుల బాసిన మహాత్ముడు 'బలమునీవ నాకు భక్తుండ నీ యెడ, ఇమ్మనుజ్ఞ కమలదళ మనోజ్ఞ నయన, అన్నట్లుగా పరమేశ్వరునిలో పరిపూర్ణ విశ్వాసము ఉంచి, తన ధర్మమును నిర్వహించిన ప్రపంచ పౌరుడు, నిష్కామకర్మయోగి. ఆ మహనీయుని సాహచర్య భాగ్యము కలిగిన సమకాలికులు యెంత భాగ్యశాలురో, యెంత ధన్యజీవులో కదా!.

(4—4—70)

లాల్ బహద్దుర్ శాస్త్రి

స్వర్గీయ లాల్ బహద్దుర్ శాస్త్రి భారతదేశానికి రెండవ ప్రధానమంత్రి. మొదటి ప్రధానమంత్రియైన స్వర్గీయ జవహర్లాల్ నెహ్రూ, మూడవ ప్రధానమంత్రియైన శ్రీమతి ఇందిరాగాంధీల వలె ఆయన ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందినవాడు ; విశేషించి లక్నో - అలహాబాదులలో రాజకీయ శైశవమును గడిపినవాడు. మొదటి ప్రధానమంత్రికి రెండవ ప్రధానమంత్రికి వయస్సులో పదిహేను సంవత్సరాల వ్యత్యాసమైనచో రెండవ ప్రధానమంత్రికి మూడవ ప్రధానమంత్రికి గూడ వయసులో దాదాపు అంతే వ్యత్యాసమున్నది. అన్నిటికన్న మిన్నగా యీ ముగ్గురు ప్రధాన మంత్రులు భారత రాజకీయ రంగములో అత్యంత సన్నిహితులుగా మెలగి పరస్పర ప్రభావితులైన వ్యక్తులు, ప్రత్యేకించి జవహర్లాల్ ముద్ర కడమ యిద్దరి మీద ప్రస్ఫుటముగా గోచరించుచున్నది. స్వతంత్ర భారత చరిత్రను పరిశీలించినవారికి యీ ముగ్గురు ప్రధానమంత్రులు ఒకే రాజకీయ కుటుంబపు సన్నిహిత

సభ్యులుగా సాక్షాత్కరించుచుందురు. మొదటి ప్రధానమంత్రి సిరిసంపదల మధ్య జన్మించి శైశవదశను, విద్యార్థిదశను రాజ భోగాలతో గడిపి, భారతదేశపు నిర్మకుట సార్వభౌముడుగా ప్రశస్తిగాంచిన మోతిలాల్ నెహ్రూను రాజకీయ వారసుడుగా భాసించినాడు; తండ్రి వదలిన తత్క్షణమే, జాతిపిత గాంధీజీ ఆశీర్వాదాలతో జవహర్లాల్ కాంగ్రెసు అధ్యక్షపదవిని చేపట్టినాడు. కాని లాల్‌బహద్దుర్ కటికదరిద్రములో జన్మించి, యిక్కట్టులతో [illegible] ఒక్కొక్క మెట్టు పై కెక్కినాడు. జవహర్లాల్ పదునేడుంది సంవత్సరాలు ప్రధానమంత్రి పదవిని నిర్వహించగా లాల్‌బహద్దుర్ పదునెనిమిది నెలలు మాత్రమే ప్రధానిగా పనిజేసి నప్పటికిని భారతదేశ చరిత్రలో జవహర్లాల్ వెనుక నిలువగలిగిన వ్యక్తిగా తన స్థానమును సుస్థిరము గావించుకొనినాడు. రామాయణములో శ్రీరామచంద్రునికి హనుమంతునికి మధ్యగల సంబంధము వంటిదే ఆధునిక భారతములో జవహర్లాల్‌నెహ్రూ లాల్‌బహద్దుర్‌ల సంబంధము.

గాంధీమహాత్ముడు అవతరించిన పవిత్రదినము నాడే ౨ అక్టోబరు ౧౯౦౪ ఒక నిరుపేద కుటుంబములో లాల్‌బహద్దుర్ జన్మించినాడు. ఇక్కట్టులు ఒక్కటిగా రావన్నట్లుగా శైశవముననే తండ్రి మరణించగా మాతృదేవి పర్యవేక్షణలో లాల్‌బహద్దుర్ మాతామహుల యింట పెరిగినాడు చిన్నప్పుడు ఒకజత బట్టలతో మాత్రమే ఆయన అనేక మాసాలు గడుపవలసి వచ్చినదని చెప్పి నచో అప్పటి ఆయన పరిస్థితిని మనము ఊహించుకొనవచ్చును. పేదతనములో నున్న పెద్ద కుటుంబమును పోషించవలసిన బరువు బాధ్యతలు తనపై నున్నప్పటికిని విద్యార్థిగా నున్నప్పుడే ఆయన

గాంధీజీ పిలుపునందుకొని సహాయనిరాకరణోద్యమములో దుమికి నాడు. మొట్టమొదట తిలక్ ప్రభావము తరువాత గాంధీజీ ప్రభావము ఆయన రాజకీయ జీవితానికి రూపురేఖలు దిద్దినవి ఆంగ్ల విద్యకు స్వస్తిజెప్పి అప్పుడే ప్రారంభించిన కాశీ విద్యాపీఠములో ఆయన విద్యార్థిగా ప్రవేశించినాడు. అప్పుడు కాశీ విద్యాపీఠానికి భారతరత్న స్వర్గీయ భగవాన్‌దాస్ ప్రధానాచార్యుడు; భగవాన్ దాస్ మహావిజ్ఞాని; గొప్ప పండితుడు; భారత తత్త్వశాస్త్ర సముద్రమును ఆపోశనము పట్టిన అగస్త్యుడు ఆ మహాపురుషుని శుశ్రూష లాల్‌బహద్దుర్ జీవిత సౌధానికి గట్టి పునాదులు వేసినది అదే కాలములో ఆచార్య నరేంద్రదేవ్, అక్కడ అధ్యాపకులుగా నుండిరి ఆచార్య నరేంద్రదేవ్ ఆదర్శపాత్రమైన జీవనము, సౌజన్యము, విజ్ఞానము లాల్‌బహద్దురును ఆకర్షించినవి. శాస్త్రి పరీక్షలో లాల్‌బహద్ధుర్ ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడైనాడు విద్యార్థిగా నున్నప్పుడే ఆయన టాల్‌స్టాయ్, రామకృష్ణపరమహంస, వివేకానందుల గ్రంథాలతో పాటు లెనిన్ సిద్ధాంతాలను గూడ ఆకళించుకొనినాడు అప్పుడే ఆయన తన జీవితమును నియమబద్ధముగా, నిరాడంబరముగా గడపవలెనని ప్రతిజ్ఞచేసి దానిని ఆజన్మాంతము పాలించి నాడు. విద్యాభ్యాసము పూర్తికాగానే కుటుంబములో పెద్దల కోరిక ప్రకారము ఆయనకు వివాహము జరిగినది. అనసూయవంటి మాతృమూర్తి ఆశీర్వచనము, సీతమ్మవంటి అర్థాంగి సాహచర్యము ఆయన వ్యక్తిగత జీవితములో రెండు అత్యంత అదృష్టకరమైన సంఘటనలు. భారతీయ సంస్కృతికి సజీవ చిహ్నములైన యీ సాధ్వీమణులు లాల్‌బహద్దుర్ గృహమును సత్యసందీప్తము కావించినారు. తరువాత కొంత కాలానికి లాల్‌బహద్దుర్ అలహాబాదు ప్రవేశించి తమ కుటుంబము యెదుర్కొనుచుండిన డబ్బు

యిబ్బందులను సైతము లెక్కచేయక తీవ్రమైన రాజకీయ ఉద్య
మానికి, దేశదాస్యశృంఖలా విమోచనానికి అంకితమైనాడు. అనేక
పర్యాయములు ఆయన కారాగారానికి వెళ్ళవలసి వచ్చినది అతి
సామాన్యుడైన కార్యకర్తగా, హరిజన సేవకుడుగా దేశసేవను
ప్రారంభించి క్రమక్రమముగా, నిస్వార్థ సేవానిరతితో ఆయన
అత్యున్నతమైన స్థానమును ఆక్రమించగలిగినాడు. ౧౯౨౮ లో
అలహాబాద్ మ్యునిసిపాలిటీ అధ్యక్షుడుగాను, ౧౯౩౭ వ సంవత్స
రములో ఉత్తరప్రదేశ్ శాసనసభ్యుడుగాను, ౧౯౪౭ లో ఉత్తర
ప్రదేశ్ హోంమంత్రిగాను ఆయన పనిచేసినాడు ౧౯౫౧ లో
లాల్‌బహద్దుర్‌కు అయాచితముగా లభ్యమయిన అఖిల భారత
కాంగ్రెస్ కార్యదర్శి పదవి ఆయన జీవితములో ఒక పెద్ద మలుపు
వంటిది; ఆ పదవిలో ఆయన జవహర్లాల్ రాజకీయ అంతరంగా
నికి తన ప్రజ్ఞా బలముచేత అతి సన్నిహితుడు కాగలిగినాడు.
౧౯౫౨ సాధారణ యెన్నికలలో కాంగ్రెసు సంస్థ వ్యవహారాల
నిర్వహణ బాధ్యతను జవహర్లాల్ శ్రీ శాస్త్రికి అప్పగించినాడు.
ఈ బాధ్యతను అత్యంత ప్రతిభావంతముగా నిర్వహించి రాష్ట్ర
రాజకీయరంగపు పరిమిత పరిధులను దాటి లాల్‌బహద్దుర్ అఖిల
భారత రాజకీయరంగపు విశాల వేదిక మీద అడుగు పెట్టినాడు
తరువాత ఆయనకు కేంద్ర మంత్రివర్గములో అనేక శాఖలు లభ్య
మైనవి; మంత్రి పదవులను ఆయన తృణప్రాయముగా చూచి
నప్పటికిని ఆయనను మాత్రము ఆ పదవులు వరించుట మానలేదు.
అయితే ఆయన కుటుంబపు ఆర్థిక పరిస్థితులు మెరుగుపడలేదు;
సొంతమును గూర్చి ఆయన యెన్నడు ఆలోచించలేదు అందుకు
ఆయనకు వ్యవధియే లేకుండెను. ౧౯౫౬ లో రైలు ప్రమాదాలు
హెచ్చుగా సంభవించినందున ఆయన తన రైల్వే మంత్రిపదవికి

రాజీనామా యిచ్చి ఒక ఉత్తమ పార్లమెంటరీ సంప్రదాయానికి మార్గదర్శకుడైనాడు. ౧౯౫౨, ౧౯౫౭ సంవత్సరాలలో జరిగిన సాధారణ యెన్నికల సందర్భమున కాంగ్రెసు వ్యవహారాలకు తిరిగి నాయకత్వము వహించి భారత రాజకీయ నాయకులలో లాల్‌బహద్దుర్ కీలకమైన స్థానమును అలంకరించుట జరిగినది. ౧౯౬౧ మార్చి నెలలో మహామేధావి, గొప్ప పరిపాలనాదక్షుడు, అత్యంత ప్రతిభావంతుడైన పార్లమెంటేరియన్‌గా ప్రఖ్యాతిగాంచిన [illegible] జవహర్లాల్ అభిమానము ఆయన సంపూర్తిగా ఉత్తమ ఉదాహరణము. ౧౯౬౩ లో కామరాజ్ పథకము క్రింద లాల్‌బహద్దుర్ ప్రభుత్వము నుండి నిష్క్రమించినప్పటికిని తిరిగి కొద్దికాలము లోనే "తాను చేయుచున్న పనులన్నింటిని నిర్వహించు"కొరకని శ్రీ నెహ్రూ ఆయనను తన మంత్రివర్గములో చేర్చుకొనుట ఆయన యోగ్యతకు మరొక మంచి తార్కాణము. ఈ సంఘటనయే ఆయన జవహర్లాల్ నెహ్రూకు రాజకీయ వారసుడని నిరూపించినది.

౧౯౬౪ మే నెలలో శ్రీ జవహర్లాల్ అస్తమించిన తరువాత ప్రధానమంత్రి పదవికి లాల్‌బహద్దుర్ యేకగ్రీవముగా యెన్నికయై ౧౯౬౬ జనవరి పదకొండు వరకు అత్యంత ప్రతిభావంతముగా, చరిత్రాత్మకముగా దేశపరిపాలనా రథానికి సారథ్యము వహించినాడు. ప్రధానమంత్రిగా మన పొరుగు దేశాలయిన బర్మా, సిలోన్, నేపాల్, అఫ్ఘనిస్తాన్, జపాన్ వంటి దేశాలతోనే గాక కెనడా, యుగొస్లేవియా, అరబ్ రిపబ్లిక్‌ల వంటి సుదూర దేశాలతో గూడ ఆయన మన సంబంధాలను పటిష్టము గావించినాడు. అంతేకాదు రష్యా, అమెరికా, ఇంగ్లండులతో మన దేశానికి ఉండిన సుహృత్సంబంధాలను ఆయన అభివృద్ధిచేసినాడు. ౧౯౬౫ సెప్టెంబరులో

పాకిస్తాన్ దాడిచేసిన సందర్భమున ఆ దురాక్రమణను అపూర్వమైన ధైర్యసాహసాలతో యెదుర్కొని భారతదేశానికి విజయమును సంపాదించి భారతదేశ చరిత్రలో శాశ్వత స్థానము సంపాదించినాడు. తరువాత తాష్కెంట్‌లో పాకిస్తాన్ అధినేతతో శాంతి ఒప్పందము చేసుకొనుటలో గూడ ఆయన నిరూపమానమైన ప్రజ్ఞను, నిశ్చలమైన శాంత్యభిలాషను ప్రదర్శించినాడు యుద్ధము, శాంతి యీ రెండింటికి సంబంధించిన సమస్యలను యెదుర్కొని పరిష్కరించుటలో లాల్‌బహద్దుర్ చూపిన రాజనీతి వేతృత్వము, అద్వితీయమైనది. "మెత్తని పులి ధర్మరాజు" అని తిక్కన చెప్పినమాట లాల్‌బహద్దుర్ శాస్త్రికి సంపూర్ణముగా అన్వయించు చున్నది

బహు గ్రంథావలోకనము గావించి, బహు దేశబుధులతో భాషించి, బహు గ్రంథ రచయితయైన జవహర్లాల్ వలె లాల్‌బహద్దుర్ కళోపాసకుడు కాదు. మోతీలాల్, చిత్తరంజన్‌దాస్‌ల వలె యెంతటి మేధావినైనను పల్టీలు గొట్టించగలిగిన ప్రతిపాది భయంకరుడైన న్యాయవాది కాడు ఆయన. తిలక్, మాలవ్యాలవంటి మహాపండితుడు కాడు ఆయన. గోపాలకృష్ణ గోఖలే, లజ్‌పత్ రాయ్‌ల వంటి విజ్ఞాని ఆయన కాడు. సురేంద్రనాథ్ బెనర్జి, బిపిన్ చంద్రపాల్‌ల వంటి మహావక్త కాడు రాజగోపాలాచార్యులవలె సంభాషణలో యెదుటి వారిని మంత్రముగ్ధులను చేయగలిగిన వచో విలాసము ఆయనకు ఉండలేదు. సుభాష్‌చంద్రబోస్, జయప్రకాశ్‌ల వంటి విప్లవవీరుడు కాడాయన. అయినప్పటికిని దిగ్దంతులైన యీ మహాపురుషుల శ్రేణిలో చేరదగిన సాధుసత్తముడు లాల్‌బహద్దుర్. ఇందుకు ఆయనకుగల యోగ్యత ఒక్కటే; అదియే ఆయన

[3]

శీలసంపద. ఉత్తమ పురుషుడైన గాంధీజీ అడుగు జాడలలో ఆయన తన శీలసంపదను దిద్ది తీర్చుకొనినాడు.

లాల్‌బహద్దుర్‌శాస్త్రి జీవితము త్యాగశోభితమైనది. ఆయన ఆకారమువలె వేషభాషలు గూడ నిరాడంబరమైనవి. పదవుల కోసము ఆయన యెన్నడు ప్రాకులాడలేదు. తనను వెదకుకొని వచ్చిన పదవులను అవసరమైనప్పుడు పదలి వేయుటలో ఆయన యెన్నడు సంకోచించలేదు. రాజకీయ అధికార ప్రపంచములో తామరపాకు మీద నీటిబొట్టు వలె ఆయన వ్యవహరించినాడు. చిత్తశుద్ధి, నీతి, నియమపాలనము ఆయన జీవితవైభవానికి ప్రధాన ప్రాతిపదికలు. ఆస్తి సంపాదనను గూర్చి ఆయన యెన్నడును ఆలోచించలేదు. తన కుటుంబానికి కొడుకులకు, కూతుండ్రకు, అల్లుండ్రకు సుఖజీవితము కల్పించు కార్యక్రమాలపట్ల ఆయన యెన్నడు శ్రద్ధ తీసికొనలేదు. ఆయన మాతృదేవిగాని, సహధర్మచారిణిగాని యీ విషయములో ఆయన మీద యెటువంటి ఒత్తిడిని తెచ్చినట్టు కానరాదు. తుదకు సొంతగృహమైనను ఆయన నిర్మించుకొనలేదు. ప్రపంచ రాజకీయ చరిత్రలో, ఉన్నతోన్నతమైన రాజకీయ పదవులను నిర్వహించిన వారియందు, నిలుచుటకు నీడయైనను సంపాదించుకొనని యేకైకవ్యక్తి, ఉదార చరిత్రుడు లాల్‌బహద్దుర్. తిలక్, గాంధీలచే ప్రభావితుడై, భగవాన్‌దాస్, నరేంద్రదేవ్‌ల శుశ్రూష కావించి, రాజర్షి పురుషోత్తమదాస్ టాండన్ అడుగుజాడలలో రాజకీయరంగమున శిక్షణపొంది, తరువాత జవహర్లాల్‌నెహ్రూ ఆశయాలచేత, కార్యక్రమాలచేత, వ్యక్తిత్వముచేత ఉత్తేజము పొంది, ఆయనకు అత్యంత సన్నిహితుడై, అతి విశ్వసనీయుడైన అనుచరుడుగా నుండి భారత రాజకీయ గగనములో ప్రకాశించిన దివాకరుడు లాల్‌బహద్దుర్.

భారత రాజకీయాలలో గాంధీ యుగమున మహానాయకు లనేకులు ఉద్భవించినారు. ఈ నాయకుల పోలికలు అనేకము లాల్‌బహద్దుర్ వ్యక్తిత్వములో మేలికలయిక నొంది మనకు కనిపించుచున్నవి. రాజేంద్రబాబు వలె లాల్‌బహద్దుర్ అజాత శత్రువు; హితభాషి - మితభాషి. ఉక్కుమనిషియైన సర్దార్ పటేల్ వ్యవహారదక్షత, నిర్వహణ కౌశలము గూడ లాల్‌బహద్దుర్‌లో నిబిడీకృతమైనవి. కుసుమమువలె మృదువైనప్పటికిని అవసరమైనప్పుడు వజ్రమువలె కఠోరము కాగలిగినది ఆయన వ్యక్తిత్వము. రాజాజీ, గోవిందవల్లభ్‌పంత్‌ల వలె యుక్తియుక్తముగా వాదించు నేర్పు, రాజనీతి కౌశలము యెత్తుకు పైయెత్తు వేయగల చాతుర్యము లాల్‌బహద్దుర్‌లో మనకు గోచరించుచున్నవి త్యాగము చేయవలసి వచ్చినప్పుడు అరనిముసము గూడ ఆలోచించక ముందుకు అడుగు వేయుటలో యెవరికిని తీసిపోనివాడు లాల్‌బహద్దుర్. భారతదేశ సర్వతోముఖాభివృద్ధి ఆయన జీవిత లక్ష్యము. సామ్యవాద సిద్ధాంతాల పట్ల ప్రజాస్వామిక సంప్రదాయాల మీద అచంచలమైన విశ్వాసము ఆయనకు జవహర్లాల్‌తో గల దగ్గరి చుట్టరికానికి ప్రధాన కారణాలు. ఈ కారణాలే జవహర్లాల్‌కు లాల్‌బహద్దుర్‌లో సంపూర్ణమైన విశ్వాసమును కలిగించినవి

భారతదేశానికి మీ జీవితకాలములో స్వాతంత్ర్యము వచ్చినచో మీరే బాధ్యతను స్వీకరింపదలచినారని ఒకమారు బాలగంగాధర తిలక్‌ను యెవరో ప్రశ్నించినారట; అందుకు సమాధానముగా ఆయన అరనిమిషము గూడ ఆలోచించక "ఫెర్గుసన్ కళాశాలలో గణితశాస్త్ర అధ్యాపక పదవి నాకు కావలెన"ని చెప్పినారట. కాని ఆయనకు అటువంటి అవకాశము లభించలేదు. జాతిపిత గాంధీమహాత్ముడు దేశస్వాతంత్ర్యము వచ్చిన పిదప యే పదవిని

కాంక్షించలేదు. తనకు అత్యంత సన్నిహితులైన అనుచరులు దేశ పరిపాలనా బాధ్యతను స్వీకరించగా గాంధీమహాత్ముడు కాలినడకన నౌఖాలిలో పర్యటించి శాంతిస్థాపన కృషికి ఆత్మార్పణ కావించినాడు. ఈ యిద్దరిచేత ప్రబోధితుడై సొంతమును గూర్చి యెన్నడు యోచించని లాల్‌బహద్దుర్‌శాస్త్రి ప్రధానమంత్రిపదవిని స్వీకరించిన సందర్భమున ''జీవితములో యేమి వచ్చినను రాకపోయినను, ప్రాణము ఉన్నను పోయినను, లాల్‌బహద్దుర్ దేశకల్యాణము కొరకు ఆత్మార్పణము చేయవలసి యుండును. అదియే నా కోరిక'' అని ఆయన మాతృదేవి ఆశీర్వదించినది. సాధ్వీమణుల వచనములు సత్యసామీప్యములు— అమోఘమైన ఆమె వాక్కులు అక్షరాలా నిజమైనవి. లాల్‌బహద్దుర్ ధన్యజీవి; సత్యమూర్తి; త్యాగశీలి.—

(1969)

లాలాలజపత్ రాయ్

భారతదేశ స్వాతంత్ర్యము నాలుగైదు తరాలకు చెందిన మహనీయులు, త్యాగమూర్తులు చేసిన అపార కృషి ఫలితము. ఒక్కమారు యీనాడు, యీ కృషిని సమీక్షించుకొన్నప్పుడు ఇందులో కొన్ని దశలను స్థూలముగా మనము నిర్ణయించవచ్చును. ఈ దశలో ఒక్కొక్క దానికి ఒక్కొక్కరు నాయకత్వము వహించి నప్పటికిని, మేధాశక్తిలోను, త్యాగ సంపదలోను ఆ నాయకునికి తీసిపోనటువంటి నాయకమణులు ప్రతి దశలోను కనిపించుచున్నారు. ఈ నాయక శ్రేణిలో లాలాలజపత్ రాయ్ విశిష్ట వ్యక్తిత్వము కలిగిన మహనీయుడు.

కాంగ్రెస్ స్థాపన తరువాత మొదటిదశకు నాయకత్వము వహించిన త్యాగమూర్తి దాదాభాయి నౌరోజి. మొదటిదశ నౌరోజి యుగమైనచో, రెండవదశ లోకమాన్యుని యుగము ; మూడవదశ గాంధీజీ యుగము ; నాలుగవదశ జవహర్లాల్ యుగము. కాంగ్రెస్ చరిత్రను మనము యీ నాలుగు యుగాలుగా విభజించవచ్చును.

దాదాభాయి ప్రభృతులు గావించిన ప్రబోధము దేశములో మంచి జాతీయ వాతావరణము కలిగించినది; ఈ వాతావరణములో లోకమాన్యుడు స్వరాజ్యము నా జన్మ హక్కని ఉద్ఘాటించినాడు. లోకమాన్యుని పిలుపునందుకొని, గాంధీజి భారత జాతీయ కాంగ్రెస్‌కు స్పష్టమైన రూపురేఖలు దిద్ది, తదాశయములను అసందిగ్ధముగా ఉద్ఘాటింపజేసినాడు. గాంధీజి మార్గదర్శకత్వమున సత్యాహింసల ద్వారా పూర్ణ స్వరాజ్యము సాధింపవలెనని నిర్ణయించుకొనిన కాంగ్రెస్ జవహర్లాల్ నేతృత్వమున, పార్లమెంటరీ ప్రజాస్వామికము, లోకశ్రేయస్సుకు అనుగుణమైన విదేశాంగ విధానము, సామ్యవాదము అను ఆశయాలను నిర్వచించి, వాని సాధనకొరకు కృషిచేయవలెనని తీర్మానించినది. ఈ నాలుగు దశలలో రెండవదశయైన లోకమాన్యుని యుగానికి చెందిన పురుషసింహము పాంచాలకేసరి లాలాలజపత్‌రాయ్.

లోకమాన్యుని యుగమున ఆసేతుహిమాచల పర్యంతమైన భారతదేశము నందంతటను ముగ్గురి నామములు ప్రతిధ్వనించినవి. లాల్, బాల్, పాల్ అనునవియే యీ మూడు నామములు. లాల్ అనగా లాలాలజపత్‌రాయ్, బాల్ అనగా బాలగంగాధరతిలక్, పాల్ అనగా బిపినచంద్రపాల్. త్రిమూర్తులవలె ఆనాడు భారత జాతీయ రంగమున యీ ముగ్గురు శోభిల్లిన సంఘటన ఆ రోజులు చూచిన వృద్ధమూర్తులు మహోత్సాహముతో జ్ఞప్తి చేసికొనుచుందురు.

లాలాజి పాంచాలకేసరి యని ప్రసిద్ధి గాంచినారు. ఈ బిరుదు సర్వవిధాల ఆయనకు సార్థకమైనది. ఆయన ఆకారము, విజ్ఞానము, పరాక్రమము ఆయనకు నాటి నాయకమణులలో సింహమను పేరును సంపాదించినవి. లాలాజి తన రాజకీయాభిప్రాయాలను యెన్నడు దాచుకొనలేదు; సింహమువలె యెలుగెత్తి యీ

అభిప్రాయాలను చాటుటకు ఆయన వెనుదీయలేదు. సహజముగా ఆనాటి ఆంగ్ల ప్రభుత్వానికి కంటప్రాయమైనదిది. కావున, నిరంతరము గూఢచారుల బాధను ఆయన యెదుర్కొనవలసి వచ్చుచుండెను. ఈ బాధ సహింపరానిదిగా విజృంభించినప్పుడు లాలాజి అమెరికాకు కొంతకాలము ప్రవాసము వెళ్ళుటగూడ జరిగినది. అమెరికాలో గూడ లాలాజి నిరంతరము భారత స్వాతంత్ర్యమును గూర్చి కలలు గాంచి కొంత కృషి గావించినారు.

కాంగ్రెస్ చరిత్రను అవలోకించినప్పుడు, అధ్యక్ష పీఠము నలంకరించిన మహనీయులలో కొందరికి యీ గౌరవము చాల తొందరగా లభించినదనియు, మరికొందరికి యీ గౌరవము చాల ఆలస్యముగా లభించినదనియు వెల్లడియగుచున్నది. సర్వవిధములైన అర్హతలను హక్కును కలిగియుండియు కొన్ని కారణాల వలన కాంగ్రెస్ అధ్యక్షపీఠము నలంకరింపజాలని నిదర్శనాలు గూడ మనకు గోచరించుచున్నవి. ఈ నిదర్శనాలలో లోకమాన్య బాలగంగాధర్ తిలక్‌గారి పేరు ప్రత్యేకముగా చెప్పవలసియున్నది. కాకలుదీరిన కాంగ్రెస్‌వాది యైనప్పటికిని, లాలాలజపత్‌రాయ్‌కు కాంగ్రెస్ అధ్యక్షపదవి నలంకరించు గౌరవము 1920 వ సంవత్సరము వరకు లభించలేదు. అంతకుముందు రెండు మూడు పర్యాయములు కాంగ్రెస్ అధ్యక్షపదవికి పాంచాలకేసరి పేరు ప్రతిపాదించబడినప్పటికిని, లోకమాన్యుడు ఇందుకొరకు కృషి గావించినప్పటికిని, లాలాజికి యీ గౌరవము లభించలేదు 1920 వ సంవత్సరమున లాలాజి ప్రథమ పర్యాయము జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నికయైనారు.

తమ రాజకీయ జీవిత ప్రారంభములో అతివాదిగా ప్రఖ్యాతి గాంచినప్పటికిని, చివరిదశలో లాలాజి అభిప్రాయాలయందు

కొంత మార్పు గోచరించినది చివర దశలో లాలాజి శాసన సభ లలో కాంగ్రెస్ వాదుల ప్రవేశానికి సుముఖుడుగా నుండిరి. ఇది రాజకీయ వర్గాలలో అసంతృప్తికి కారణభూతమైనది; లాలాజి నాయకత్వమునకు వ్యతిరేకముగా స్వరాష్ట్రమైన పంజాబులోనే, ఉడుకురక్తముగల యువకులు తిరుగుబాటు చేసినట్లు కాంగ్రెస్ చరిత్రలో మనకు తెలియుచున్నది. లాలాజి తన రాజకీయ జీవితములో తీవ్రమైన వ్యతిరేకతను కూడ యెదుర్కొనవలసి వచ్చినది. పాంచాల రాష్ట్రస్థాయిలోనే కాక, అఖిల భారతస్థాయిలో గూడ సింహమువలె విక్రమించిన లాలాలజపత్‌రాయ్, స్వరాష్ట్రములో ప్రబల ప్రతిపక్షము యొక్క ప్రతిఘటనను రుచిజూచినారు. లాలాజి తన జీవితములో బలవంతులైన మిత్రులనేగాక, బలవంతులైన శత్రువులను కూడ కలిగియుండిరి. ప్రపంచములో శక్తివంతులైన మహాపురుషుల జీవితాలన్నింటియందు ఈ సత్యము గోచరించుచున్నది.

లాలాజి గొప్ప విద్వాంసుడు. నిజానికి ఆనాటితరము రాజకీయ నాయకుల ప్రత్యేకతలలో ఇది యొకటి. అది అతిరధ మహారధుల యుగము. శారీరకముగానేకాక, మానసికముగాను వామనమూర్తులైనవారి యుగము కాదది. లోకమాన్యునివంటి విజ్ఞానమూర్తికి సర్వవిధాల యోగ్యుడైన అంతరంగమిత్రుడు లాలాలజపత్‌రాయ్ సంస్కృతము, ఉర్దూ భాషలయందు లాలా లజపత్‌రాయ్ కూలంకషమైన పాండిత్యము కలిగియుండిరి. రుచుల యందు, అభిరుచులయందు లాలాలజపత్‌రాయ్‌కు లోకమాన్యునికి మధ్య కొన్ని పోలికలు కనిపించుచున్నవి. ఉభయులు ప్రాచ్య విజ్ఞానమునందు, సంస్కృతభాషయందును అపారమైన ఆసక్తితో పాటు గాఢమైన ప్రవేశము కలిగియుండిరి.

ఆనాటి కాంగ్రెస్‌నాయకు లనేకులవలె లాలాలజపత్‌రాయ్ మంచి వక్తయై యుండిరి. నిద్రాణమైన జాతిని మేలుకొలుపుటకు స్వాతంత్ర్య ప్రబోధముగావించి, చైతన్యము కలుగజేయుటకు, వక్తృత్వశక్తి రచనాశక్తి అత్యంత ఉపయుక్తమైన సాధనములు. లాలాలజపత్‌రాయ్ ఈ రెండు సాధనములను మిక్కిలి ప్రావీణ్యముతో ఉపయోగించిరి. ఉర్దూ భాషలో లజపత్‌రాయ్ ఉత్కృష్టమైన వక్తగా ప్రఖ్యాతిగాంచిరి.

ఉర్దూ సంస్కృతాలతో పాటు లాలాలజపత్‌రాయ్ ఆంగ్ల భాషయందు చక్కని వైదుష్యము సంపాదించియుండిరి. ఆంగ్ల భాషలో వారు కొన్ని ఉద్గ్రంథములను రచించినారు. ఈ సందర్భమున వానిలో రెండింటిని గూర్చి ప్రత్యేకముగా పేర్కొనవలసి యున్నది. ఈ రెండింటిలో మొదటిది (The cause of India'n Revolt) ఈ గ్రంథములో భారతీయులు తిరుగుబాటు చేయుటకు గల కారణాలు, భారతస్వాతంత్ర్య ఆవశ్యకతను వారుచక్కగా వివరించారు. రెండవ గ్రంథము (Unhappy India) దురదృష్టవంతమైన భారతదేశము. ఆ రోజులలో అమెరికా దేశీయురాలైన మిస్ మేయో కొందరి ప్రోత్సాహము వలన భారతదేశమును గూర్చి ఒక గ్రంథము వ్రాసినది. ఈ గ్రంథములో భారతీయులను గూర్చి, భారతదేశమును గూర్చి చాల అసభ్యముగాను, అవమానకరముగాను చిత్రించుట జరిగినది. అతిశయోక్తులతో అశ్లీలములతో, అసత్యాలతో నిండిన యీ గ్రంథము సమస్త భారతదేశానికి ఏవగింపు కలుగజేసినది. శమము, దమము, నిగ్రహము కలిగిన గాంధీమహాత్ముని యంతటివాడు యీ గ్రంథమును గూర్చి వ్యాఖ్యానించుచు ఇది మురికి కూపాలను మాత్రమే పరిశీలించిన మునిసిపల్ అధికారి నివేదికయని తెలిపినారు. దీనికి సమాధానముగా భారతీయులు

కొందరు ప్రత్యేక గ్రంథాలను వ్రాసియున్నారు. ఇందులో లాలా లజపత్‌రాయ్‌గారి గ్రంథము అగ్రగణ్యమైనది. ఈ గ్రంథములో మిస్ మోయో ఆరోపణలు, అసత్యాలు ఖండించి భారతదేశ స్వరూపమును వెల్లడిచేయుట జరిగినది. ఇంచుమించుగా వేయిపుటలు కలిగిన పెద్ద గ్రంథమిది.

లాలాలజపత్‌రాయ్ వ్యక్తిత్వము బహుముఖమైనది. ఆయన భావాలలో అతివాదము కనిపించినప్పటికిని, ఇంగ్లీషు ప్రభుత్వము ఆయనను సర్వదా అనుమానించినప్పటికిని, ఆయన ప్రభుత్వముతో సహాయనిరాకరణ చేయవలెనను విధానమును యెన్నడు గూడ నూటికి నూరుపాళ్ళు బలపరచలేదు. నిజానికి ఆయన సహాయనిరాకరణ విధానానికి వ్యతిరేకియని చెప్పినప్పటికిని అతిశయోక్తి కాజాలదు. 1920 వ సంవత్సరమున నాగపురమున జరిగిన కాంగ్రెస్ మహాసభలో గాంధీజీ చేత ప్రభావితుడై, మోతిలాల్ నెహ్రూ ప్రతిపాదించిన సహాయనిరాకరణ తీర్మానమును ఆయన బలపరచియుండెను. ఈ కాంగ్రెస్ సమావేశము తరువాత గాంధీ యుగము ప్రారంభమై గాంధీ రాజకీయాలు దేశములో వ్యాప్తి నొందగా, లాలాజి కొంత వెనుక పడిపోయెనని చెప్పవలసి యున్నది. లాలాజి కొంతకాలము భారత శాసనసభలో పనిజేసెను. కాని మోతిలాల్‌నెహ్రూతో అభిప్రాయభేదము కలిగి, స్వరాజ్యవాదులు శాసనసభ నుండి నిష్క్రమించుట హిందువులకు ప్రయోజనకారి కాదని గట్టిగా విశ్వసించి, కాంగ్రెస్ శాసనసభా పక్షము నుండి రాజీనామా యిచ్చి యుండెను.

స్వామి శ్రద్ధానందునితో సమకాలికుడైన లాలాజి, పాంచాల రాష్ట్రమున సర్వవిధాల స్వామీజీతో సమానస్థానము నాక్రమించెను.

సంఘసంస్కర్త, విద్యాసంస్కరణాభిలాషియైన లాలాజి దయానంద ఆంగ్లోవేద కళాశాల అభివృద్ధికి ముఖ్య కారణభూతుడైనాడు.

లాలాజి ఆర్య సంస్కృతియందు అపారమైన ఆదరాభిమానాలు కలిగిన విద్వాంసుడు భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవనము కావలెనని గాఢముగా వాంఛించి కృషిచేసిన మనీషి. పాంచాల రాష్ట్రములో ఆర్యసమాజానికి లజపత్‌రాయ్ పెట్టనికోటగానుండిరి. ఆర్య సంస్కృతి ప్రచారముకొరకు, ప్రబోధముకొరకు, వారు తమ హక్కును, కలమును వినియోగించి యుండిరి.

మహనీయులనేకులకు తుది దశలో కష్టాలు తప్పలేదు. లాలాజి జీవితము గూడ ఇందుకు అపవాదము కాజాలదు. చివరి రోజులలో లాలాజి జీవితము సుఖవంతముగా గడచినట్లు కనిపించదు. మహాత్ములైనవారి నిర్యాణము కూడ విషాదంతమైన సంఘటనలు ప్రపంచ చరిత్రలో కనిపించుచున్నవి. ఇటువంటి మహనీయుల శ్రేణిలో లాలాజిని గూడ చేర్చవచ్చును. సంకుచిత దృష్టి మరియు దురభిమానాలు కలిగిన విద్వేషమునకు ప్రతినిధియైన ఒక ఘాతుకుని లాఠీదెబ్బ లాలాజి మరణమునకు కారణభూతమైనది. ఆ లాఠీదెబ్బ తిని రోగగ్రస్తుడై కొద్ది రోజులలో లాలాజి పరలోకగతులైనారు. తన యావజ్జీవితము భారతమాత సేవకొరకు అర్పించిన లాలాలజపత్‌రాయ్ నిష్కళంకమైన జాతీయవాది; గొప్ప విద్వాంసుడు, మంచి రచయిత; వక్త; త్యాగమూర్తి; ధన్యజీవి. ఈనాటి తరమునకు సర్వవిధాల మార్గదర్శకమైనది లాలాలజపత్‌రాయ్ జీవితము.

(1967)

మౌలానా అబుల్ కలాం ఆజాద్

మౌలానా సాహెబ్ పరలోకగతులైనారను వార్త సమస్త భారతదేశమును శోక సముద్రముతో ముంచినది. కనులు మూసి కొనినంతనే రాజఠీవి ఉట్టిపడు ఆ విగ్రహము, పాదుషాలను స్మరింపజేయు ఆ గంభీరమూర్తి మన మనోదర్పణములందు ప్రతిబింబించుచున్నది. ఈ రాజఠీవి, యీ గాంభీర్యము ఆయన బాహ్య స్వరూపముననే కాక ఆంతరంగిక స్వరూపమునకు విలక్షణమైన ప్రత్యేకత యని చెప్పవచ్చును. శక్తివంతమైన ఆయన లేఖినీ విన్యాసమునందు, వచోవిలాసమునందు, యీ రెండు గుణములు విశిష్టముగా కనుపించుచుండును. దూషణ భూషణములకు రాగ ద్వేషములకు అతీతముగా కర్తవ్య నిర్వహణము గావించిన ఉదార చరితుడు మౌలానా సాహెబ్.

చండశాసనుడైన మౌలానా దయార్ద్రహృదయుడు. ఒక్కొక్కసారి ఆయన మాటలు దారుణాఖండల శస్త్రతుల్యము లైనప్పటికిని, హృదయము మాత్రము నవ్యనవనీత సమానము.

ఇస్లాం మత సంస్కృతులను గూర్చి మౌలానా సాహెబ్‌ది తుది మాట. సకల ప్రపంచములోని అరబ్బీ, పార్సీ విద్వాంసులయందు ఆయనది అగ్రస్థానము. పదునాలుగు సంవత్సరాల చిరుత ప్రాయముననే భారతదేశములో లభించగల అరబ్బీ వాఙ్మయమున పారంగతుడైన మౌలానా. ఈజిప్టు వెళ్ళి Al Azhar విశ్వవిద్యాలయమున విద్యాభ్యాసమును రెండు సంవత్సరాలలో ముగించిన కుశాగ్ర బుద్ధి; తరువాత కొన్ని అయిరోపా భాషలను కూడా నేర్చుకొని విశ్వసంస్కృతిని సంపూర్ణముగా ఆకళించుకొనినారు.

ఉర్దూ వాఙ్మయమున రచయితగా మౌలానా సాహెబ్‌కు మహోన్నత స్థానము కలదు. ఖురాన్‌కు ఆయన వ్రాసిన భాష్యము. తజ్కిరా అను గ్రంథరూపమున ఆయన ప్రకటించిన రచనలు సర్వదా నిలిచి యుండగలవు. మౌలానా శైలి, ఆయన వ్యక్తిత్వము వలె ప్రత్యేకమైనది. కలకత్తానుండి 'అల్‌హిలాల్' వారపత్రికను ప్రకటించి ఖిలాఫత్ ఉద్యమానికి, భారత జాతీయోద్యమానికి, హిందూ ముస్లిం ఐక్యతకు పట్టుకొమ్మగా నిలిచిన మౌలానా, తరువాత భారత జాతీయ కాంగ్రెసుకు ముమ్మారు మూర్థాభిషిక్తులై దేశస్వాతంత్రోద్యమానికి విజయవంతముగా నాయకత్వము వహించినారు. జాన్‌గంథర్ మౌలానా సాహెబ్‌ను భారత జాతీయ కాంగ్రెస్ మేధానిధిగా ప్రకటించినారు. మౌలానా సంపాదకీయాలు, తెలుగువారికి ముట్నూరి కృష్ణారావుగారి సంపాదకీయాలను జ్ఞప్తికి తెచ్చుచుండును. క్రిప్సు రాయబార తరుణమున ఇంగ్లండు మంత్రివర్గ ప్రతినిధులతో సంప్రదింపుల సందర్భమున మౌలానా ప్రదర్శించిన రాజనీతి కౌశల్యము నిరుపమానమైనది. అత్యంత కఠినమైన అగ్ని పరీక్షలలో అమోఘ విజయాలను సాధించిన నిష్కళంక జాతీయ వాది మౌలానా సాహెబ్.

మౌలానాలోని రాజఠీవి, గాంభీర్యములు మోతీలాల్‌ను జ్ఞప్తి చేయుచుండును; త్యాగము, ఔదార్యము చిత్తరంజనదాస్‌ను తలపింపజేయును; ప్రాచ్యవిజ్ఞానము; పారమార్థిక చింతనము లోకమాన్యుని స్మరింపజేయును; మేరు సమాన ధైర్యము, పట్టుదలతో కూడిన సాహసము సర్దార్ పటేల్‌ను స్మృతికి తెచ్చుచున్నవి. కేసరియను బిరుదము, లజపత్‌రాయ్ యందువలె, మౌలానాయందు కూడ సంపూర్ణముగా సార్థకము. జవాహర్లాల్ యందువలె మౌలానాలో సాహిత్య విజ్ఞానముల సరస సమన్వయము గోచరించుచుండును. ఈ మహనీయు లందరివలె, మౌలానా గూడ జాతిపిత గాంధీమాహాత్మునిచే ప్రభావితులైన శేముషీ సింధువు త్యాగమూర్తి.

ఆజన్మాంతము మౌలానా వ్యక్తిత్వమునందువలె, అవసాన సమయమున గూడ ఒక విలక్షణమైన ప్రత్యేకత గోచరించుచున్నది. గీతా శ్లోకములను పఠించుచు పరమపదించిన లోకమాన్యునివలె, వైద్యుల పరిచర్యలను, ఔషధాలను నిషేధించి, "నన్ను అల్లాకు వదిలివేయుమ"ని చెప్పుచు, పరమేశ్వర ధ్యానమున లగ్నమైన హృదయముతో మౌలానా సాహెబ్ పరలోకగతుడైనారు. దైన్యములేని జీవనము గడిపిన మౌలానా ఆయాసములేని మరణమునే పొందినారనిచెప్పవచ్చును. "బలమునీవ నాకు, భక్తుండ నీయెడ; ఆలుబిడ్డలేని యట్టివాడ; కావు నన్ను అధిక, కారుణ్యమున; ఇమ్మనుజ్ఞకమలదళ మనోజ్ఞనయన"యని యోగీశ్వరేశ్వరుడైన శ్రీకృష్ణమూర్తిని స్మరించి కనులు మూసికొనిన భీష్ముని నిర్యాణమును, మౌలానా అవసానము జ్ఞప్తికి తెచ్చుచున్నది.

(1966)

తెలుగుదనం విశిష్టత

వేదికమీదా, సభలోను ఆసీనులైె ఉన్న మహాశయులకూ, సోదరీమణులకు నమస్కరించి చేసే విజ్ఞప్తి.

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భములో తెలుగుదనపు విశిష్టతను గూర్చి ఆలోచించుకోవడం సహజమే. అయితే ఆశ్చర్య మేమంటే కల్తీలేని తెనుగుదనానికి ప్రతిబింబమైన వావిలాల గోపాలకృష్ణయ్యగారి నేతృత్వంలో జరిగే యీ చర్చావేదిక మీద, విశేషించి తెలుగుదనాన్ని సమీక్షించుకునే యీ సమావేశానికి నన్ను అధ్యక్షునిగా నియమించడమే. ఎందుకనగా అచ్చతెనుగు దనానికి నేను ప్రాతినిధ్యము వహించలేను. బహుభాషలు మాట్లాడే నగరంలో ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర, ఉర్దూ సంస్కృతుల సమష్టి కుటుంబమైన రాష్ట్రంలో విద్యాభ్యాసం గావించి సగము జీవితం గడిపి, మొదట భారతీయుణ్ణి, తరువాత తెలుగువాణ్ణి అనుకునే నాకు కొంత అనాంధ్ర వాతావరణము ఉన్నది. కాని

మిత్రులు శ్రీ సాంబశివరావుగారి కోరికను కాదనలేక మీముందు నిలిచినాను.

తెలుగుదనమంటే యేమి ?

నా యాభై యెనిమిది సంవత్సరాల వయసులో ముప్పైఆరు సంవత్సరాల ప్రజాహిత జీవనంలో అత్యధిక సమయాన్ని తెలుగు భాషా సేవకు వినియోగించినందువల్ల కొంత సాహసం కలిగింది. నా అనాంధ్ర, అబ్రాహ్మణ ఆచారాలు యెట్లున్నప్పటికీ తెలుగు భాషా సంస్కృతులపైన నిండుభక్తి. ఈ భక్తితో తెనుగుదన మంటే యేమి అని నన్ను నేను ప్రశ్నించుకున్నాను. వెంటనే యీ శతాబ్దిలో ఆంధ్రప్రబోధము గావించి మార్గదర్శకుడైన కవీశ్వరుని పద్యము జ్ఞాపకము వచ్చినది.

"కాళ్ల కడియాలొరయు ఆంధ్రకన్య సొగసు
ద్రావిడీ శూన్యచరణాల తడవ నేల ?
కేరళీ కర్ణతాటంక భారకలన
తెగిపడగ నోపు తెనుగుముద్దియల చెవులు.

ఒకరి సొగసు మరొకరికి వెగటు కావచ్చు ఒకరి సొంపు మరొకరికి యింపు కాకపోవచ్చును. దానికేమి ? అయితే తెనుగు దనం విశిష్టత కొంత సకల భారతానికి సమ్మోదము కలిగించినది. తెనుగు పడుతుల కట్టూ, బొట్టూ సకల భారతానికి యీనాడు అను సరణీయమైనవనే సత్యము అందరమూ గమనించవలసి వున్నది.

చమత్కారంగా చెప్పినా సత్యమే చెప్పినాడు మన కవి మిత్రుడు. తెనుగు పౌరుని అంతరంగ బహిరంగాల విశిష్టతను గూర్చి. ఆయన చెప్పినమాటలు వినండి.

పంచె కట్టుటలో ప్రపంచాన మొనగాడు
కండువా లేనిదే కడప దాటనివాడు
పంచభక్ష్యాలు తన కంచాన వడ్డించ
గోంగూర కోసమై గుటకలేసేవాడు ''

''ఏ దేశమేగినా యెందుకాలిడినా అవకాయ వియోగ మసలె సైపనివాడు''

''మంచి తననెదురైన మాలలిచ్చేవాడు, తిక్కరేగిందంటె డొక్క చీల్చేవాడు. చిక్కులెరుగనివాడు చిత్తానపసివాడు'' ఈ మాటలు తెనుగు పౌరుని ఆకారాన్ని, చిత్తవృత్తిని మన కనుల ముందు ప్రవేశ పెట్టుతున్నవి.

తెలుగువారి విలక్షణత

భారతదేశంలో బహుభాషలు మాట్లాడువారున్నారు. జనాభా దృష్ట్యా రెండవ స్థానాన్ని ఆక్రమిస్తున్న తెనుగుపౌరులు పైన పేర్కొన్నవారితో పాటు మరికొన్ని ప్రత్యేకతలు కలిగి ఇతర ప్రాంతీయులకన్న విలక్షణులై ఉన్నారు ఆ విలక్షణతమే తెనుగు దనము. ఈ తెలుగుదనాన్ని వేషభాషలలోను ఆహార విహారాల లోను ఆలోచనా విధానాలలోను మనము పోల్చుకోవచ్చును.

తెలుగుదనము, తెలుగుభాష సాధారణ తపస్సులవల్ల లభించేవి కాదని అప్పయ్య దీక్షితులు చెప్పిన మాటలు మన పండితులు సభలలో పలుమారు ప్రస్తావించగా వింటున్నాము. తెనుగువానిని గురించి శతాబ్దాలనుండి దేశీయులు, విదేశీయులు, చెప్పిన మరికొన్ని మాటలు వింటే, యీ విలక్షణత మనకు విశద మవుతుంది. సమరమున్నా, సుందరీముఖులన్నా, షడ్రసోపేతమైన

భోజనమన్నా యిష్టాన్నీ ఆసక్తినీ చూపే ఆంధ్రులు "అటు పుటు రటు" అంటూ వెళ్ళుతున్నారని కువలయమాలలో ప్రాకృతకవి ఉద్యోతనుడు ప్రస్తావించి తెనుగువాడు శూరుడూ, సౌందర్యోపాసకుడూ, భోజనప్రియుడూ అని వివరించినాడు. శ్రీనాథుడు తెనుగు యింటి భోజనాన్ని అనేక సందర్భాలలో ప్రస్తావించినాడు. ఆంధ్ర ప్రబంధనాయికలలో చాలమంది తెనుగుపడుచులే. కాకతీయుల కాలంలో పూటకూటి యింటి భోజనాన్ని క్రీడాభిరామంలో

"కప్పురభోగి వంటకము, కమ్మని గోధుమపిండి వంటయున్ గుప్పెడు పంచదార క్రొత్తగ కాచిన ఆవునేయి పెసరపప్పు, అరటి పండ్లు, పెరుగు" మనము చవి చూస్తున్నాము. ఆనాడు దేశమెంత సుభిక్షంగావున్నదో యిందువల్ల తెలుస్తున్నది. పాడిపంటల సమృద్ధి తెనుగుసీమ సామాజిక జీవనము యొక్క ప్రత్యేకతకు ఒక ముఖ్య కారణమని చెప్పవచ్చును. మన సమకాలిక కవీశ్వరులొకరు తెనుగు పల్లెల శోభను వర్ణిస్తూ—

"అరగదంచిన సన్నబియ్యంబు వండి
పొట్లకాయల నేతి పోపుల నమర్చి
పేరబెట్టిన మీగడ పెరుగుతోడ"

ఒక చల్లని తల్లి తన గారాబు కూతురుకు వడ్డనచేసిన సందర్భాన్ని మన ముందుంచినారు. వేషభాషలలో, ఆహార విహారాలలో కాలానుగుణ్యమైన మార్పులు వచ్చినప్పటికినీ, కొన్ని ప్రత్యేకతలు తెలుగుదనాన్ని పట్టిచూపిస్తున్నవి. తెనుగువాని శౌర్యాన్నిగూర్చి, రసికతనుగూర్చి యిదేవిధంగా అనేక ఉదాహరణలు యీయవచ్చును. ఈ ప్రత్యేకతలలో అంతర్లీనమైన తెనుగుదనాన్ని స్పష్టంగా చూడవచ్చును.

తెనుగులిపి సమగ్రమైనదనీ, సుందరమైనదనీ, తెనుగుభాష తీయనిదనీ, సంగీతానికి అనుకూలమైనదనీ, కృష్ణా గోదావరి నదులు ప్రవహించే తెనుగుసీమ ప్రకృతి సంపదకూ, శోభకూ, పాడిపంటలకూ ఆలవాలమై భారతదేశానికే ధాన్యాగారమనీ అందరికీ తెలిసిన సత్యాలే కదా!

భావోద్రేకపరుడు

తెనుగు పౌరుడు సూటిగా మాట్లాడే స్వభావం కలవాడు. క్రీస్తుశకము 7 వ శతాబ్దిలో తెలుగుదేశానికి వచ్చి వేంగీ ధాన్యకటకాలను సందర్శించిన హ్యూయన్‌త్సాంగ్ తెలుగుదేశంలో పంటలు పుష్కలంగా పండుననీ తెలుగు పౌరుడు ఆవేశపరుడనీ, పరాక్రమవంతుడనీ, కళాభిమాని అనీ, తెలుగుప్రాంతంలో మతాంతరులు చాలమంది ఉన్నారనీ తన యాత్రాచరిత్రలో వ్రాసిపెట్టినాడు. తెలుగుపౌరుడు భావోద్రేకపరుడన్నమాట భారతదేశంలో సుప్రసిద్ధమే కదా! కాకతీయ రాజ్యాన్ని రుద్రమదేవి పరిపాలించిన కాలంలో యిక్కడికి వచ్చిన మార్కోపోలో 13 వ శతాబ్దిలో తెలుగుదేశంలోని వజ్రాల గనులను గూర్చి వివరించి రుద్రమదేవిని బహువివేకవతిగా పేర్కొన్నాడు. తెలుగు మహిళలు విశేషించి యీ అంతర్జాతీయ మహిళా సంవత్సరంలో యీ మాటను జ్ఞప్తికి తెచ్చుకొని సంతోషించవచ్చును గదా!

క్రీస్తు శకము ఒకటవ శతాబ్దిలోనే తెలుగుదేశము నేత పరిశ్రమకు ఆటపట్టుగా ఉండి విదేశాలతో వర్తకము కొనసాగించినది. చేనేత బట్టల నాజూకు, తెలుగువారి నైపుణ్యాన్ని, అభిరుచిని శతాబ్దాల నుండి దేశవిదేశాలకు పరిచయం చేస్తున్నది. తెనుగు పడుతుల మాట తీయదనాన్ని ఒక సంస్కృతకవి తన చాటువులో ప్రశం

సించినాడు (సదుక్తి కర్ణామృతము) పూలతో పరిమళించే కొప్పు, మణిమయమైన ఒడ్డాణము, రత్నహారము, తెల్లచీర ఆంధ్రస్త్రీ వేషాలంకారమని మరొక సంస్కృతకవి చెప్పినాడు (మంకకుని కావ్యమీమాంస).

తెనుగు ప్రజలు అజానుబాహులు, సుందరాకారులు, తమిళులకన్న చక్కనివారు, ఎత్తులో ఉత్తరదేశీయులతో సమానమైన వారు; దాక్షిణాత్యులకన్న ఆచారవంతులు, శక్తివంతులు, కాని ఆవేశపూరితులని ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికాచెప్పుతున్నది. తెలుగు వారు అయిరోపాఖండ వాసులవలె నాగరికులు, తెనుగు చాల మట్టుకు ఇటాలియన్ భాషను పోలివుంటుందని మరొకడు ఉద్ఘాటించినారు. తెలుగు ఇటాలియన్ భాషల పోలికలనుగూర్చి మిత్రులు శ్రీ మాల కొండయ్య ఐ. ఏ. యస్. గారు పరిశోధించి చక్కని వ్యాసము వ్రాసినారు. మన జాతిపిత మహాత్మాగాంధీ "ఆంధ్రులు శౌర్యవంతులు. గర్వకారణమైన సంప్రదాయం కలవారూ, మతము పట్ల అభిమానం కలవారు. త్యాగశీలురూ, శక్తిమంతులూ, దానశీలురూ, పట్టుదల గలవారు. ప్రేమార్ద్రహృదయులూ" అని వివరించినారు. పైన పేర్కొన్న అభిప్రాయాలలో ఏకత్వం కనిపిస్తున్నది. ఆ ఏకత్వములో తెలుగుదనము వెల్లడవుతున్నది.

పాండితి - సంస్కృతి

సంగీతము, చిత్రలేఖనము శిల్పములలో తెలుగువారు ప్రతిభను చూపించినారు. త్యాగరాజులేనిది భారతీయ సంగీతము లేదు. అజంతాలోనిది ఆంధ్ర చిత్రలేఖనమే. మన జానపద సాహిత్యంలో నిజమైన తెలుగు వాతావరణము కన్పిస్తున్నది. సంస్కృతాన్ని, వేదాన్ని స్పష్టంగా ఉచ్చరించే తెలుగువారు, పార్సీ, ఇంగ్లీషు

మొదలైన భాషల ఉచ్చారణలో కూడ ప్రవీణులు. తెలుగుదేశంలో రాజకీయ చైతన్యం యెక్కువ. సమష్టిగా ఐక్యత తెలుగువాని బలమైన గుణాలలో ఒకటి కాదని చెప్పితే అతిశయోక్తి కాజాలదు. కల్పనాశక్తితో పాటు వ్యాఖ్యానశక్తి తెలుగువాని, ప్రత్యేకత. మల్లినాథుని వంటి వ్యాఖ్యాత భారతదేశంలో మరొకరు పుట్టలేదంటే సత్యదూరం కాదు. ఆధునికయుగంలో హైందవ వేదాంతాన్ని, భారతీయ సంస్కృతిని సకల ప్రపంచానికి విశదీకరించిన జగదాచార్యుడు రాధాకృష్ణుడు. గాంధీజీ సూత్రకారుడైతే నేను ఆయనకు భాష్యకారుడన డాక్టర్ పట్టాభి సీతారామయ్యగారు ఒకమారు చెప్పినట్టు జ్ఞాపకము.

తెనుగు పౌరునిది విశాలహృదయం. పొరుగుప్రాంతాల నుండి విదేశాలనుండి స్వేచ్ఛగా వీచే స్వచ్ఛమైన వాయువును తెనుగువాడు నిరోధించలేదు. ప్రాకృతము, సంస్కృతము, పార్సీ, ఇంగ్లీషు పదాలు తెలుగులో సొగసుగా ఇమిడినవని చెప్పడానికి యెన్ని ఉదాహరణలైన పేర్కొనవచ్చును. భారతదేశంలోని యితర ప్రాంతాలకు వెళ్ళినా విదేశాలకు వెళ్ళినా తెనుగు పౌరుడు అక్కడివారితో కలిసిపోతాడు. ఇతర ప్రాంతీయులు తెలుగు ప్రాంతానికి వస్తే వారిని ఆదరంతో ఆహ్వానిస్తాడు. తెనుగుదనానికి యిది మరొక ప్రత్యేకత. భారత జాతీయతకు వ్యతిరేకంగా వ్యవహరించేవాడు తెలుగు పౌరుడు కాడు. తెనుగుదనం భారత జాతీయతకు అనుగుణమైనది, పరిపోషకమైనది. ఒక రాష్ట్రం కోరినా, రెండు రాష్ట్రాలు కోరినా భారతదేశం నుంచి విడిపోవలెనని తెలుగువాడు ఎన్నడూ అభిలషించేవాడు కాడు.

అభివృద్ధికరమైన అన్ని ఉద్యమాలను తెలుగువాడు ఆహ్వానించినాడు. నాటి జైన, బౌద్ధాలతోపాటు నేటి వివిధ ఉద్యమాలను

యెన్నింటినో తెలుగుసీమ ఆకర్షించినది. విశ్వసౌభ్రాతృత్వాన్ని, మానవతను ఆహ్వానించి త్యాగసమయంలో అరనిమిషం గూడ ఆలోచించని ఆర్ద్రహృదయుడు తెలుగువాడు. తెనుగుపౌరుడు.

"పంజాబునుండి కప్పురపు మొక్కలు దెచ్చి
పెరటితోటలలోన పెంచినాడు,
పచ్చ జవ్వాది గోవానుండి రప్పించి
దంతపు జాడీల దాచినాడు,
కొండవీటి గులాబి గుత్తుల అత్తర్లు
కీలు తిత్తులలో బిగించినాడు.
అసలైన పారసీకాశ్వాల నలవార్చి
విజయ యాత్రల స్వారివెడలినాడు,
సాంగజీవిత కల్యాణ శాఖక్రింద
నిలిచి ఆనందదేవతన్ గొలిచినాడు,

అంతేకాదు—

మోటుపల్లి తీరమున లంగరేసి ఓ
డలు సుంకమర్పింపనిలుచునాడు,
రాయలసీమ రారాయబార్లు వసించి
చిత్ర చరిత్రల్ రచించునాడు,
పాకాలచెరువు చెంపల పండు ధాన్యముల్
అన్యదేశాధిపులడుగునాడు,
అద్దంకి కోడెల నాబోతులకునయి
దూరాగతులు కొని త్రోలునాడు
తెనుగుతల్లి లాలాటిక తిలకదీప్తి...
ఖండఖండాంతరాలలో ప్రకాశించినది.

ఈ తిలకదీప్తియే తెనుగుదనంలోని ప్రత్యేకత. ఇటువంటి ప్రత్యేకతను కాపాడుకొనవలసినదని కోరుతూ —

"తమ్ముడా మాయనిత్తువె తల్లి వన్నె
చెల్లెలా చిన్నబుత్తువె తల్లి చిన్నె"

అని కవివాణి ప్రశ్నిస్తున్నది. ఆ ప్రశ్నకు మనము చెప్పేది ఆశాజనకమైన సమాధానమే.

(16—5—71)

మన దేవాలయాలు — శిల్పకళ

మనదేశంలో యే ప్రాంతానికి వెళ్ళినా, చిన్నదో పెద్దదో, యేదోవొక దేవాలయం లేని పల్లెటూరు మనకు కనిపించదు. తెలుగు సీమలోనేకాదు, భరతఖండములో ఏ భాష మాట్లాడే యే ప్రాంతానికైనా యీ సత్యమే వర్తిస్తుంది; లిపులు, మాటలు వేరైనప్పటికి, భారతదేశ భాషల ఆత్మ ఒక్కటే. భారతీయ సంస్కృతిలోని యేకత్వమును ప్రతిపాదించే భిన్న భాషా ప్రాంతాల లోని దేవాలయాలలో లిపులకు, మాటలకు అతీతమై సమస్త భారత దేశానికి సమష్టి స్వత్వమయిన శిల్పము, చిత్రలేఖనము పుష్కల ముగా కన్పిస్తున్నవి. నిజానికి ప్రాచీనకాలము నుండి యిటీవలి వరకు సంగీతము, సాహిత్యము, నృత్యము, శిల్పము మొదలయిన సుకుమార కళలన్నీ మనదేవాలయాలను ఆశ్రయించుకొని అభి వృద్ధి చెందినవి. మనదేశంలో కళకూ మతానికీ విరోధము లేదు భారతీయులు తమ జీవితాన్ని అడుగడుగునా కళాభిరామము గావించుకొన్నారని మన దేవాలయాలు, విశేషించి అందులోని శిల్పము చెప్పక చెప్పుతున్నవి

ప్రాచీనకాలంలో నిర్మాణమై యీనాటికీ పుణ్యక్షేత్రాలుగా ప్రజల మన్ననలు పొందుతున్న దేవాలయాలు మనదేశములో అసంఖ్యాకంగా వున్నవి ఇందులో కొన్ని శిథిలమయినప్పటికిని శిల్పకళా లక్ష్మికి ఆటపట్టులుగావున్నవి. అనాది నుండి యీనాటి వరకు హిందూమతముతోపాటు జైన బౌద్ధ మతాలుగూడ మనదేశములో ఆవిర్భవించి అభివృద్ధి జెందినవి ఈ మూడు మతాలు మనదేశంలో దేవాలయాల నిర్మాణానికి ప్రోత్సాహ కారణాలయినవి. క్రీస్తు పుట్టడానికి రెండు మూడు నూర్ల సంవత్సరాల ముందం నుండి తంజావూరు నాయక రాజుల పరిపాలన సమాప్తివరకు నిర్మాణమయిన బౌద్ధ, జైన, హిందూ దేవాలయాలలో మన మత వికాసముతోపాటు శిల్పకళా పరిణామము గోచరిస్తున్నది. మన తెలుగు సీమలో అనేక రాజవంశాలు పరిపాలించినవి శాతవాహనులు, ఇక్ష్వాకులు, విష్ణుకుండినులు, పల్లవులు, వేంగిచాళుక్యులు, కాకతీయులు, రెడ్లు, పద్మనాయకులు, విజయనగర రాజులు, తంజాపురాంధ్ర నాయకులు వీరిలో ముఖ్యులు. ఈ రాజవంశాలన్నీ దేవాలయ నిర్మాణంపట్ల ప్రత్యేక శ్రద్ధను జూపించినవి. వీరిలో కొందరు బౌద్ధదేవాలయాల నిర్మాణానికి పూనుకుంటే మరికొందరు హిందూ దేవాలయాల నిర్మాణంలో ఆసక్తి జూపినారు. మతము యేదైనప్పటికిని, దేవాలయములోని విగ్రహము యేదైనప్పటికిని నిర్మాణములో కనుపించు శిల్పము మాత్రము మిక్కిలి సుందరమయినది. శిథిలావశేషమయిన శిల్పమే మనలను యీనాడు యింతగా ఆకర్షిస్తున్నపుడు అనాటి శిల్పస్వరూపము యెంత రమణీయమయి ఉండెనో సులభంగా ఊహించుకోవచ్చును.

మన శిల్ప సంపదలో ప్రత్యేకముగా గణనీయమయిన సాంచీ, అమరావతి, నాగార్జునకొండ, భట్టిప్రోలు, జగ్గయ్యపేట

హనుమకొండ, పాలంపేట, లేపాక్షి, హంపి, మధుర మొదలయిన ప్రదేశాలలోని ఆలయాలు, నిర్మాణాలు చారిత్రకంగా మన శిల్పంలో వచ్చిన క్రమ పరిణామాన్ని సూచిస్తున్నవి. ఈ శిల్పాన్ని కొంచెము జాగ్రత్తగా పరిశీలించితే ఆంధ్రులు తమ నిర్మాణాలలో సంకుచిత మయిన దృక్పథాన్ని చూపించలేదనీ, సమరస దృష్టితో శిల్పకళను ఆరాధించినారనీ, విదేశీరీతులను, వాని సొంపులను స్వీకరించినారనీ వెల్లడి కాగలదు. సింహళము, మలయా, ఇండొనీషియా, కాంబో డియా, వియత్నాం మొదలయిన ఆసియాదేశాల శిల్పాన్ని పోల్చి చూచినప్పుడు సాంస్కృతిక రంగములో యిచ్చిపుచ్చుకొనుట ఆంధ్రులకు అనాదినుండి పరంపరాగతముగా వస్తున్న సంప్రదాయ మని స్పష్టముకాగలదు. ఆంధ్రశిల్పి వాస్తవిక దృక్పథంగల సౌంద ర్యారాధకుడు. సహజ సౌకుమార్యాన్ని, సజీవ సౌందర్యాన్ని ప్రక్కకునెట్టి శుష్కమయిన శిల్ప లక్షణాలను పట్టుకొని ఆంధ్ర శిల్పి ప్రాకులాడలేదు. సాంచీలోని స్తూపాలతోరణాలు, అమరావతి లోని చలువరాతి చెక్కడాలు, హనుమకొండ, పాలంపేట శిల్పాల లోని సోయగాలు, ఎల్లోరా గుహల శిల్పవైభవము. అజంతా చిత్ర లేఖనపు హవణికలు, హంపీ శిధిలాలలోని ఇంపులు ఆంధ్రుల సౌందర్యరక్తికి, కళాభిరుచికి ఉజ్వలమయిన నిదర్శనాలు.

మనదేశంలో శాతవాహనుల కాలానికి సంబంధించిన అనగా క్రీస్తుకు పూర్వము రెండు మూడు నూర్ల సంవత్సరాల ముందరి నిర్మాణాలు, శిల్పము యెక్కువగా దొరకలేదు. నిజానికి యీ శాతవాహనుల కాలంలోనే మన శిల్పము విస్తరించి వికసిం చింది. వీరి కాలంలోనే అమరావతి, గుంటపల్లి, జగ్గయ్యపేటలలోని గుహాలయాలలో బుద్ధదేవుని జాతక కథలను కండ్లకు కట్టినట్లుగా చిత్రించడం జరిగింది. మహామేధావి అయిన ఆచార్య నాగార్జునులు

ప్రభావం యీ శిల్పం మీద స్పష్టముగా గోచరిస్తున్నది. ఆభరణాలు గాని, ఆడంబరంగాని ఎక్కువగాలేని పెద్ద విగ్రహాలు యీనాటి శిల్పంలో కనుపిస్తున్నవి. సాంచీలోని స్తూపాన్ని, తోరణాన్ని, సుందరమయిన స్త్రీ విగ్రహాన్ని, అమరావతిలో బోధి వృక్షాన్ని పూజించే భక్తురాలి విగ్రహాన్ని చూస్తే ఆంధ్ర శిల్పుల రసాత్మక మయిన దృక్పథం, కోమలమయిన అభిరుచి మనకు సువ్యక్తం కాగలవు. మనుష్య విగ్రహాలతోపాటు పశువులను, పక్షులను, ఆకులను, తీగెలను యీ శిల్పంలో మనము చూడవచ్చును. మనుష్య విగ్రహాలలోని జీవకళ, పక్షులు, చెట్లు, ఆకులు వీనిలోని సహజత్వము మనహృదయాలను ఆకట్టి ఆకర్షించుతున్నవి. శాతవాహనుల కాలంలోని శిల్పములో బౌద్ధ నిర్మాణాలు, ఆలయాలు హెచ్చుగా వున్నప్పటికీ అక్కడక్కడ హిందూమతానికి సంబంధించినవి కూడా కనిపిస్తున్నవి. ఇందులో ప్రత్యేకముగా పేర్కొనదగింది గుడిమల్లములోని శివలింగము. ఈ శివలింగము శాతవాహనుల మత సహనానికి మంచి మచ్చుతునక.

శాతవాహనుల కాలములో గజపృష్ఠాకారంగల గర్భాలయాలు, చైత్యశాలతోపాటు బౌద్ధ భిక్షువుల వసతికొరకు ఉద్దేశించిన సంఘారామాలు యెక్కువగా నిర్మితమయినవి. ఏనుగులు, సింహాలు, గుర్రాలు మొదలయిన జంతువులు అలంకృతమయిన తోరణాలు కలిగిన కిటికీలు, అంతస్తులతో కూడిన గుహాలయాలు శాతవాహనుల శిల్పనిర్మాణాల ముఖ్యలక్షణాలు. విజయవాడకు దగ్గరి గుంటుపల్లిలోని సామాన్యపు గదిమీద కమానువంటి కప్పు శాతవాహనులు చేసిన మొదటి నిర్మాణ స్వరూపాన్ని తెలియజేస్తుంది. అమరావతి శాతవాహనుల శిల్పానికి తలమానికమయిన నిర్మాణము. శాతవాహనుల కాలపు స్తంభాల పద్ధతిని తరువాత

బాదామి చాళుక్యులు, కాకతీయులు తమ కట్టడాలలో అనుకరించి నారు.

శాతవాహనుల తరువాత తెలుగు సీమను పరిపాలించిన ఇక్ష్వాకులు యజ్ఞాలు, యాగాలుచేసి హిందూమతాన్ని ప్రోత్స హించినారు. వారి నిర్మాణాలలో హిందూమత ప్రాధాన్యం ఉన్నప్ప టికీ బౌద్ధమతాన్ని వారు ద్వేషించలేదు. ఇక్ష్వాకుల తరువాత విష్ణు కుండినులు తెలుగుదేశాన్ని పరిపాలించినారు. వీరి కాలంలో ఆంధ్ర శిల్పం మరింతగా అభివృద్ధిచెందింది. బెజవాడ, ఉండవల్లి మొగ ల్రాజ పురాలలోని గుహాలయాలు, దేవాలయాలు ఆనాటి శిల్పానికి ప్రతిబింబాలుగా, ఉన్నవి. మొగల్రాజపురము దేవాలయములోని నటరాజమూర్తి, ఆ మూర్తి క్రింది గజసింహ ప్రతిమలు జీవకళతో చైతన్యము ఉట్టిపడుతున్న కళాఖండాలు. బెజవాడలో కనుపించే నందులు తరువాత శిల్పములో చాల ప్రచారంలోకి వచ్చినవి. ఈ నందుల మెడలలో గంటల పట్టెడ కొట్టవచ్చినట్టు కన్పిస్తుంది.

తరువాత మన శిల్ప చరిత్రలో చాళుక్యుల యుగము ప్రారంభమౌతుంది. ఈ కాలంలో హిందూమతానికి ప్రాధాన్యం మరింత పెరిగింది. మన పురాణ కథలు యీనాటి శిల్పంలో మనో హరమయిన దృశ్య కావ్యాలుగా అవతరించినవి. దశావతారాలు ఆదివరాహమూర్తి భూమిని ఉద్ధరించడం, వామనుడు బలిచక్ర వర్తిని అర్థించి అణగద్రొక్కడము మొదలయిన పౌరాణిక సంఘట నలు, బ్రహ్మ విష్ణుమూర్తులు, శివలింగముల చిత్రణ యీనాటి శిల్ప నిర్మాణాలలో చిరస్మరణీయమయినట్టివి. దక్షిణ కాశిగా అలరారుచున్న అలంపురంలోని సంగమేశ్వరాలయము, నవ బ్రహ్మాలయాలు బాదామి చాళుక్యుల ప్రసిద్ధ నిర్మాణాలు. చాళుక్య పద్ధతి నిర్మాణాలలో అలంపురం దేవాలయాలు ప్రత్యేకంగా

పేర్కొనదగినవి. అమరావతీ, ధాన్యకటకాలను రాజధానులుగ చేసుకొని తెలుగుదేశాన్ని పాలించిన పూర్వ చక్రవర్తులకు అలంపురము అధీనమయి యుండినప్పటికీ ఇప్పుడు కనిపిస్తున్న ఆలయాలు మాత్రము చాళుక్య రాజుల నిర్మాణాలేనని నిస్సందేహంగా చెప్పవచ్చును. మనదేశంలోని చాళుక్య పద్ధతి ఆలయాలలో సామర్లకోట, భీమవరము, ద్రాక్షారామాలలోని, దేవాలయాలు సుప్రసిద్ధమయినవి. భీమేశ్వరాలయంలో కోలాటము వేస్తున్న నర్తకిబొమ్మ, ద్రాక్షారామంలోని సురసుందరీ ప్రతిమలు చాళుక్య నిర్మాణాలలోని మనోహరమయిన శిల్పానికి మచ్చుతునకలవంటివి. సామర్లకోట రాజమహేంద్రవరానికి మధ్య ముఖ్యమయిన ప్రాచీన చాళుక్య దేవాలయాలున్నవి, బిక్కవోలు దేవాలయంలోని దేవతావిగ్రహాలు, గంగాయమునా నదీసుందరుల చిత్రాలతో శోభిల్లే ద్వారబంధాలు చాళుక్య శిల్పంలో విశిష్టమయిన స్థానాన్ని ఆక్రమించుతున్నవి.

ఆంధ్రశిల్పము కాకతీయరాజుల కాలంలో పరిణతినొంది పతాకస్థాయినందుకొన్నదని చెప్పవచ్చును. శిల్పానికి, సాహిత్యానికి, సంగీతానికి, నృత్యానికి, సంస్కృతికి కాకతీయుల కాలంలో సరసమయిన కలయిక జరిగినది. నూర్ల సంవత్సరాల కాలగమనాన ఇసుమంతగూడ చెలువము చెడని, చెన్నుతరగని, మెరుగులు మాసిపోని శిల్పసౌందర్యము, విన్నాణము, హనుమకొండ, పాలంపేట, రామప్ప, ఓరుగల్లుకోట దేవాలయాలలో మన కన్నులకుకట్టి మనకు ఆనందపారవశ్యాన్ని కలిగించుచున్నవి. బహురీతుల భాసించే నాట్యభంగిమలు ఒకచోటా, వివిధ ఫణితులలో మలచబడిన సుందరమైన ద్వారబంధాలు తోరణాలు, మందిరాలు మరొకచోటా, మనకు నేత్రపర్వము చేస్తున్నవి. ఏనుగులు, నందులు, హంసలు స్తంభాలు మృదంగ వాద్యాలు యీనాటి

శిల్పము సొంపును, సంపదను మనకు విశదముచేస్తున్నవి. తెలంగాణలోని పిల్లలమర్రి, నాగులపాడు మొదలైన దేవాలయాలు, పలనాడు ప్రాంతంలోని మాచర్ల, గురజాలలోని దేవాలయాలు కాకతీయుల కాలపు శిల్పాలే. కాకతీయుల కాలములో మనకు శివాలయాలు హెచ్చుగా కనుపించుతవి.

కాకతీయుల తరువాత విజయనగరరాజులు గొప్ప ఆలయాలను నిర్మించిన శిల్పకళాపోషకులు. శిల్పకళలో విజయనగర రాజులు కొత్తరీతులను ప్రవేశపెట్టినారు. గోపురాలు, మంటపాలు, విమానాలు ఈనాటి దేవాలయాల ప్రత్యేకతలు. వైష్ణవమత ప్రభావ ప్రాబల్యం యీనాడు శిల్పకళమీద కనిపించుతున్నది. తాడిపత్రిలో పడిపోయిన గోపురముతో నిలిచియున్న విష్ణ్వాలయ వైభవము విజయనగర రాజుల శిల్పకళా నయిపుణ్యానికి నిదర్శనము. హంపీ, లేపాక్షి, పంపావతి, పెనుగొండలలోని ఆలయాలు విజయనగర రాజుల నిర్మాణాలలో ముఖ్యమయినవి. ఈ దేవాలయాలలోని స్తంభ నిర్మాణము ప్రతిభావంతమయిన ప్రశస్త శిల్పము.

మధ్యయుగంలో విదేశీయుల దండయాత్రలచేత శిథిలమయిన దేవాలయాలను మధుర నాయక రాజులు పునరుద్ధరించినారు. ఈ పునరుద్ధరణలో ప్రదర్శితమయిన శిల్పకళానైపుణ్యము మిక్కిలి ప్రశంసనీయమైనది. మధుర, తంజావూరు. శ్రీరంగం, రామేశ్వరంలోని దేవాలయాలు యీ తరగతికి చెందినవి. మధుర మీనాక్షి దేవాలయ గోపురాలు, ఆ దేవాలయాలలోని శిల్పము మిక్కిలి సుందరమయినవి.

(1965)

స్వాతంత్ర్యానంతర సాహిత్యము

భారతీయ సాహిత్యానికి రూపాలు అనేకము ఉన్నప్పటికిని, ఆత్మ ఒక్కటే. ఈ సత్యమునే మరొకరు భారతీయ సాహిత్యము, లిపులు వేరైనప్పటికిని, ఒక్కటే అని చెప్పినారు. వేదకాలము నుండి యీనాటి వరకు మనదేశములో వివిధ భాషలయందు అవత రించిన సాహిత్యమును స్థూలముగా పరిశీలించి నప్పటికిని, వివిధ భాషా వాఙ్మయాలలో ఐక్యత గోచరించుతున్నది వివిధ కాలాల యందు వివిధ భాషలలో సమానమైన సాహిత్యరీతులు మనకు కనిపించుతున్నవి. స్వాతంత్ర్యానికి ముందు, స్వాతంత్ర్య ప్రాప్తి తరువాత మన దేశభాషలలోని సాహిత్య రీతుల సామ్యము యీ సత్యమును వెల్లడి చేస్తున్నది.

భారతదేశానికి స్వాతంత్ర్యము వచ్చి ఇరువదిరెండు సంవ త్సరాలు గడిచిపోయినవి. ఇది ఇరవదిమూడవ సంవత్సరము అనగా స్వతంత్రభారతములో జన్మించిన పౌరుడు నేడు వయోజ నుడై ఓటింగు హక్కును పొందిఉన్నాడు.

దేశములో క్రొత్తతరము వివిధ రంగాలలో బాధ్యతలను నిర్వహించుటకు సంసిద్ధమై ఉన్నది. ఈ క్రొత్త తరానికి స్వాతంత్ర్య ప్రాప్తికి ముందరి పరిస్థితులు అవగాహన కాకపో వచ్చును. కాని స్వాతంత్ర్య సాధనలో పాల్గొనిన పూర్వపు తరము వారు కూడ యీనాడు మనదేశములో వివిధ రంగాలలో తమ తమ పనులను నెరవేర్చుకొంటున్నారు. ఈ రెండు తరాల మధ్య అఖాతము మనకు స్పష్టముగా కనిపించుతున్నది. రెండు తరాల ఆలోచనలలో, ఆచరణలలో, ఆశయాలలో వ్యత్యాసాలు గూడ సాహిత్యరంగమున ప్రతిబింబించుతున్నవి. స్వాతంత్ర్య ప్రాప్తికి ముందు ఉన్నతశ్రేణి రచయితలుగా పేరుగాంచినవారు పూర్వపు మార్గాలలో తమ తమ విశిష్ట ధోరణులతో నేటికిని రచనలు గావించుచున్నారు ఈ రచనా మార్గాలను అనుసరించినవారు కూడ యువ రచయితలలో కనిపిస్తున్నారు. పూర్వపు రచనలపైన తిరుగుబాటు ఉద్యమాలు యీనాడు అన్ని భాషలలో కనిపించు చున్నవి. ఈ తిరుగుబాటు కాలానుగుణ్యమైనదని నిస్సందేహముగా చెప్పవచ్చును. ఈ తిరుగుబాటు ధోరణులు సాహిత్యవీధులన్నింటి యందును కనిపిస్తున్నవి. ఈ నూతన రచనలే స్వాతంత్ర్యా నంతర సాహిత్యము యొక్క ప్రత్యేకతలు. ఈ ప్రత్యేకతలు భావాలలో, వస్తువులో, శైలిలో గోచరిస్తున్నవి.

ఈనాడు పూర్వ పద్ధతిలో రచనలు గావించు కవులు ఉన్నారు. పాతకాలపు రచనా ధోరణులు వివిధ వచన, రచనలలో గూడ కనిపించుచున్నవి. ఐనప్పటికిని మొత్తము మీద స్వాతంత్ర్యా నికి ముందటి అభిరుచులు యీ రెండు దశాబ్దాలలో బాగుగా మారి పోయినవి. ఈనాటి సాంఘిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులు యీ మార్పుకు ప్రధాన కారణములు.

స్వాతంత్ర్యము వచ్చిన తరువాత అక్షరాస్యత పెరిగినది. పత్రికల సంఖ్య పెరిగినది, పాఠకుల సంఖ్య పెరిగినది. సాహిత్య సమాజాలు ప్రభుత్వ ప్రోత్సాహము పొంది మౌలికమైన రచనలు ప్రకటించుచున్నవి. భారతీయ భాషలమధ్య సహకారము పెంపొందినది. సాంస్కృతిక సంబంధాలు పెరుగుచున్నవి. రేడియో ద్వార రచయితలకు ప్రోత్సాహము లభించుచున్నది విదేశ భాషలనుండి అనువాదాలు అధిక సంఖ్యలో అవతరించుచున్నవి. విదేశ భాషా సాహిత్యాలతో సంబంధాలు పెంపొందుచున్నవి. అనువాదాలు ఒక భాషనుండి మరొక భాషకు జరుగుచున్నవి. పత్రికలలో రచనలకు బహుమతులు లభించుచున్నవి. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు వివిధ పథకాల ద్వారా రచయితలను ప్రోత్సహించుచున్నవి. ఐనప్పటికి యువరచయితలలో నిరాశా, నిస్పృహలు అతిశయించి వారి రచనలలో ప్రతిబింబించు చున్నవి ఇందుకు కారణమేమి అను ప్రశ్నకు సమాధానము వెదకవలసిన అవసరము లేదు.

స్వరాజ్యము వచ్చిన తరువాత సమాజముతో పాటు సాహిత్యము గూడ సర్వాంగ సుందరముగా పెంపొందగలదను భావన అందరిలో ఉండినది. సామాన్య మానవుని కష్టాలు తీరిపోగలవని, విదేశ పరిపాలన క్రింద నలిగిపోయిన పౌరుడు అన్ని రంగాలలో అభివృద్ధిని సాధించగలడని జనులలో వ్యాపించిన ఆశలు నిరాశలైనవను భావము ప్రబలముగా కన్పట్టుచున్నది. గడచిన రెండు దశాబ్దాలలో బ్రహ్మాండమైన ప్రగతి ఆర్థిక, రాజకీయ రంగాలలో సాధించిన మాట సత్యమే. వివిధ రంగాలలో అమలుజేసిన ప్రణాళికలు మన యెదుట నున్నవి. ఆసేతు హిమాచలము పర్యటన గావించి భారతదర్శనము చేసినచో యీ విజయాలను కనులార చూడవచ్చును. కాని మనదేశ సమస్యలను గమనించి నప్పుడు,

సాధించిన అభివృద్ధి కొంచెము, సాధించవలసినది మిక్కిలి యెక్కువ అని వెల్లడి కాగలదు. ప్రజాస్వామిక వ్యవస్థలో ప్రణాళికాబద్ధమైన ప్రగతికి మందగమనము యెక్కువ.

ఈనాడు దేశములో ఆహార పదార్థాల ధరలు మిన్నంటి పోవుచున్నవి. నిరుద్యోగము ప్రబలుచున్నది. విద్యావంతులలో, విద్యార్థులలో అశాంతి అతిశయించుచున్నది. రాజకీయాలలో అవినీతి సర్వత్ర కనిపించుచున్నది. లంచగొండితనము, దొంగమార్కెటులు విజృంభించుచున్నవి. రాజకీయాధికారమును హస్తగతము కావించుకొనిన కొందరు అపారమైన ధనము ఆర్జించి ధనికులైన నిదర్శనాలు చూపించవచ్చును. కరువు కాటకాలు అప్పుడప్పుడు తప్పుట లేదు; రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగములలో కొన్ని కుటుంబాల ప్రాబల్యము సామాన్య మానవుని సమస్యల పరిష్కారమును దూరము చేయుచున్నది కావుననే యీనాడు రచనా రంగములో కూడ అశాంతి కనుపించుచున్నది. దిగంబర కవుల రచనలలో యీ అశాంతిని మనము చూడవచ్చును.

హిందీలోని నయీకవిత ఉద్యమము వంటిదే తెలుగులో దిగంబర కవిత ఉద్యమము. నవజీవన విధానమును రూపొందించవలెనని దిగంబర కవుల ఆశయము వీరికి ఏ ఒక ప్రత్యేక రాజకీయ మతముతో సంబంధము ఉన్నట్లు లేదు. మూఢ నమ్మకాలను చాదస్తాలను వీరు ధిక్కరింతురు. ఈ ధిక్కారములో ఉద్రేకపు పొంగు హెచ్చుగా కనిపించును. అశ్లీలము ఉపయోగించుటకు కూడ వీరు వెనుకాడరు. నేడు దేశభాషలన్నింటిలో యీ విధమైన రచనలు కనిపించుచున్నవి. స్వాతంత్ర్యానంతరము తల యెత్తిన నూతన సాహిత్య ధోరణి యిది. ఇంతకుముందు ప్రస్తావించినట్లుగా

స్వాతంత్ర్యానంతరము సమాజములో వచ్చిన అవాంఛనీయ పరిణామాల ఫలితమే యీ సాహిత్య ధోరణి.

స్వాతంత్ర్యానంతరము తెలుగులో అభివృద్ధిచెందిన సాహిత్యము వచన కవిత్వము. ఈ మార్గములో ఉత్తమమైన రచనలు వచ్చినవి. అగ్రశ్రేణి రచయితలుగా వచన కవులు ప్రసిద్ధిపొందినారు. గేయ కవిత్వానికి యీనాటి సాహిత్యములో ప్రముఖస్థానము. ప్రశంసనీయమైన గేయ కవితా రచనలు చాల గత దశాబ్దములో ప్రకటితమైనవి. తెలుగు వాఙ్మయములో యీ రచనలు మిక్కిలి విలువగలవి. మనదేశములో యిప్పటికి నాలుగు సాధారణ ఎన్నికలు జరిగినవి. ఈ ఎన్నికల సందర్భమున కొన్ని మంచి గేయాలు ప్రకటితమైనవి. ఎన్నికల సాహిత్యమైన యీ గేయాలను యేరికూర్చి ప్రకటించిన బాగుండగలదు. గత శతాబ్దములో పాకిస్తాన్, చైనాలు మనదేశముపైన దురాక్రమణ గావించినవి. ఈ దురాక్రమణ సందర్భములో మన కవులు, పెద్దలు - పిన్నలు చేసిన రచనలు కొన్ని ఉత్తమశ్రేణికి చెందియున్నవి స్వాతంత్ర్యానంతరము వచ్చిన సాహిత్యములో యీ రచనలను సమర సాహిత్యముగా మనము పరిగణించవచ్చును. ఇదే విధముగా సినిమా పాటలలో రసవంతమైన సాహిత్యము కొంత మనము సేకరించవచ్చును.

ఈనాడు అన్ని భాషలలోవలె తెలుగులో కూడ నవలలు, కథానికలు పుష్కలముగా ప్రకటితమగుచున్నవి. ఈ నవలలో, ఈ కథానికలలో సమకాలిక జీవితము తత్సంబంధమైన సమస్యలు ప్రధాన స్థానము ఆక్రమించుచున్నవి స్వాతంత్ర్యము తరువాత ఇతివృత్తము, శైలికి సంబంధించిన మన అభిరుచులలో వచ్చిన మార్పులను నేటి నవలలలో, కథానికలలో చూడవచ్చును కవిత్వము, కథలు, నవలలు యీ మూడు సాహిత్య ప్రక్రియలలో

హిందీ, బెంగాలి భాషలనుండి అనువాదాలు చాల ప్రకటితమైనవి. రవీంద్రుడు, శరత్‌చంద్రుడు, ప్రేంచంద్, జయశంకర్ ప్రసాద్, జైనేంద్రకుమార్ ప్రభృతుల రచనలు అనేకములు తెలుగులోనికి వచ్చినవి. వీని తరువాత పేర్కొనదగిన సాహిత్యము నాటకాలు, నాటికలు. అయితే యీ రంగములో మనము ప్రశంసనీయమైన ప్రగతి సాధించలేదేమో! రేడియో ద్వార ప్రసారమైన వానిలో కొన్ని ప్రశస్తమైన నాటికలు ఉన్నవి.

స్వాతంత్ర్యానంతరము స్త్రీ రచయితలు చాలమంది ముందుకు వచ్చి పురుషులతో సమానముగా రచనలు గావించుచున్నారు. కొంతమంది విద్వాంసులు ఉత్తమ సాహిత్య విమర్శలను ప్రకటించినారు. ప్రాచీన, అధునాతన రీతులలో యీ సాహిత్య విమర్శలు సాగినవి. పదప్రయోగకోశాలు, నిఘంటువులు, వృత్తి పదకోశాలు యిటీవల ప్రకటితమైన ప్రామాణిక ఉత్తమ గ్రంథాలు. ఒక వైపున అత్యంత ఆధునికమైన అభిరుచులు పూర్వపద్ధతుల పైన తిరుగుబాటు స్వాతంత్ర్యానంతర సాహిత్యము యొక్క ప్రత్యేకతలుగా కనిపించుచుండగా మరొక వంక ప్రాచీన రచనల పట్ల అభిమానము, ఆదరణ కూడ నేడు పాఠకులలో గోచరించుచున్నది.

ఉద్రేకము సౌకుమార్యము సరసముగా సమ్మేళనము పొందిన ప్రకృతి ఆంధ్రునిది. కావుననే కాబోలు తెలుగులో కవుల సంఖ్య నాటికీ నేటికీ యెక్కువే; సంప్రదాయము, ప్రయోగము రెండును నేటి కవిత్వములో గోచరించుచున్నవి. ఇంతకుముందు చెప్పినట్లుగా గేయకవిత - వచన కవిత స్వాతంత్ర్యానంతరము తెలుగులో అభివృద్ధిపొందిన కవితా రీతులు. అభ్యుదయ కవిత్వము తరువాత పొడసూపిన నూతన మార్గము దిగంబరకవిత. మాన

వతా వాదము యీ రెండు కవితా మార్గాలకు ప్రధాన ప్రాతిపదిక ; పీడిత ప్రజలవాణి, యీ రచనలలో బిగ్గరగా వినువించుచున్నది. స్వాతంత్ర్యానంతరము నవలలు, కథానికలు పాఠకలోకమును విశేషముగా ఆకర్షించుచున్న సాహిత్య ప్రక్రియలు. ఈ రెండు మార్గాలలో అసంఖ్యాకముగా ప్రకటితమగుచున్న రచనలు నేటి సమాజానికి ప్రతిబింబాలు. విశేషించి మధ్యతరగతి కుటుంబాల పరిస్థితులు— సమస్యలు వీనికి యితివృత్తాలు. ఈ శతాబ్దపు రచనలను ముఖ్యముగా స్వాతంత్ర్యానంతర రచనలను కళాదృష్టితో విలువ కట్టవలసి వచ్చినచో కథానికకు ప్రథమ తాంబూలము యీయవలెను. తెలుగు కథానికలకు భారతీయ సాహిత్యములో గౌరవస్థానము.

గడచిన అర్థ శతాబ్ధములో, అందులోను స్వతంత్ర భారతములో భారతీయ సాహిత్యములపైన విదేశీయ-విజాతీయ ప్రభావము గోచరించినప్పటికిని భారతీయ సంస్కృతి యొక్క ముద్ర యితర సాహిత్యములతో పాటు తెలుగు సాహిత్యము మీద స్పష్టముగా కనిపించును.

(1970)

ఏకశిలానగరము - స్థలపురాణము

ఈనాడు వరంగల్ అని పేరుగాంచిన పట్టణమే ఆనాటి ఏకశిలానగరము. ఓరుగల్లు అని కూడా ఈ పట్టణాన్ని వ్యవహరిస్తున్నాము. ఆంధ్రదేశ చరిత్రలో ఏకశిలానగరానికి ఉన్న ప్రాధాన్యము చరిత్రాత్మకమైనది. మొట్టమొదటిసారి తెలుగువారినంతా ఒకే పరిపాలన క్రిందికి తెచ్చి సుమారు మూడునూర్ల సంవత్సరాలు తెలుగుదేశాన్ని పాలించిన కాకతీయరాజుల రాజధాని ఏకశిలా నగరం. పద్మాక్షి వరప్రసాదమున కాకతీయరాజులు "ఘనవైభవమున ఏకశిలానగరమేపారకట్టి"నట్లు స్థలపురాణము తెల్పుతున్నది. అంతేకాదు మహావైభవంబున ఏకశిలానగరం అలకాపురి. సింహాసనంబై యుండు"నని కూడ యీ పురాణమే చెప్పుతున్నది. ఇందువల్ల ఆనాటి ఏకశిలానగరపు పెంపు సొంపులు తెలుస్తున్నవి. కాకతి గణపతిదేవుడు తెలుగుదేశాన్ని పరిపాలించిన కాలంలో వెనీసు దేశమునుంచి వచ్చిన యాత్రికుడు మార్కోపోలో ఏకశిలా నగర ప్రాభవాన్ని చూచి ఆశ్చర్యపడినట్లు చెప్పబడుతున్నది.

ఆంధ్రదేశ చరిత్రకు, ఆంధ్ర సంస్కృతికి మూడునూర్ల సంవత్సరాలకు పైగా ఆటపట్టైన ఏకశిలానగరాన్ని సంస్కృతాంధ్ర కవులు ప్రశంసించినారు. పోతనామాత్యుడు "ఏకశిలానగరంబు నకుం జని" అక్కడ తన భాగవత రచన కొంత చేసినట్లు వ్రాసుకున్నాడు. ప్రతాపరుద్ర యశోభూషణంలో విద్యానాథ మహాకవి యీ పట్టణాన్ని ఆంధ్రనగరమని కీర్తించినాడు. ఏకశిలానగర స్థల ప్రశస్తిని తెలిపే గ్రంథాలు ముఖ్యంగా మూడు. మొదటిది ఏకామ్రనాథుని ప్రతాపచరిత్ర. ఇది వచన గ్రంథము. రెండవది కానె సర్వప్ప ప్రణీతమైన సిద్దేశ్వరచరిత్రము. ఇది ద్విపద కావ్యము. మూడవది క్రీడాభిరామ కావ్యము. ఈ మూడింటిలోను ఏకశిలా నగర వైభవము కన్నులకు కట్టినట్లుగా చిత్రితమైనది. ఈ చిత్రణలో కొన్ని అతిశయోక్తులు ఉండవచ్చునేమో! కవుల రచనలలో అతిశయోక్తులు ఉండడం అసాధారణమేమీ కాదు. కాని ఏకశిలా నగరాన్ని గూర్చి కవులు తెలిపిన సంగతులలో వాస్తవము చాల మట్టుకు ఉన్నట్లు శాసనాధారాలు, ఇతర ఆధారాలు ఉన్నవి. ఈనాడు హనుమకొండ అనే పేరుతో పిలుస్తున్న నగరము కూడ ప్రస్తుతపు ఓరుగల్లులోని భాగమే. ప్రథమగణం శంకరుని ప్రార్థించి ఆయన ప్రత్యక్షం కాగా హనుమకొండవద్ద నున్న గుట్టమీద నివాసం కల్పించుకోవలసినదని కోరినట్లు కానె సర్వప్ప సిద్దేశ్వర చరిత్రలో ఉన్నది. ఈ ప్రాంతాన్నే ఈనాడు సిద్ధాశ్రమమని చెప్పుతున్నారు. హనుమకొండ గుట్టమీద వెలసిన సిద్దేశ్వరుడు మరియు పద్మాక్షీదేవి నిజానికి పార్వతీ పరమేశ్వరులే; తరువాత హనుమకొండ నుండి రాజకీయరాజధాని సైనికకారణముల వలన ఓరుగల్లు కోటకు మారినది. సిద్దేశ్వరచరిత్రలో పార్వతీపరమేశ్వరుల విలాసాన్ని విపులంగా వర్ణించినారు. ప్రతాపరుద్రచరిత్ర, సిద్దేశ్వర

చరిత్ర యీ రెండింటిలోను ఏకశిలానగరాన్ని గురించి అనేక విషయాలు వర్ణితమైనవి. ప్రతాపరుద్రుని దైనందిన కార్యక్రమాన్ని గూర్చి ఆనాటి ఓరుగంటిలోని గృహాలను, పౌరులను గురించి యీ పుస్తకాలలో చాలా సంగతులు చెప్పబడినవి. ఏకశిలానగరం ఆనాడు విద్యా విజ్ఞానాలకు కేంద్రమయినట్లు యీ పుస్తకాల వల్ల తెలుస్తున్నది. ఆనాడు సంగీత, సాహిత్యములకు, శిల్పానికి, చిత్రలేఖనానికి యీ పట్టణం అలవాలమై ఉండెనట. అంతేకాదు ఓరుగంటి సైనికబలాన్ని గురించి కూడా వివరాలు చెప్పబడినవి. విద్యానాథకవి ప్రతాపరుద్రుని నవలక్షధనుర్ధరాధినాథుడు అని ప్రశంసించినాడు. తొమ్మిదిలక్షల విలుకాండ్లు కాకతీయ రాజ్యాన్ని రక్షించినట్లు మనకు యీ గ్రంథంలో తెలుస్తున్నది. ఆనాడు మహా వీరులుగా ప్రసిద్ధిగాంచిన సేనానాయకుల పేర్లు కూడా యీ గ్రంథంలో చెప్పబడినవి. తురకరాజుల దండయాత్రను గూర్చి వారితో జరిగిన యుద్ధాలనుగురించి యీ గ్రంథాల ద్వారా మనకు తెలుస్తున్నది. తురకరాజులు ఏకశిలానగరంపై దండయాత్రచేసి విజృంభించినప్పుడు ఆ ఆపదనుండి కాపాడమని హనుమకొండ లోని సిద్దేశ్వరుని ప్రతాపరుద్రుడు ప్రార్థించినట్లు మనకు తెలుస్తున్నది. ఏకశిలానగరాన్ని కాకతీయులు నిర్మించి వేయిసంవత్సరాలు పరిపాలించినట్లు స్థలపురాణము తెలుపుతున్నది ఏకశిలానగరంలో డెబ్బది నియోగంబుల ప్రజలు ఉండిరట. ఇందులో బ్రహ్మ, క్షత్రియ వైశ్య, శూద్రులైన ప్రధానులు, సామంతులు, దొరలు, భటులు ఉండిరట. ఈ పట్టణంలో కాపురమున్న బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, పద్మనాయకులు మొదలైన అగ్రవర్ణాల గృహాలతో పాటు గొల్లలు, కాపులు, బెస్తలు, తెలగలు, పెరికె, ముచ్చెవారు, బలిజెలు మొదలైనవారి యిండ్ల సంఖ్యను యీ పుస్త

కాలలో పేర్కొన్నారు. వండిపెట్టే వంటలక్కల యిండ్లతోపాటు పరిచారకగృహాలు వేశ్యాగృహాలు కొన్నివేలు ఉండెనట.

ఇంద్రపురముతో సమానమైన ఏకశిలానగరంలో ఉన్న దేవాలయాలనుగూర్చి, పురోహితులగూర్చి, వారు చేసే శివపూజలనుగూర్చి యిందులో మనకు వివరాలు తెలుస్తున్నవి. ఈశ్వర స్థానాలసంఖ్య, విష్ణుస్థానాలసంఖ్య దుర్గా గణపతి క్షేత్రాల సంఖ్య యిందులో యీయబడినది. ఈ గుళ్ళలో ఏకవీరాదేవి గుడిని ప్రత్యేకంగా పేర్కొనవలెను. ఆ కాలంలో ఏకశిలానగర ప్రాంతాన ఏకవీర జాతరలు యెక్కువగా జరుగుతుండేవట. కాకతీయరాజుల ఇలవేల్పు కాకతి. ఈ కాకతమ్మకు సైదోడు ఏకవీర అని ఆనాడు ప్రసిద్ధి. ఈ దేవతలిద్దరికి ప్రత్యేకమైన గుళ్లు నిర్మింపబడినవి. దేవబ్రాహ్మణ పూజలనుగూర్చి, వారుచేసే శివపూజలనుగూర్చి, పురోహితులను గూర్చి, ఇందులో మనకు వివరాలు తెలుస్తున్నవి. తటాక వన నిర్మాణాలనుగూర్చి యిందులో పేర్కొనబడినది. నవలక్ష ధనుర్ధరులకు ఏడాదికి మూడుకోట్ల యెనుబదిలక్షల ఖర్చు జరుగుతుండేదట. ఏకశిలానగరములో గల దేవతావైభవాలను గూర్చి ఇందులో విపులంగా తెలుపబడినది. శివదేవయ్య అనే మహామంత్రి ప్రతాపరుద్రునికి మంత్రియేగాక గురుడు, సఖుడు కూడా అయి ఉండెనట. జ్యోతిష్యంలో రాజుగారికి చాలా విశ్వాసం. మల్లికార్జునభట్టు, కృష్ణమాచార్యులు, మొల్లరంగనాథుడు, పాలకుర్తి సోమనాథుడు మొదలయిన కవులు యీ పట్టణాలలో చేసిన విద్యా వినోదాలను, కవితా ప్రదర్శనాలను గూర్చి యిందులో పేర్కొనబడినది. ఈ పట్టణానికి తిక్కన రాకను గురించి ఆయనకు జరిగిన సత్కారాలను గురించి, తిక్కన వ్యక్తిత్వాన్ని గూర్చి మనకు యిందులో విపులంగా తెలుస్తున్నది.

ఏకశిలానగర దుర్గము శత్రువుల దండయాత్రలను ఎదు ర్కొనడానికి తగినట్లుగా నిర్మించబడినది. ఆ రోజులలో యీ నగరానికి యేడుకోటలు— నేడు రెండు కోటలు మాత్రమే మనకు కనిపిస్తున్నవి. ఈ పట్టణం చాలా శోభయమానంగా ఉండేదని తురక సేనలకు యీ శోభ కన్నుకుట్టేదని చెప్పబడినది. ఆనాడు ఏకశిలానగరం యెటు చూచినా రెండుమైళ్ళ పొడవునా పూల తోటలు, పండ్లతోటలతో శోభిస్తూ ఉండేదట. ఏకశిలానగర పరిసర ప్రాంతాలలో మనకు యీనాడు కనుపిస్తున్న చెరువులు కాకతీయుల కాలంలో నిర్మించినవే. ఏకశిలానగర రాజులు వ్యవసాయానికి, వాణిజ్యానికి అత్యంత ప్రాధాన్యము యిచ్చినట్లు యిందువల్ల తెలు స్తున్నది. కాకతీయరాజులు ఓరుగల్లును సుందరనగరంగా తీర్చి దిద్దినారు. శిల్పము, చిత్రలేఖనము, విద్యా విజ్ఞానాలతో పాటు సంగీత సాహిత్యాలు కూడా ఆనాడు అభివృద్ధిచెందినవని మనకు యీ గ్రంథాల ద్వారా తెలుస్తున్నది. కుట్టుపనివారు. స్వర్ణకారులు, మేదరివారు మొదనయిన అన్ని వృత్తుల వారిని గూర్చి ప్రస్తావన యిందులో ఉన్నది. రాజులకొరకు రాణులకొరకు చాలా సన్నని బట్టలు తయారుచేస్తుండేవారని తెలుస్తున్నది. అప్పటి అంగళ్ళలో అన్ని వస్తువులు విక్రయింపబడేవట. వేశ్యలలో పేరుగాంచిన మాచల్దేవి గృహ వైభవము క్రీడాభిరామములో వర్ణింపబడినది. ఈ మేడలో చిత్రశాల కూడ ఒకటి ఉండేదట. కాకతీయరాజులు కొంతకాలం జైనులుగాను, కొంతకాలం శైవులుగాను ఉండిరి. ఏకశిలానగరంలో భాగమైన హనుమకొండ గుట్టపైన జైన విగ్ర హాలు ఉన్నవి. అక్కడనే పద్మాక్షిదేవాలయం కూడ ఉన్నది. వేయిస్తంభాల దేవాలయం సుప్రసిద్ధమైనది. హనుమకొండ, ఏకశిలా నగరం మధ్య ఉన్న చెరువు భద్రితటాకం. దీని మీద భద్రకాళి

దేవాలయం ఉన్నది. శివాలయాలతో పాటు వైష్ణవాలయాలైన కేశవస్వామి ఆలయం, నరసింహస్వామి ఆలయం కూడా ఉండి నవి. శిథిలమైన ఏకశిలానగరంలో శిల్పసంపద యీనాటికి పుష్కలంగా కనుపిస్తున్నది. ఏకశిలానగరంలో ప్రజల జీవితం ఆనాడు సకలసంపదలతో శోభిల్లుతుండేదని చెప్పబడినది. ఆ రోజులలో ఏకశిలానగరం పూటకూటింటిలో ఒక రూక యిస్తే దొరికే భోజనాన్ని గూర్చి క్రీడాభిరామంలో చెప్పిన పద్యము అందరికి తెలిసినదే. కప్పురభోగివంటకం, కమ్మని గోధుమపిండి వంట, గుప్పెడు పంచదార క్రొత్తగా కాచిన ఆవునేయి, పెసరుపప్పు, అరటిపండ్లు, నాలుగైదు నంజులు, లప్పలతోడ క్రొంబెరుగు, ఆనాటి ఏకశిలా నగర సౌభాగ్యానికి అక్షరమైన చిహ్నము. వీధులలో రసికులైన పౌరులు జూదాలు ఆడుతుండేవారని, పొట్టేళ్ళ పోట్లాట, మల్ల యుద్ధాలు, కోళ్ళ పోట్లాటలు జరుగుతుండేవని అప్పటి వినోదాలను గురించి క్రీడాభిరామములో చెప్పబడినది. ఈ గ్రంథంలో ఆనాటి ప్రజాజీవితం కన్నులకుగట్టినట్లు వర్ణితమైనది.

ఇంత వైభవంతో ఉండిన ఏకశిలానగరం తరువాత తురక రాజుల వశము కాగా సుల్తానుపురము అను పేరు పెట్టబడెను. ఆ పిమ్మట తిరిగి తెలుగువీరులు విజృంభించి తురకరాజులను పారద్రోలి ఏకశిలానగరాన్ని స్వాధీనము చేసుకున్నట్లు తెలుస్తున్నది. అయితే యేబది సంవత్సరాల కంటె యెక్కువగా దీనిని వీరు తమ వశములో ఉంచుకోలేకపోయినారు. కొన్నాళ్లకు యేకశిలా నగరం బహమనీరాజుల యేలుబడిలోనికి, ఆ పిమ్మట ఆసఫ్జాహి పరిపాలన క్రిందికి వచ్చినది.

ఈ నాటికీ ఏకశిలానగర పూర్వవైభవాన్ని చెప్పే శిథిలాలు మనకు కనుపిస్తున్నవి. శిథిలమైనకోట, శిథిలమైన దేవాలయాలు

మనము చూడవచ్చును. ప్రస్తుతం ఏకశిలానగరం ఖాజీపేట, హనుమకొండ, మట్టెవాడ, వరంగల్ కోట, ఉరుసు, కరీమాబాదు అను ప్రాంతాలలో పదిమైళ్ల పొడవు ఆక్రమించి ఉన్నది. ఇది యీనాడు వరంగల్ జిల్లాకు కేంద్రమై వర్తక, వాణిజ్యాలకు, పరిశ్రమలకు ఆటపట్టయి ఉన్నది. వరంగల్ తివాచీలనేతకు యిప్పటికిని ప్రసిద్ధి. నూనెగింజలు, ధాన్యము, చేనేత వస్త్రములు, కలప యిక్కడి నుండి ఎగుమతి అవుతున్నవి. మన రాష్ట్రంలో నేడు హైదరాబాదు తరువాత వరంగల్‌ను పేర్కొనవలసి ఉంటుంది. ఒక పెద్ద బట్టలమిల్లు, ఇంజనీరింగ్ కళాశాల, వైద్య కళాశాల, పాలిటెక్నిక్, ఉపాధ్యాయ శిక్షణ కళాశాలతోపాటు అనేక విద్యా సంస్థలు యీనాడు పనిచేస్తున్నవి.

సుమారు నలుబది సంవత్సరాల క్రిందట ఒకానొక తెలుగు కవి :

"నవలక్షాదిధనుర్ధరుల్ గొలువ భూనాధుల్
ప్రశంసింప స
త్కవులుద్గ్రంధములన్ రచింప కళలత్యంతంబు
పెంపొంద ప్రా
భవ సంపన్న ప్రతాపరుద్రధరణీ
పాలుండు పాలింపవై
భవముల్ గాంచిన ఓరుగల్లు తిలకింపన్
రాగదోయీ సఖా"

అని ఆహ్వానించినాడు. ఈ ఆహ్వానము ఈనాడు కూడ సార్థకమే.

(19—1—72)

మా ఊరు - ఓరుగల్లు

మా ఊరినిగూర్చి మాట్లాడినపుడు ఇప్పటికి సుమారు ఎనిమిదినూర్ల సంవత్సరాల క్రిందట జరిగిన ఒక చిన్న సంఘటన తటుక్కున తలపునకు వస్తుంది మా ఊరిలోని వాడ వాడన వేడుకతో విహరించి, మిట్ట మధ్యాహ్నమున వీధి గడియారము రెండెనిమిదులను అనగా ఇప్పటి పన్నెండు గంటలను కొట్టగానే ఇద్దరు రసిక హృదయులు పూటకూటి ఇంటికివెళ్ళి ఒక్క రూక వ్యయముతోనే షడ్రసోపేతమైన భోజనము చేసిన ఉదంతము ఎన్నటికీ మరువరానిది. ఇన్ని నూర్ల సంవత్సరాలు గడచినప్పటికిని ఈ ఉదంతము మన స్మృతిలో ఇంత స్పష్టముగా మెదలడానికి కారణము కప్పురభోగి వంటకము, కమ్మని గోధుమపిండి వంట, గుప్పెడు పంచదార, క్రొత్తగాకాచిన ఆవునెయ్యి, అరటిపండ్లు, పెసరపప్పు లప్పలతోడ క్రొంబెరుగు నాలుగైదు నంజుళ్లతో లక్ష్మణ వజ్ఝల పూటకూటి ఇంటిలో ఆనాటి మిట్టమధ్యాహ్నమున ఇద్దరు స్నేహితులకు దొరికిన షడ్రసోపేతమైన భోజనము నేటికిని

శ్రీనాథకవి సార్వభౌముని క్రీడాభిరామములో మన జిహ్వకు విందు జేయుచుండడమె! తెలుగు సాహిత్యముతో పరిచయమున్న వారందరును నాడు మా ఊరు ఓరుగల్లు వడ్డించిన వంటకాల రుచి చూచినవారే!

ఓరుగల్లు, ఏకశిలానగరము, వరంగలు అను నామాంతరములతో మా ఊరు అద్వితీయమైన ఖ్యాతిని సంపాదించినది. మా ఊరిలోని కూలిపోయిన కోటగోడలను, రాజప్రాసాదాలను, అంతఃపుర భవనాలను నేటికిని చెన్ను చెడని సుందర శిల్పశోభితమైన శిథిల మందిరాలను, మండపాలను, దేవాలయాలను జీర్ణావస్థలో చూచినపుడు—

"కాబోలు నియ్యది కాకతీయులొకప్డు
కరకు నెత్తుట కత్తికడుగుచోటు
కాబోలు నీ ద్వార కల్యాణవేదిక
అలికి ముగ్గులు పెట్టె తెలుగుపడుచు
కాబోలు నీ జీర్ణ కమనీయసౌధాన
సుకుమార శిల్పముల్ సొంపులొలికె
కాబోలు నీ వీధి కాపురం బొనరించె
పైడి మేడలలోన భాగ్యలక్ష్మి"

అని హృదయము ద్రవించిపోవును.

మూడునూర్ల సంవత్సరాలపాటు కీర్తి చంద్రికలను వెదజల్లిన కాకతీయ మహాసామ్రాజ్యానికి ఓరుగలు రాజధానిగా విలసిల్లినది ఏకశిలాదేవికి అనగా నేడు జనసామాన్యానికి సుపరిచితయైన ఎల్లమ్మదేవతకు అంకితముగా నిర్మింపబడిన ఏకశిలా నగరములో ఈ నాటికిని ఎల్లమ్మగుడులు చాలా ఉన్నవి. ఎల్లమ్మ

బజారు అను వాడ కూడా ఈనాడు మా ఊరిలో సుప్రసిద్ధమై యున్నది ఓరుగల్లునగరాన్ని స్మరించగానే కాకతీయ మహా సామ్రాజ్యాన్ని అత్యంత వైభవంగా పరిపాలించిన ప్రోలరాజు, రుద్రదేవుడు, గణపతిదేవుడు, రుద్రమదేవి, ప్రతాపరుద్రుడు మనకు వెంటనే జ్ఞప్తికి వత్తురు కాకతీయ ప్రభువులలో నూటికి నూరు పాళ్ళు తెలుగుదనము ఉట్టిపడినది తెలుగువారికి తాను తెలుగువాడనను సత్యమును గుర్తింపజేసిన గౌరవము ఓరుగంటి పట్టణానికేదక్కినదని స్వర్గీయ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు వివరించినారు. కాకతీయ ప్రభువులు తమ రాజధానియైన ఓరుగల్లును ఆంధ్రనగరమని ప్రశంసించారు. విద్యానాధ మహాకవి తన ప్రతాపరుద్రీయములో మా ఊరిని ఆంధ్రనగరమని అల్లారు ముద్దుగా అభివర్ణించినాడు. అమృతఫలమైన భాగవతమును ఆంధ్రుల కందజేసిన పోతన మా ఊరికి దరిదాపులవాడు. బహుశా భాగవతములోని కొంత భాగమును పోతన ఓరుగంటిలోనే వ్రాసినాడేమో! నెల్లూరి నెరజాణ తిక్కన మా ఊరిలోనే మొట్టమొదటి సారిగా గణపతిదేవుని ఆస్థానములో భారత కావ్యమును పఠించి ఆవిష్కరింపజేసినాడని స్థానికచరిత్ర తెల్పుతున్నది. జాను తెనుగులో శైవ ప్రబంధములను వెలయించిన పాల్కురికి సోమనాధుని కార్యరంగము కూడా మా ఊరి పరిసరాలే నాడు మా ఊరి మందార మకరంద మాధుర్యమున దేలి కవితా గానముజేసిన వారు మరెందరో ఉన్నారు. ఏ ప్రాంతానికి వెళ్ళినా ఏదో ఒక వంకబెట్టి అక్కడి ఆచార వ్యవహారాలను, అక్కడి వంటకాలను వెక్కిరించిన కవి సార్వభౌముడు శ్రీనాధుడు మా ఊరిని పలు భంగుల ప్రస్తుతించినట్లు సాహిత్యరూపకమైన సాక్ష్యమున్నది. మా ఊరిలోని

జాయవ సేవానివంటి వారలు నృత్యరత్నాకరము వంటి శాస్త్రములను రచించినారు.

మా ఊరు పుట్టుపూర్వోత్తరాల చరిత్రను వెదకడానికి దాదాపుగా వెయ్యి సంవత్సరాలు వెనుకకు వెళ్ళవలసియుండును. ఓరుగల్లుకోట నిర్మాణాన్ని మొదట ప్రారంభించినది గణపతిదేవ చక్రవర్తి. గణపతిదేవుడు ప్రారంభించిన నిర్మాణమును రుద్రమదేవి పూర్తిచేసినది

లోపలి రాతికోటను పెద్దకోటయని, బయటి మట్టి ప్రాసారమును భూమికోటని పిలుచుచుండిరి. భూమి కోటగా పేరుపొందిన మట్టి ప్రాకారము సామాన్యమైనదికాదని చరిత్రకారుల అభిప్రాయము. అల్లాఉద్దీన్ ఖిల్జీ ఆజ్ఞతో క్రీ. శ. 1296 సంవత్సరములో మలిక్ కాఫర్ సేనాని నాయకత్వాన దాడిచేసిన సైన్యం మట్టి కోటను పడగొట్టడానికి ప్రయత్నించినది. కాని మలిక్ కాఫర్ సైన్యాల ప్రయత్నాలు యిసుమంత కూడా ఫలించలేదు. ఉక్కు బల్లెములతో పొడిచినప్పటికిని మట్టికోట నుండి ఒక్క బెడ్డకూడా రాలలేదని, దానిపై పెద్దపెద్ద గుండ్లను వేయించితే అవి పిల్లలాడుకొను గోళీలవలె వెనుకకు ఎగిరిపడినవని అమీర్ ఖుస్రూ వ్రాసినాడు. ఆంధ్రుల రణతంత్రానికి ఆటపట్టుగా మా ఊరు రాణించినది. మా ఊరిలో ఆనాడు తొమ్మిది లక్షల సైన్యము ఉండినదట ; మిల్ట్రి కంటోన్మెంట్లవంటి మొహరివాడలు ఉండెడివట ; ఓరుగల్లున రాజవీర లాంఛనముగా పలు శస్త్రశాలలు నిలుపునాడు తెలుగుజోదులు ప్రదర్శించిన శౌర్య ప్రతాపాలను, తేజమును కవులు ఘనముగా కీర్తించినారు. అగ్నికి సంబంధించిన అస్త్రాలను మొట్టమొదట వరంగలు కోటమీదనే ప్రయోగించినారని, అటుతర్వాతనే ఫిరంగులు, తుపాకులు రూపొందినవని సైనిక

శాస్త్రజ్ఞుల అభిప్రాయము. ఢిల్లీ పాదుషాలకు మొదటినుండి మా ఊరిమీదనే యీర్ష్య; అనేక పర్యాయాలు కాకతీయవీరులకు ఢిల్లీ పాదుషాల కరకుసైన్యాలకుమధ్య మా ఊరిలో యుద్ధాలు జరిగినవి. లోకమంతకు కాకపెట్టిన కాకతీయుల కదన పాండితికి మా ఊరు రంగస్థలమైనది.

కదనరంగమె కాక మా ఊరు కళాక్షేత్రము గూడా. సంగీతము, సాహిత్యము, చిత్ర లేఖనము, శిల్పము మొదలైన కళలు మా ఊరిలో కాకతీయ ప్రభువుల ఆధ్వర్యాన వేయి ముఖాలుగా విస్తరించినవి. కాకతీయ ప్రభువుల పోషణతో, ప్రోత్సాహముతో తెలుగుభాష తెలుగుసాహిత్యము తెలుగుకళలు అద్వితీయముగా అభివృద్ధిచెందినవి. నాడు తెలుగుభాష దాదాపుగా అధికార భాషగా అమలులోనికి వచ్చినది. కాకతీయ ప్రభువులు తెలుగులో శాసనాలను వ్రాయించినారు. వరంగల్లు కోటలోని కట్టడాలు, వేయి స్తంభాల దేవాలయము, పద్మాక్షి దేవాలయము మొదలైన ఆలయాలు యీ రోజు శిధిలమైనప్పటికిని నాడు శిల్పము, సంగీతము చిత్రలేఖనము నృత్యమువంటి కళలు సాధించిన అత్యున్నతస్థాయికి సాక్షీభూతంగా, సజీవ నిదర్శనాలుగా నిలిచి ఉన్నవి.

మా ఊరు ఆంధ్రదేశ చరిత్రలో అనేక విధాలుగా ప్రశస్తి గాంచినది. ఆ కాలములో మనదేశానికి వచ్చిన విదేశీయాత్రికుడు మార్కొపోలో ఓరుగంటి రాజ్య వైభవాన్ని వేనోళ్ళ కీర్తించినాడు. ఒకానొక తురక సేనాని ఆనాటి ఓరుగంటి స్వరూపమును కన్నులకు గట్టినట్టుగా వర్ణించినాడు. ఆనాడు మా ఊరిలో ఏ దిక్కు జూచినప్పటికిని రెండుమైళ్ళ పొడవున నీటినాళాలు తోటలు కనిపించెడివట. ఈ తోటలలో మామిడి, అరటి, పనసపండ్ల చెట్లు, చంపకము, మొగలిపువ్వుల చెట్లు అసంఖ్యాకముగా ఉండెడివి.

నగరము వాడలుగా తీర్చిదిద్దబడి యుండెను. అక్కలవాడ, మేదరి వాడ, మొహరివాడ ఇందులో ముఖ్యమైనవి. దేవాలయాలు, రాజ భవనాలు, పూటకూటి ఇండ్లు ఈవాడలలో గోచరించెడివి. జైనము, శైవము తరువాత వైష్ణవము మా ఊరిలో వ్యాప్తిచెందిన ముఖ్య మతాలు.

ఇండ్లను, ముంగిళ్ళను, ఓరుగంటిలో చిత్రవిచిత్రముగా, సుందరముగా అలంకరించెడివారు. అప్పుడు మా ఊరిలోని ముంగిళ్ళముందు పడుచులు తీర్చిదిద్దిన ముగ్గులను చూచి—

"చందనంబున కలయంపి చల్లినారు
ముగ్గులిడినారు కాశ్మీరమున, ముదమున
వ్రాసినా రిందురజమున రంగవల్లి
కంజముల తోరణంబుల గట్టినారు"

అని శ్రీనాథుడు వ్రాసినాడు. అప్పుడు మా ఊరిలో పది హేను నూర్లమంది చిత్రకారులుండిరని ఏకామ్రనాథుడు వ్రాసినాడు. ఉత్తమమైన ఉన్నికంబళాలకు, విశిష్టమైన దంతపుపనికి మా ఓరుగల్లు వినుతికెక్కియుండెను. ఇప్పటికిని మా ఊరు కంబళాల, జంపఖానాల నేతలో ప్రసిద్ధికెక్కి యున్నది. మా ఊరి కోటబయటి మైలసంతలోను వాడవాడలయందును చందనము, కస్తూరి, సంపెంగనూనె మొదలైన సుగంధ ద్రవ్యాలను పుష్కలముగా అమ్మెడివారట. కోలాటము, బతుకమ్మ, జాజరి ఆటలు నాడును నేడును మా ఊరిలో ప్రసిద్ధమైన క్రీడలు. సంస్కృతమును వేద వేదాంగములను బోధించుటకు కళాశాలలు ప్రజల అరోగ్యావసరా లకు ఆరోగ్యశాలలు ప్రసూతి గృహాలు మా ఊరిలో కొల్లలుగా ఉండెడివి. అప్పుడు మా ఊరిలోని ధనికులు పల్లకీలలో తిరిగెడి

వారు. ఆనాడు మా ఊరి స్త్రీలకు తాటంకములు, ముత్యాలకమ్మలు కాంచీపుర కంకణములు, త్రిసరములు, కడియములు మొదలైనవి ప్రీతికరమైన ఆభరణాలు. చిత్రలేఖన విద్యలో నిపుణులైన ఆనాటి తెలుగు పడుచులు ప్రత్యేకముగా చిత్రశాలలను తమ ఇండ్లలో ఏర్పాటుజేసుకొన్నారని స్థానిక చరిత్ర తెల్పుతున్నది.

నాటి మా ఊరి సమాజము ఆర్థికముగా, సాంస్కృతిక ముగా ఇంత సుసంపన్నమై శోభిల్లడానికి కారణము ఆనాడు కాక తీయ ప్రభువులు వ్యవసాయము, వర్తక వాణిజ్యాల అభివృద్ధిపట్ల శ్రద్ధ వహించడమే. మా ఊరి చుట్టుప్రక్కల కాకతీయ ప్రభువులు వ్యవసాయమును అభివృద్ధిచేసినారు. తత్ఫలితముగా మా ఊరు ధాన్యాగారముగా రూపొందినది. దూరదూర ప్రాంతాలతో, దేశాలతో మా ఊరు ఆనాడు వర్తకం జరిపినది. నాటి మా ఊరి గాథ ఒక రమణీయమైన స్వప్నమువంటిది. సమయసైకతరాసుల క్రింద మా ఊరి చరిత్ర మరుగుపడిపోయినది. తిరిగి ఈనాడు మా ఊరిలో మరొక నూతన చరిత్ర రూపు ధరించుచున్నది. భవిష్యత్తు మరొక సుందర స్వప్నమువలె కన్నులకు కట్టుచున్నది.

ఈ రోజు మా ఊరి వైశాల్యము ఇంత ఉన్నదని చెప్ప డానికి వీలులేదు ఎందుకంటే మా ఊరు రోజురోజుకు శరవేగంగా విస్తరించుతున్నది. హైదరాబాదునుండి తూర్పుకు ఎనుబది మైళ్ళు వెళ్లగానే ఖాజీపేట రైల్వేకూడలి కనిపించుతున్నది. ఇటు యీ చివరన ఖాజీపేటనుండి అటు వరంగల్లుకోట ఆవలి వరకు పది పన్నెండు మైళ్ల పొడవున మా ఊరు వ్యాపించియున్నది. మా ఊరు మధ్యన పెద్దపెద్ద గుట్టల నడుమ ఒక పెద్ద చెరువు ఉన్నది. ఈ చెరువు గట్టుమీద గుట్ట ప్రక్కన కాకతీయులనాడు కట్టించిన భద్రకాళి ఆలయము చాలా మంది భక్తులను ఆకర్షించుచున్నది.

విద్యా వైజ్ఞానిక రంగంలో మా ఊరు సాధించుతున్న ప్రగతి ఆశ్చర్యము కలిగించగలదు. మా ఊరిలోని గాంధీ స్మారక వైద్యశాల చాలా పెద్దది. ఈ వైద్యశాలకు దగ్గరిలోనే మా ఊరి ప్రజలు ఒక పెద్ద వైద్యకళాశాలను స్థాపించుకున్నారు; ఇది కాకతీయవైద్యకళాశాల. ఆర్ట్సు అండ్ సైన్సు కళాశాల పాలిటెక్నిక్ ఇనిస్టిట్యూట్, సాయంకళాశాల, విద్యాబోధన ట్రైనింగు కళాశాల ఆయుర్వేద కళాశాల, రెండుమూడు సంస్కృత కళాశాలలు మా ఊరిలోని విద్యాసంస్థలలో ముఖ్యమైనవి. మా ఊరిలో కేంద్ర ప్రభుత్వము స్థాపించిన ఇంజనీరింగ్ కళాశాల దేశంలోని ముఖ్యమైన ఇంజనీరింగ్ కళాశాలలో పేర్కొనదగినది. ఇంకను మరికొన్ని కొత్త విద్యాసంస్థలు, కళాశాలలు రానిదే మా ఊరి విద్యావసరాలు పూర్తికావు. ఇటీవల మా ఊరిలో మహిళాకళాశాల కూడా ప్రారంభమైనది. కొద్ది రోజులలోనే వరంగల్లులో కాకతీయ విశ్వవిద్యాలయము స్థాపితముకాగలదు.

మా ఊరి చుట్టుప్రక్కల రామప్ప, లక్నవరము, పాఖాల, ధర్మసాగరము తటాకముల వంటి పెద్దపెద్ద జలాశయములుండుట వలనను ఇప్పుడిప్పుడు క్రొత్తక్రొత్త నీటివసరులు తదితర సౌకర్యాలు యేర్పడుతున్నందువలనను వడ్లు, వేరుసెనగ, ఉల్లిగడ్డ, వెల్లిగడ్డ మిరపకాయలు, ధనియాలవంటి వ్యావసాయిక సరుకులు పుష్కలముగా ఉత్పత్తియౌచున్నవి. ఈ సరుకులన్నీ వరంగల్లులోని ప్రముఖమైన వ్యావసాయిక మార్కెట్టుకు ప్రతిరోజు వస్తుంటవి. తెలంగాణములోని ప్రాధమిక వ్యావసాయిక మార్కెట్టు లన్నింటిలోను మా ఊరి మార్కెట్టు చాలా పెద్దది. వ్యావసాయిక సరుకులు విరివిగా రావడమువలన మా ఊరు వెనకటినుండి గూడా వర్తక వాణిజ్యాల కేంద్రంగా ప్రాముఖ్యము వహించుతున్నది. మా ఊరిలో

అధునాతనమైన ఒక మంచి బట్టలమిల్లు ఉన్నది. ఇది ముప్పది సంవత్సరాల క్రిందట అప్పటి రాజకుమారుని పేరుతో స్థాపితమైనది. మనరాష్ట్రంలో ముఖ్యమైనదిగా పరిగణించబడుతున్న ఈ బట్టల మిల్లు వేలమంది కార్మికులకు తదితరులకు ఉద్యోగాన్ని కల్పిస్తున్నది. పూర్వకాలంలో ప్రసిద్ధిజెందిన చేతిపనులు కొన్ని ఈనాటికిని మా ఊరిలో నిల్చియున్నవి. వరంగల్లులో తయారు చేసే జమ్ఖానాలు, తివాచీలు ప్రపంచ ప్రఖ్యాతిపొందినవి. ఈ నేత వృత్తిని అవలంబించేవారు ఇప్పటికిని మా ఊరిలో ఉన్నారు. భారతదేశంలోని వివిధ ప్రాంతాలవారు మా ఊరి తివాచీలను జంఖానాలను మక్కువతో తెప్పించుకొంటారు. మా ఊరిలోని ఖాజీపేట, వరంగల్లు రైల్వే స్టేషన్‌లు వర్తక వాణిజ్యాల అభివృద్ధికి, పట్టణ సర్వతోముఖ ప్రగతికి ఎక్కువగా దోహదమిస్తున్నవి. దాదాపు ముప్పది సంవత్సరాల క్రిందటనే మా ఊరిలో అధునాతన పద్ధతిలో మంచినీరు, విద్యుచ్ఛక్తి సౌకర్యాలు కల్పించబడినవి. మా ఊరి పారిశ్రామిక వాటికలో చిన్న తరహా పరిశ్రమలు ; జైలు ఆవరణములో కుటీర పరిశ్రమలు పెంపొందుతున్నవి. వరంగల్లులోని బియ్యం మిల్లులనుండి, కలప మిల్లుల నుండి బయటి ప్రాంతాలకు బియ్యమూ కలపా సరఫరా చేయబడుతున్నవి. వరంగల్లు అవసరాలకొరకని పట్టణ పరిసరాలలోని మామునూరు విమానాశ్రయం సమీపంలో ఒక పెద్ద పాలసరఫరా కేంద్రం స్థాపించబడుతున్నది.

తెలంగాణా ప్రాంతములో హైద్రాబాదునగరం తర్వాత స్థానాన్ని ఆక్రమిస్తున్న మా వూరు జనసంఖ్య నాలుగు లక్షలను దాటుతున్నది. వెనకటినుండి నేటివరకు అన్ని ఉద్యమాలకు మా ఊరు అగ్రగామిగా నిల్చింది. జాతీయోద్యమంలో, ఆంధ్రోద్య

మంలో, స్వాతంత్ర్యోద్యమంలో, గ్రంథాలయోద్యమములో మా ఊరు గణనీయమైన పాత్రను నిర్వహించినది. జాతిపిత గాంధీజీ, నవభారత నిర్మాత నెహ్రూ మా ఊరిని తమ పర్యటనచే చరిత్రాత్మకము చేసినారు.

గడచిపోయిన ఆనాటి చరిత్రలోనే కాదు, జరుగుతున్న ఈనాటి చరిత్రలోను, రేపు జరుగనున్న చరిత్రలోను మా ఊరు వరంగల్లు గణనీయమైనది.

(1964)

ఓరుగల్లు మండల రచయితలు— మహాసభ అధ్యక్షోపన్యాసము
24–5–68

ఓరుగల్లు మండలము రచయితల మహాసభలు జరుప నిశ్చయించినట్లు ఆహ్వానసంఘము తెలిపినప్పుడు మిక్కిలి సంతోషించినాను. అనేక సంవత్సరాల తరువాత యీ మండల రచయితలు యిక్కడ సమావేశమగుట ఆనందకరమైన సంగతి. బహుశ జిల్లా స్థాయిలో రచయితల సభలు జరుపడం యిక్కడ యిదియే ప్రథమ పర్యాయమేమో. సుమారు యిరువదియైదు సంవత్సరాల క్రిందట ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రథమ వార్షిక మహాసభలు యిక్కడ జరిగినవి. తరువాత కొన్ని నెలలకు శబ్దానుశాసనాంధ్ర భాషానిలయపు రజితోత్సవము యిక్కడ జరిగినది. ఆ సందర్భాలలో యీ ప్రాంతపు రచయితలు సమావేశమగుట తటస్థించినది. పోలీసుచర్య తరువాత రెండు సంవత్సరాలకు కాబోలు ఆంధ్ర సారస్వత పరిషత్తు శాఖ వార్షికోత్సవము గూడ యిక్కడ జరిగియుండెను. నాటినుండి నేటివరకు యీ ప్రాంతపు రచయితల సమావేశాలు తిరిగి జరుగలేదేమో.

ఆహ్వానసంఘము చేసిన ప్రకటనలో యీ సభల సందర్భ మున రచయితలు పరస్పరము తమ సమస్యలను చర్చించుకొని, ప్రాచీన రచయితల కృషిని సమీక్షించి, నేటి రచయితల కర్తవ్య మును నిర్దేశించుకొనవలెనను అభిలాష వెల్లడియైనది. ఆహ్వాన సంఘము అభిలాషను దృష్టిలో నుంచుకొని యీ సందర్భములో నాలుగు మాటలు చెప్పదలచినాను.

ఈ సభలు వరంగల్లు జిల్లా రచయితల మహాసభలు. ఆహ్వానసంఘము వారు యీ జిల్లా పొలిమేరలను యే విధముగా నిర్వచింపదలచినారో నాకు తెలియదు. ఈనాటి ప్రభుత్వ పరిగణన ప్రకారము యీ జిల్లాను నిర్వచింపదలచినచో అది యీ ప్రాంతపు రచయితలకు అంత తృప్తికరము కాకపోవచ్చును. ఎందుకనగా వరంగల్లు జిల్లా ౧౯౦౫ ప్రాంతమున యేర్పాటయినది. ౧౯౦౫కు ముందు వరంగల్లు జిల్లా లేదు. ప్రస్తుతపు జిల్లా సరిహద్దులను మాత్రమే పాటించినచో యీ ప్రాంతపు సాహిత్య చరిత్రకు అపార మైన అన్యాయము జరుగగలదు. ప్రస్తుతపు జిల్లాలు యీనాటి పరిపాలన అవసరాలను దృష్టిలోనుంచుకొని యేర్పాటు చేయబడి నవి. అందుచేత యీ పొలిమేరలకు మనము కట్టుబడి యుండ వలసిన అవసరము లేదు. వరంగల్లు పట్టణమును కేంద్రముగా తీసికొని సుమారు అరవై మైళ్ల వ్యాసార్థముతో ఒక వృత్తమును గీసినచో ఆ పరిధిలో నుండు ప్రాంతమునంతటిని మన వరంగల్లు మండలముగా గణించవచ్చును. ఈ విధముగా మనము వరంగల్లు మండలమును యెన్నుకొన్నచో యీ ప్రాంతపు సాహిత్య చరిత్రను సరిగా తెలుసుకొనుటకు వీలు కలుగగలదు. ఆంధ్రదేశ చరిత్రను, ఆంధ్ర సంస్కృతీ వికాసమును, ఆంధ్ర సారస్వతాభివృద్ధిని గమ నించి నప్పుడు కొన్ని ప్రాంతాలకు ప్రత్యేకమైన పరిగణన నీయక

తప్పదు. ఓరుగల్లు ప్రాంతమును నిర్వచించినట్టు రాజమంద్రి, గుంటూరు, నెల్లూరు ప్రాంతాలను నిర్వచించినచో యీ నాలుగు తెలుగు సరస్వతికి ఆటపట్టులని స్పష్టము కాగలదు. ఆంధ్ర సాహిత్యానికి, ఆంధ్ర సంస్కృతికి యీ నాలుగు మండలాలు ఆయువు పట్టులని నిస్సందేహముగా చెప్పవచ్చును.

ఓరుగల్లు ప్రాంతమును మన కవులు అనేక విధములుగా కీర్తించియున్నారు. ప్రతాపరుద్ర యశోభూషణముతోపాటు క్రీడాభిరామము ఆనాటి ఓరుగంటి నాగరికతకు ప్రతిబింబము 'ఓరుగల్లున రాజవీరలాంఛనముగా పలుశస్త్రశాలలు నిలుపునాడు, పాకాల చెరువు చెంపల పండుధాన్యముల్ అన్యదేశాధీశులడుగునాడు' అను ప్రశంస సుప్రసిద్ధమైనది. తొమ్మిదిలక్షల విలుకాండ్రు ఉన్నప్పటికిని ప్రజల శాంతియుత జీవనానికి భంగము కలుగలేదని, 'అగ్రహార పీడ' ఆనాడు లేదని చెప్పిన కవి వాణి అందరికి తెలిసినదే తెలుగు మాట్లాడు ప్రజలందరిని ఏకపరిపాలన క్రిందికి తీసికొని రావలెనని మొదటిసారి ప్రయత్నించి చాలవరకు సఫలీకృతమనోరథుడయిన ఆంధ్రవీరుడు గణపతిదేవ మహారాజు. అందుచేతనే మనది ఆంధ్రదేశము, మనము ఆంధ్రులమనెడి జాతీయాభిమానము మొదటిసారి మనకు యీ కాలములోనే, యీ ప్రాంతములోనే కలిగినదనీ, గణపతిదేవ మహారాజు ఆంధ్ర చక్రవర్తియనీ, ఆయన రాజధాని ఆంధ్రనగరమనీ సుప్రసిద్ధ చరిత్ర పరిశోధకులు స్వర్గీయ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు వివరించినారు. ఆంధ్రుల సమగ్ర, సర్వతోముఖ అభ్యుదయానికి ప్రథమ కృషి ఓరుగల్లు ప్రాంతముననే జరిగినదని చెప్పినచో సత్యమునకు తలవంపులు కలుగజాలవు. ఓరుగల్లు ప్రాంతమును సరస్సులసీమ యని చెప్పవచ్చును. ఈ ప్రాంతమునగల గొప్ప తటాకములు

యీ సత్యమును రుజువుచేయుచున్నవి దేశాభివృద్ధికి రైతు వెన్నె ముక కావున వ్యవసాయాభివృద్ధికి అవసరమైన వనరుల కల్పించుట ప్రభుత్వపు ప్రథమ కర్తవ్యమని సుమారు యెనిమిదినూర్ల సంవత్సరాల క్రింద యీ ప్రాంతపు పరిపాలకులు గుర్తించినారు. శిల్పము, చిత్రలేఖనము యీ ప్రాంతములో వేయిరేకులతో విక సించినవను యధార్థమునకు, రామప్పదేవాలయము, వేయిస్తంబాల దేవాలయము సజీవ చిహ్నములుగా నున్నవి. సమస్త ప్రజల అభి వృద్ధిని ఆనాటి పరిపాలకులు కాంక్షించి, అందుకు కృషిచేసినట్లు ఆనాటి సర్వతోముఖాభివృద్ధి సూచించుచున్నది. విదేశాలతో వ్యాపా రావశ్యకతను గూడ ఆనాడు వారు గుర్తించినట్లు, తివాచీలకు, సన్నని వస్త్రములకు యీ ప్రాంతము సీమాంతర ప్రసిద్ధిచెందినట్లు రుద్రమదేవికాలములో వచ్చిన వెనీసుదేశపు ప్రపంచయాత్రికుడు మార్కొపోలో గ్రంథస్థము కావించినాడు.

ఆంధ్రసాహిత్యములో ఉత్తమోత్తమ గ్రంథాలు మూడు: భారతము, భాగవతము, రామాయణము. ఈ బహుళాంధ్రోక్తిమయ ప్రపంచపు మహనీయస్థితికి మూలమై నిలిచిన తిక్కనామాత్యుడు ఓరుగల్లునగరమునందే గణపతిదేవచక్రవర్తి ఆస్థానములో తన మహాభారతమును ఆవిష్కరింపజేసుకొనినాడు. రాజకీయముగా తెలుగు ప్రజలను గణపతిదేవుడు సమైక్యముగావించగా ఆంధ్రావని నంతటిని తన భారతము ద్వారా తిక్కనామాత్యుడు శాశ్వతముగా ఒక్కటే ముడిని బిగించినాడు. భాస్కరరామాయణ కర్తలయిన భాస్కరుడు, మల్లికార్జునభట్టు, కుమార రుద్రదేవుడు, అయ్య లార్యుడు పదునాలుగవ శతాబ్దమునందు యీ మండలమునందే నివసించినారు. తెలుగుతల్లి నోములపంట బమ్మెరపోతనామాత్యుడు "ఏకశిలానగరమునకుం జనుదెంచి ... గురువృద్ధ, బుధ, బంధు

జనానుజ్ఞాతుండై" భాగవత రచనకు ఉపక్రమించినట్లు చెప్పుకొని నాడు. మార్కండేయపురాణమును వ్రాసిన మారన యీ మండలములోనే నివసించినాడు.

ఓరుగల్లును ఆంధ్రనగరీ అని మొట్టమొదటిసారి సంబోధించిన విద్యానాధ మహాకవి యీ ప్రాంతపువాడేనని యీ సందర్భమున ప్రత్యేకించి చెప్పవలసిన అవసరములేదు. కదన పాండితిలోను, కళారక్తిలోను సమాన ప్రతిభను, పరిణతిని చూపించిన జాయపసేనాని కాకతీయుల సేనాధిపతిగా పనిజేయుచు నృత్తరత్నాకరమును వెలయించెను. మరొక సేనానాయకుడు భద్రభూపాలుడు నీతిశాస్త్రముక్తావళి, సుమతి శతకాలను రచించినట్లు, మన సాహిత్య చరిత్ర సాక్ష్యము పలుకుచున్నది. కాకతీయరాజులలో ఒకరైన రుద్రదేవుడు నీతిసారమును రచించినట్లు మన సాహిత్య చరిత్ర పుటలను అవలోకించిన వారందరికి స్పష్టము కాగలదు. బసవ పురాణమును వ్రాసిన పాల్కురికి సోమనాథుడు ఓరుగల్లు మండలమువాడే. సామాన్యప్రజలకు అందుబాటులోనుండు ఛందస్సులో, జానుతెనుగుభాషలో పాల్కురికి సోమనాథుడు గ్రంథరచన గావించి సాహిత్యము సామాన్యప్రజానీకానికి అందుబాటులో నుండవలెనను సిద్ధాంతమును ప్రతిపాదించినాడు. నిజానికి పాలకురికి సోమనాథుడే ప్రప్రథమ ప్రజాకవి యని చెప్పినచో అతిశయోక్తి కాదు. సోమనాథుని తరువాత శివకవులయిన మల్లికార్జున పండితారాధ్యుడు, పిడుపర్తి సోమనాథుడు, పిడుపర్తి బసవప్ప, కానె సర్వప్ప, విశ్వేశ్వర శివదేశికులు మొదలయిన వారందరు పన్నెండు, పదమూడు శతాబ్దాలలో యీ ప్రాంతమున నివసించి తెలుగు సాహిత్య చరిత్రలో ఒక ఉజ్వలమైన అధ్యాయమును రచించినారు. శైవముతో పాటు వైష్ణవము గూడ యీ ప్రాంతమున వర్ధిల్లినది. ముముక్షజన

కల్పకము, యతిరాజవింశతి, తత్వార్థదర్పణము మొదలయిన వైష్ణవ మత ప్రతిపాదక గ్రంథములు యీ ప్రాంతముననే విరచిత మైనవి. మేలుకొలుపులు, మంగళహారతులు, అసంఖ్యాకముగా వ్రాసిపెట్టిన వైష్ణవ కవులెందరో యీ ప్రాంతమున తమ జీవితాలను గడిపియుండిరి. సుమారు పదిహేడువందల ప్రాంతమున ఏకామ్రనాథుడను పండితుడు ప్రతాపచరిత్రను వచనగ్రంథమును వ్రాసి యుండెను. కేసన, మల్లన కవులు దాక్షాయణీ పరిణయము, విష్ణుభజనానందము అను వచన గ్రంథములు వ్రాసిరి. కావున తెలుగు వచన వాఙ్మయ నిర్మాణానికి ప్రథమ ప్రయత్నము యీ మండలమునందే జరిగినదనిపించుచున్నది.

తెలుగులో అత్యుత్తమమైన వేదాంత కావ్యము సీతారామాంజనేయము. కేవలము వేదాంత దృక్పథముతో ఆలోచించినప్పుడు యీ కావ్యము తెలుగు వాఙ్మయమునకు తలమానికమని చెప్పవచ్చును. ఈ గ్రంథకర్త పరశురామపంతుల లింగమూర్తి ఓరుగల్లు పట్టణవాసి ఆయన నివసించిన గృహము యీనాటికిని మట్టెవాడలో నున్నది. వారి కుటుంబీకులు అందులో నివసించుచున్నట్లు తెలియుచున్నది. వీరి గృహమును సాహితీపరులకు యాత్రాస్థలముగా రూపొందించవలసిన బాధ్యత వరంగల్లు పౌరులమీద నున్నది. హనుమద్విజయము వ్రాసిన అనంతరామ కవి, సీతారామాంజనేయ యక్షగానము వ్రాసిన రామమూర్తి కవి యీ పరశురామ పంతుల వంశీయులే.

గత శతాబ్దములో వరంగల్లు పట్టణమున నివసించిన తూము రామదాసకవి మిత్రవిందోద్వాహ కావ్యముతోపాటు ఆంధ్ర పదనిధానము అను నిఘంటువును వ్రాసినారు. ఈ నిఘంటువు శేషాద్రిరమణ కవుల సంపాదకత్వమున కాకతీయ గ్రంథమాలలో

ఒక కుసుమముగా వెలువడినది. తూము రామదాసకవి పుత్రులు, పౌత్రులు యీనాడు వరంగల్లులో ఉన్నారు. హరిభట్టు, వెలిగందల నారయ, వెన్నెలకంటి చంద్రశేఖరకవి, నెల్లుట్ల నారాయణకవి మొదలయిన వారు యీ ప్రాంతీయులు. గడచిన మూడు నాలుగు శతాబ్దాలలో తెలుగు సాహిత్యానికి యీ ప్రాంతమున పోషణ లభించలేదు. వాస్తవానికి రాజకీయ వాతావరణము, సామాజిక, ఆర్థిక పరిస్థితులు ఆంధ్ర సారస్వతాభివృద్ధికి తీవ్ర ప్రతికూలములై యుండెను. అటువంటి కష్టకాలమున తెలుగు సాహిత్య దీపమును ఆరిపోకుండ కాపాడిన గౌరవము వివిధ గ్రామములలో నివసించి, స్వార్థకాంక్షలేక అజ్ఞాతముగా నుండిన కవి పండితులకు చెందుచున్నది. నిజానికి యీ ప్రాంతమున యే గ్రామమునకు వెళ్ళినప్పటికిని తెలుగు సాహిత్యమునకు ప్రతిబింబాలయిన తాళపత్ర గ్రంథ సంచయము మనకు పుష్కలముగా లభించుచున్నదని స్వర్గీయ దూపాటి వేంకటరమణాచార్యుల వారు అనేక సభలలో అనేక పర్యాయాలు ఉద్ఘాటించినారు. ఈ తాళపత్ర గ్రంథ సముదాయమును వారు చాలవరకు సేకరించిరి గూడ. అమూల్యమైన వారి భాండాగారమును తీసికొని కాపాడవలసిన బాధ్యత వరంగల్లు జిల్లా పరిషత్తు, వరంగల్లు పురపాలక సంఘము, వరంగల్లు లోకల్ లైబ్రరీ అథారిటీ మీదనేగాక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము మీద గూడ నున్నదని నిస్సందేహముగా చెప్పవచ్చును. రెండునెలల క్రింద ఖిలాషాహపురము గ్రామములో ఆవిష్కృతమైన ఇంద్రద్యుమ్నీయ గ్రంథకర్త స్వర్గీయ రంగరాజు కేశవరావుగారు నేను యింతకు ముందు ప్రస్తావించిన అజ్ఞాత కవి పండితుల కోవకు చెందినవారు.

ఈ యిరువదవ శతాబ్దములో గూడ ఓరుగల్లు మండలము అనేక కవి పండితులకు ఆవాసమైనది. వారి రచనలకు ఆలవాల

మైనది. ఈ సందర్భమున కొందరు విద్వాంసులను, కవులను ప్రత్యేకముగా పేర్కొనవలసి యున్నది. స్వర్గీయులు బక్కయ శాస్త్రులు, రంయాల లక్ష్మీనరసింహాచార్యులు, అమరవాది నారాయణాచార్యులు, కోవెల రంగాచార్యులు, శేషభట్టర్ రామానుజాచార్యులు, మరియు శ్రీ ముదిగొండ వీరేశలింగశాస్త్రి ప్రభృతులు యీ పండితశ్రేణికి జెందినవారు అవధానము, ఆశుకవిత్వములలో ప్రవీణులు. ఉద్దండులు అయిన విద్వత్కవీశ్వరులు చాలమంది యీ ప్రాంతమున నుండిరి. స్వర్గీయ చిలకమర్రి రామానుజాచార్యులు యిటువంటి అవధానశిరోమణులలో ప్రముఖులు.

గ్రంథాలయోద్యమానికి, ఆంధ్రోద్యమానికి యీ ప్రాంతము ప్రధాన కేంద్రముగా విలసిల్లినది. వరంగల్లు, హనుమకొండలోని గ్రంథాలయాలు తెలంగాణ గ్రంథాలయాలలో ప్రముఖమైనవి, పురాతనమైనవి. వీరేశలింగం పంతులుగారి ప్రభావము తెలంగాణ ప్రాంతానికి గూడ విస్తరించినది. తత్ఫలితముగా ఆధునిక రచనా పద్ధతులను యీ తరము రచయితలు అవలంబించినారు. ఆంధ్ర పితామహ శ్రీ మాడపాటి హనుమంతరావు పంతులుగారు హనుమకొండను కొంతకాలము కాపురముగా చేసికొని యీ ప్రాంతపు సాహిత్యరంగములో చైతన్యము కలిగించినారు. హనుమంతరావుగారి తొలి రచనలు విశేషించి ప్రేమ్‌చంద్ అనువాదాలు హనుమకొండలోనే జరిగినవేమో! హనుమంతరావుగారి వచనశైలి విలక్షణమై, సరళమై వారి వ్యక్తిత్వమువలె శక్తివంతమైనది. హనుమంతరావుగారిని ప్రభావితులనుజేసిన స్వర్గీయ కొమర్రాజు లక్ష్మణరావుగారికి ప్రత్యక్షముగనో, పరోక్షముగనో రాజనరేంద్ర గ్రంథాలయముతో సంబంధము ఉండెనని వినినాను. హనుమంతరావుగారి వలెనే లక్ష్మణరావుగారిచే ప్రబోధితులైన ఆదిరాజు వీరభద్రరావు

గారి జన్మస్థానము గూడ వరంగల్లు ప్రాంతమేనని తెలిసినది. వీరభద్రరావుగారు గొప్ప పండితులు, పరిశోధకులు, ఉత్తమ రచయితలు, తెలంగాణ ప్రాంతమున సాహిత్యములో వైతాళికులు. తెలంగాణ ప్రాంతములో మొట్టమొదటి పత్రికలు రెండు ; తెనుగు, నీలగిరి పత్రికలు ; యివి రెండు యించుమించు ఒకే వారములో వెలువడినవి. తెనుగు పత్రిక వరంగల్లు జిల్లా మానుకోట తాలూకా ఇనుగుర్తి గ్రామము నుండి ఒద్దిరాజు సీతారామచంద్రరావు, రాఘవ రంగారావుగారల సంపాదకత్వమున వెలువడినది. ఈ పత్రిక ఆనాటి రచయితలను ప్రోత్సహించి అపారమైన ప్రబోధము గావించినది. ఈ సంపాదకులిరువురు గౌరవప్రదమైన భూస్వాముల కుటుంబమునకుచెందినవారు ; ఇరువురు ఉద్దండ పండితులే ; అనేక కళలలో నిష్ణాతులు; బహుభాషా ప్రవీణులు; బహుగ్రంథకర్తలు ; చేయిదిరిగిన రచయితలు. ఈ తెనుగు పత్రిక కొంతకాలము వరంగల్లు నుండి తూము వరదరాజులు, దేవులపల్లి వేంకటాచలపతిరావు గారల సంయుక్త సంపాదకత్వమున వెలువడినది. తెనుగు పత్రికకు సమకాలికమైనది శైవ ప్రచారిణి. దాని సంపాదకులు ముదిగొండ వీరేశలింగశాస్త్రిగారు ఆ రోజులలో యీ రెండు పత్రికల మధ్య ఆరోగ్యవంతమైన పోటీ యుండెనని వినినాను. కోకల సీతారామ శర్మగారు ఆంధ్రాభ్యుదయమను ఒక ఉత్తమ సారస్వత మాసపత్రికను హనుమకొండ నుండి నడిపినారు. సంస్కృతము, తెలుగు, ఉర్దూ, ఫార్సీ, అరబ్బీ, కర్ణాటకము, ఇంగ్లీషు భాషలలో ప్రవీణులైన స్వర్గీయ అయితంరాజు కొండలరావుగారు అనేక సంవత్సరాలు హనుమకొండను తమ నివాసము గావించుకొని తమ ఉర్దూ-తెలుగు నిఘంటువులను చాలవరకు యిక్కడనే పూర్తిజేసినారు పిల్లల పత్రిక పూలతోట సంపాదకులైన కంభంపాటి అప్పన్న

శాస్త్రిగారి సారస్వత కృషికి యీ ప్రాంతమే కేంద్రమై యుండినది. అజ్ఞాతముగానుండి అనేక రచనలను గావించిన స్వర్గీయ ఉదయ రాజు శేషగిరిరావుగారు యిక్కడనే నివసించి యుండిరి. విద్వత్క-వీశ్వరులు స్వర్గీయ మునిపట్ల పట్టాభిరామారావు, స్వర్గీయ గార్లపాటి రాఘవరెడ్డిగారల రచనారంగము యీ ప్రాంతమే. కవిత్వము, చిన్నకథ, నవల, సాహిత్యవిమర్శ మొదలయిన వివిధ వాఙ్మయ వీధులలో విహరించి, అసంఖ్యాకమైన రచనలు గావించినప్పటికిని అజ్ఞాతముగానున్న శ్రీ పొట్లపల్లి రామారావు యీ సమావేశస్థలా నికి కొన్ని మైళ్ల దూరములోనే కాపురమున్నారు. తెలుగు సారస్వత రంగములో కొంత గాలి దుమారమును లేపి కొన్ని ఉత్తమ కావ్యా లను రసవత్తరముగా రచించిన నెల్లుట్ల రామకృష్ణామాత్యుని ఊరు పొట్లపల్లివారి గ్రామానికి పొరుగుననే ఉన్నది ఈ కవులకు సమకాలికులయిన మరొక కవి దేవులపల్లి వెంకటేశ్వరరావు 'ప్రతి ధ్వనులు' యిక్కడికి అనతి దూరములోనే వినిపించినవి. కాకతీయ గ్రంథమాల, శైవ ప్రచారిణీ గ్రంథమాల వరంగల్లును కేంద్ర స్థానము గావించుకొని ఉత్తమ ప్రచురణలను వెలువరించినవి.

ఈ ప్రాంతమున తెలుగు సారస్వత దీపము యెన్నడును ఆరిపోలేదని మొదలే మనవిచేసినాను. సర్వకాలము విద్యుద్దీపము వలె ప్రకాశించకపోయినప్పటికిని, దేశకాల పరిస్థితుల ఒత్తిడివలన ప్రమిదలలోని ఆముదపు దీపమువలె మినుకుమినుకుమని నిరంత రము వెలిగినది. నవ్య సాహిత్యరంగములో గూడ యీ మండ లము గణ్యత గాంచినది. ఓరుగల్లు మండలానికి నా నిర్వచనము అంగీకరించినచో ఆధునిక ఆంధ్రమహాకవి శ్రీ దాశరథి జన్మ స్థానము యీ ప్రాంతమేనని చెప్పవచ్చును. అభినవపోతన బిరు దాంకితులు, మహాకవులు శ్రీ వానమామలై వరదాచార్యులవారు

వారి సోదరులు జగన్నాథాచార్యులవారు హనుమకొండ సమీప మండలి మడికొండ గ్రామ వాస్తవ్యులు. నేటి రచయితలలో విశిష్ట స్థానమును అలంకరించుచున్న శ్రీ కాళోజి నారాయణరావు సాహిత్య జీవనానికి హనుమకొండయే ఆటపట్టు. పండితులు, పరిశోధకులు అయిన డాక్టర్ రామరాజు, డాక్టర్ పల్లా దుర్గయ్య ప్రభృతులు యీ మండలమునకు చెందినవారే. దేశకాల పరిస్థితుల ప్రభావము వాఙ్మయము మీద ప్రసరించకతప్పదు. ఈ శతాబ్దమునందలి వివిధ వాఙ్మయ రీతులన్నింటిని యీ మండల సారస్వతములో గమనించవచ్చును. శోభ మాసపత్రిక, కాకతీయ వారపత్రిక ఓరుగల్లు నగరము నుండి వెలువడి అధునాతన సాహిత్యమును ప్రకటించినవి. కాకతీయ వారపత్రికకు పండితులు, విమర్శకులు, కవులు అయిన పాములపర్తి సదాశివరావుగారు సంపాదకత్వము వహించినారు.

ఈనాడు కొన్ని సాహిత్యసంస్థలు వెలసి యిక్కడి రచయితలను ప్రోత్సహించుచున్నవి. సాహితీ బంధు బృందము, సాహితీ వికాసమండలి మొదలైన సంస్థల కృషి ప్రశంసనీయము. అతి నవీనమైన సాహిత్య ప్రక్రియలలో రచనలు సాగించుచున్న రచయితలు, కవులు యీ ప్రాంతమున యీనాడు అనేకులు ఉన్నారు. డాక్టర్ సుప్రసన్న, శ్రీ సంపత్కుమార, శ్రీ పేర్వారం జగన్నాథం, శ్రీ నరసింహారెడ్డి, శ్రీ మాదిరాజు రంగారావు, శ్రీ అనుముల కృష్ణమూర్తి, శ్రీ వరవరరావు ప్రభృతులను పేర్కొనవలసి యున్నది. ఈ విధముగా అనేక శతాబ్దాల నుండి యీ సారస్వత సేవ అకుంఠితముగా కొనసాగుచున్నది. ఈ ప్రాంతపు సాహిత్యరంగమున స్తబ్ధత యెన్నడు ఆవరించలేదు, చైతన్యము యెన్నడు తొలగి పోలేదు. నూతనత్వమును చూచి యెన్నడు ఉలికి

పడలేదు; దేశకాల పరిస్థితులను గుర్తించి యీ మండల రచయితలు మొదటినుండి అభ్యుదయ పథమున ముందంజ వేసినారు. ఈ మండలపు రచయితల కృషిని గూర్చి, విశేషించి ప్రాచీన సాహిత్యమును గూర్చిన సంగ్రహ సమీక్షయిది. నిజానికి యిది స్థాలీపులాకమైన సమీక్ష. అందుచేత యిందులో పేర్కొనవలసిన వారిని చాల మందిని విస్మరించి యుండవచ్చును. ఈ విస్మరణకు కారణము వారిపట్ల అగౌరవము కాదు. నా యెరుక చాలమియే.

ఈ శతాబ్దములో అందు ముఖ్యముగా గడచిన రెండు దశాబ్దాలలో దేశకాల పరిస్థితులలో అపారమైన పరివర్తనము కలిగినది. ప్రపంచములోని వివిధదేశాల మధ్యదూరము తక్కువైనది. వసుధ అంతయు ఏక కుటుంబముగా రూపొందు ఆశలు తలయెత్తుచున్నవి. రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులలో గడచిన యిరువది సంవత్సరాలయందు గొప్ప మార్పులు సంభవించినవి. ఈ మార్పుల ప్రభావము నేటి రచయితల మీద, వారి రచనల మీద పడకతప్పదు. ఈ దృక్పథముతో యీనాడు తమ కర్తవ్యమును యిక్కడ సమావేశమైన రచయితలు నిర్దేశించుకోగలరని ఆశించుచున్నాను. ఈ సందర్భమున సమావేశమైన రచయితలందరికి హార్థికమైన సుస్వాగతము. కాలమనంతము; ఇల విశాలము. సాహిత్యము అక్షరము, విశ్వజనీనము. మంచిగతము గర్వకారణమే. కాని అందువలన మేలు కొంచమే. వర్తమానానికి, భవిష్యత్తుకు సంబంధము అవినాభావమైనది ఉజ్వలమైన భవిష్యత్తుకు అనుగుణమైన వర్తమానము మిక్కిలి అవసరము. గడచిన యిరువది సంవత్సరాలలో చరిత్రాత్మకమైన మార్పులు జరిగినవి. శతాబ్దాలలో జరుగని చరిత్ర గడచిన రెండుదశాబ్దాలలో జరిగినది. నేటి ప్రపంచము దూరమును జయించినది. సమస్త ప్రపంచము

ఏకఖండముగా రూపొందుచున్నది. ప్రాంతీయ అభ్యుదయము, దేశాభ్యుదయము, జగత్కల్యాణము పరస్పర విరోధమైనవి కావు; అవి పరస్పర పోషకమైనవి. అందుచేత రచయితలారా మానవ శ్రేయస్సుకు, విశ్వకల్యాణానికి అనుగుణముగా మీ రచనలు చేయండి. స్వచ్ఛందముగా పాడండి. సంప్రదాయానికి, ఆధునిక సాహితీరీతులకు మధ్య సుదృఢమైన వారధి నిర్మించండి.

''సుకవితా యద్యస్తి
రాజ్యేన కిం''

నల్లగొండజిల్లా రచయితలు మహాసభ అధ్యక్షోపన్యాసము 21–2–70

మేలి కిన్నెర మేళవించీ,
రాలు కరగగ రాగమెత్తీ,
పాల తీయని బాల భారత
పదము పాడర తమ్ముడా !

నవరసమ్ములు నాట్య మాడగ
చివురు పలుకులు చెవులవిందుగ
కవిత లల్లిన కాంత హృదయుల
గారవింపవె చెల్లెలా !

దేశ గర్వము దీప్తిచెందగ
దేశ చరితము తేజరిల్లగ
దేశ మరసిన ధీరపురుషుల
తెలిసి పాడర తమ్ముడా !

తుంగభద్రా భంగములతో
పొంగి నింగిని పొడిచి త్రుళ్ళి
భంగపడని తెనుంగు నాధుల
పాట పాడవె చెల్లెలా !

* * *

చాలా సంవత్సరాల తరువాత నల్లగొండకు రాక, అందులో నీలగిరి మండల రచయితల సమావేశములో పాల్గొనె అవకాశము వ్యక్తిగతంగా నాకు మిక్కిలి ఆనందప్రదమైనది. ఈ మండల ముతో నాకు యిరువదిఅయిదు సంవత్సరాల సంబంధము. ఈ సంబంధము మొదట కొంచెముగా ప్రారంభమై దినదినాభివృద్ధి నొంది శాశ్వత స్నేహముగా పరిణమించినది. ఈ మండలములో నాకు అత్యంత ఆప్తులైన మిత్రులు అనేకులు. బహుశః నా స్వస్థా నమైన వరంగలు ప్రాంతములో కూడ యిక్కడ ఉన్నంతమంది ఆప్తమిత్రులు లేరేమో ! నల్లగొండ అనగానే నా హృదయము ఉత్సాహముతో పొంగుతుంది. అనేక మధుర స్మృతులు నా స్మృతి పథాన్ని ఆవరిస్తున్నవి. బహుశః 1945 సంవత్సరము కాబోలు, ఒకనాటి వెన్నెలరాత్రి రామగిరిలోని ఒక మిత్రుని యింటి మేడ పైన కవిసమ్మేళనానికి అధ్యక్షతవహించడం నా జీవితములో మరువరాని ఘట్టం. ఆ రోజే పులిజాల హనుమంతరావు, కంచినే పల్లి చినవేంకటరామారావు, ధవళా శ్రీనివాసరావు, స్వర్గీయ సిరి ప్రగడ భార్గవరావు ప్రభృతులైన మిత్రులందరితో మొట్టమొదటి సారి పరిచయమేర్పడినది. తరువాత కొన్నాళ్ళకు చండూరులోని సాహితీమేఖల దశమ వార్షికోత్సవానికి అధ్యక్షతవహించే సదవ కాశాన్ని మిత్రులు నాకు కల్పించినారు. పూజ్యులైన శ్రీ అంబటి

పూడి వేంకటరత్నకవి, ఆయన సాహితీ బంధుబృందము నన్ను తమ ఆప్తవర్గములో చేర్చుకున్నారు. నల్లగొండలో జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్తు తృతీయ వార్షికోత్సవ సమావేశాలు, ఆ పిమ్మట కొద్దికాలానికే జరిగిన జిల్లా సారస్వత పరిషత్తు సమావేశాలు యీ మండలముతో నా బాంధవ్యాన్ని మరింత దృఢతరము చేసినవి. శ్రీ పులిజాల రంగారావు దగ్గరినుండి శ్రీ నీలా జంగయ్యవరకు నాలుగు తరాల సంస్కృతీపరులతో నాకు స్నేహసంబంధాలు యేర్పడినవి. ఇట్లు జ్ఞప్తికి తెచ్చుకుంటె యెన్నో మరుపురాని సంఘటనలు. పోలీసుచర్యకు ముందు ప్రకటితమైన నల్లగొండ కవుల కావ్య సంపుటికి (తొలిసంజ అనుకుంటాను) తొలిపలుకు వ్రాసే గౌరవాన్ని యిక్కడి మిత్రులు నాకు కల్పించినారు.

నల్లగొండమండలము నేటికాలమున యావద్భారత— కాదు— యావత్ప్రపంచ ప్రఖ్యాతిజెందిన ప్రాంతము. ఈ ప్రాంతపు ప్రాధాన్యము సమకాలికమైనది మాత్రమే కాక చారిత్రకమైనది కూడ. భువనగిరి, రాచకొండ, దుర్గాలు నల్లగొండ చరిత్రను చాటి చెప్పుచున్నవి. పానగల్లు దేవాలయాల శిల్పములు నల్లగొండమండల కళాభిరుచికి తార్కాణము. కొలనుపాక జైనదేవాలయాలు సమస్త భారతదేశము నుండి భక్తుల నాకర్షిస్తున్నది. యాదగిరి లక్ష్మీ నృసింహస్వామి తెలుగుప్రజల ఇలవేల్పు. పిల్లలమర్రి సారస్వత యాత్రాస్థలము. ఈనాడు నాగార్జునసాగరము సమస్త భారతదేశ ములో పేరెన్నికగన్న నిర్మాణమై తెలుగుదేశములోని రెండు ప్రాంతాలమధ్య సేతువై సాంస్కృతిక సమైక్యతకు చిహ్నంగా ఉన్నది.

నల్లగొండమండలము పూర్వాంధ్రకవులకనేకులకు జన్మ స్థానము. నల్లగొండ ప్రాంతీయులైన మరింగంటి కవులు తెలుగు

సరస్వతి కమూల్యాభరణాల నర్పించినారు. మరింగంటి ఆసూరి సింగరాచార్యులు రచించిన దశరథ రాజనందన చరిత్ర నిరోష్ఠ్య కావ్యము. త్వరలో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి పక్షాన ప్రకటితముకానున్నది. సాహిత్యానికేగాక, సంగీత లలిత కళలకు కూడ నాటికీ నేటికీ నల్లగొండ ఆటపట్టైనది. ఆధునిక సంగీత విద్వాంసులలో శ్రీ బూరుగుగడ్డ సీతారామాచార్యులవారు యావద్భారతమున కీర్తిగాంచినారు. గవ్వా మురహరిరెడ్డి, అమృతరెడ్డి సోదరులు నవ్యాంధ్ర సాహిత్యమున యెన్నికగన్న రచయితలు. సాహితీమేఖల కవులు శ్రీ కంచినేపల్లి చినవేంకటరామారావు ప్రభృతులు యీ ప్రాంత రచనారంగానికి ఆభరణాయమానులు.

రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక రంగాలలో నల్లగొండది యెల్లప్పుడు ముందంజయేనని చరిత్రేకాదు, సమకాలిక సంఘటనలు కూడ ఋజువుచేస్తున్నవి. తెలంగాణప్రాంత ప్రజలలో జాగృతి కలిగించిన మొట్టమొదటి తెలుగుపత్రిక "నీలగిరి" యీ పట్టణము నుండియే వెలువడినదన్నసంగతి యీ సందర్భములో మనమందరము ఒకసారి జ్ఞప్తి తెచ్చుకోవలసి ఉన్నది. తెలంగాణలో రాజకీయ, సాంఘిక, సాంస్కృత రంగాలలో నల్లగొండ కడమ జిల్లాలకు సర్వదా మార్గదర్శకమైనది. సూర్యాపేట, భువనగిరి, దేవరకొండ, నల్లగొండ ప్రాంతాలలో జరిగిన సభలు తెలంగాణ ప్రాంతాన్ని అనేక రంగాలలో మేల్కొల్పినవని నాకు సమకాలికులైన మిత్రులందరికి బాగా తెలిసిన సత్యమే. కేవలము రాజకీయ చైతన్యమేగాక, సాంస్కృతిక చైతన్యముకూడ యీ ప్రాంతములో చరిత్రాత్మకమైనది ; చరిత్ర నిర్మాణానికి దోహదము కలుగజేసేది. పోలీసుచర్యకు పూర్వము పొలాలు నాటువేసే సమయాలలో కలుపు తీసే సందర్భాలలో అక్షరాస్యులుకాని స్త్రీ పురుషులు రక్తాన్ని

ఉడుకెత్తించే గేయాలు అలపించేవారని, ఆ గేయాలలో ఆనాటి నిరంకుశ ప్రభుత్వ ధోరణులను, పోలీసు దౌర్జన్యాలను నిరసించే వారని, తోటిప్రజలను ఉద్బోధించేవారని నాకు మిత్రులు అనేకులు చెప్పినారు. అభ్యుదయపథములో నల్లగొండది సర్వదా ప్రథమ స్థానము. అన్ని రంగాలలో వైతాళికులుగా నుండదగిన వ్యక్తులు నల్లగొండ మండలములో కనుపించినంత పుష్కలముగా మరొక మండలములో కనుపించరేమో !

ఇప్పటికి భారతదేశానికి స్వాతంత్ర్యము వచ్చి యిరువై రెండేండ్లు గడచిపోయినవి. రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక రంగాలలో అనేక నూతన పరిణామాలు వచ్చినవి. ప్రజల ఆలోచనలలో క్రొత్తమలుపులు గోచరించుచున్నవి. ఈ మలుపుల ప్రభావము సాహిత్య, సాంస్కృతిక రంగాలలో స్పష్టముగా కనుపిస్తున్నది. ఒక్కసారి స్వాతంత్ర్యానంతరము వచ్చిన సాహిత్యాన్ని పరిశీలిస్తే ప్రచండమైన మార్పులు గోచరిస్తవి. ఈ మార్గంలో వివిధ భారతీయ భాషలు ఒకదానికొకటి చాల దగ్గరగా వస్తున్నవి. ప్రపంచ సాహిత్య ప్రభావము గూడ నేటి రచనలపైన స్పష్టంగా కనుపిస్తున్నది. ఆర్థిక, సాంఘిక రంగాలలోని అసంతృప్తి సాహిత్యరంగాలలో ప్రతిబింబిస్తున్నది. ఈ ప్రతిబింబం సహజమైనదే. భారత, దేశభాషా వాఙ్మయాలు అన్నింటిలోను ఒకే విధమైన పరిణామాలు కన్పిస్తున్నవి. స్వాతంత్ర్యానంతరం జన్మించిన యువతీయువకులు నేడు వివిధ రంగాలలో ప్రవేశించి బాధ్యతను నెరవేరుస్తున్నారు. ఈ యువతీ యువకుల మధ్య పూర్వతరానికి మధ్య ఒక పెద్ద అఖాతము కన్పిస్తున్నది. యువతరమువారి తిరుగుబాటు, ఉద్యమాల ప్రభావము సాహిత్యరంగములో కూడ

గోచరిస్తున్నది. ఆర్థిక, సాంఘిక రంగాలలోని వ్యత్యాసాలు, అసంతృప్తి యీ తిరుగుబాటుకు ముఖ్యకారణాలు.

స్వాతంత్ర్యము వచ్చిన పిదప అక్షరాస్యత పెరిగినది. పత్రికల సంఖ్య పెరిగినది. పాఠకుల సంఖ్య కూడ పెరిగినది. ప్రభుత్వ ప్రోత్సాహముతో మౌలిక రచనలు కొన్ని ప్రకటిత మౌతున్నవి. రేడియోద్వారా రచయితలకు కొంత ప్రోత్సాహము లభిస్తున్నది. దేశభాషల ద్వారా పరిపాలన జరుగవలెనని నిర్ణయించి, అందుకొరకు ప్రయత్నాలు జరుగుతున్నవి. ఉన్నత విద్య మాతృభాష ద్వారా జరుగవలెనని విద్యావేత్తలందరు యించుమించుగా ఒప్పుకున్నారు. ఇటువంటి పరిస్థితులలో యీనాటి రచయితలు కలాలు నడిపిస్తున్నారు. అయితే నేడు పుష్కలంగా వస్తున్నటువంటి రచనలలో శాంతీ, తృప్తీ కనుపించడం లేదు. అన్ని సాహిత్య ప్రక్రియలలో యీ సత్యము కనిపిస్తున్నది. నేటి రచయితలలో కన్పిస్తున్న భావవిప్లవాన్ని తక్కువగా అంచనా వేయడానికి వీలులేదు. జాతిలో కన్పించే జాడ్యానికి యీనాటి రచనలు నిదర్శనాలై యున్నవి. ఈ జాడ్యాన్ని సరిగా నిదానము చేసి సరియైన ఔషధప్రక్రియలను సమకూర్చవలసి ఉన్నది. ఇటువంటి పరిస్థితిలో రచయితల సమావేశాలు, సమ్మేళనాలు చాల ప్రయోజనకరమైనవి. ఈ సమ్మేళనాలు తాలూకా స్థాయిలో జరుగవచ్చును, జిల్లా స్థాయిలో జరుగవచ్చును, ప్రాంత స్థాయిలో జరుగవచ్చును, యావద్దేశ స్థాయిలో కూడ జరుగవచ్చును. ఏ స్థాయిలో జరిగినా యీ సమ్మేళనాలు, వాంఛనీయాలు ; ప్రయోజనాకరాలు.

అభ్యుదయ శక్తులకు పెట్టనికోట నల్లగొండ. కావుననే చైతన్య విలసితమైన యీ ప్రాంతము రచనారంగములో కూడ తన బాధ్యతలను నిర్వర్తించవలసి ఉన్నది. నిర్వర్తిస్తుందని

ఆశించడం అసహజమేమీ కాదు. కొంతకాలం నుండి యీ ప్రాంత రచయితల గొంతు యెక్కువగా వినిపించడం లేదు. ఏ కారణము వల్లనో కలిగిన యీ మౌనము తాత్కాలికమైనదేనని నా విశ్వాసము.

నల్లగొండ రచయితలారా! మీరు ముందుకు రావలెను. మార్గదర్శకులు కావలెను. మీలో దాగుకొనియున్న ప్రతిభ ప్రపంచానికి వెల్లడి కావలెను. మీ కలాలను ముందుకు నడపవలెను. మీ గొంతులు మొత్తము తెలుగుసీమకు వినిపించవలెను. ద్వైతాద్వైత విశిష్టాద్వైతాల చర్చలు రాజకీయరంగములో యెట్లు సాగినప్పటికీ, సాంస్కృతిక రంగములో అద్వైతమే అందరి సిద్ధాంతము. ఇందులో అభిప్రాయభేదాలకు అవకాశము లేదు.

దేశానికి స్వాతంత్ర్యము వచ్చి యిరువైరెండేండ్లు గడచినప్పటికి రచయిత, రచయితగా జీవనోపాధిని గడించుకొనలేని పరిస్థితులు కనుచూపుమేరలో కనుపించకపోవడం శోచనీయం. పుస్తకము అచ్చువేసుకోవడము రచయితలకు ఒక సమస్య. అచ్చు అయిన పుస్తకాన్ని అమ్ముకోవడము అంతకన్న పెద్ద సమస్య. వేయి ప్రతులకు యెక్కువగా అమ్ముడుపోయిన గ్రంథాలు, రెండు మూడు ప్రచురణలు పొందిన గ్రంథాలు చాల స్వల్పము. ఈ పరిస్థితి మారవలెను. జిల్లా గ్రంథాలయసంస్థలు చట్టబద్ధముగా యేర్పడే పనిచేస్తున్నవి. ప్రతిజిల్లా గ్రంథాలయసంస్థ ప్రకటితమైన ప్రతి పుస్తకము కనీసము ముప్పదిప్రతులు అయినా తీసుకుంటె, ఆరునూర్లకు పైగా పుస్తకాలు అనాయాసంగా అమ్ముడుపోయి రచయితలకు చాలమట్టుకు ఉపయోగించగలదు. అంతేగాక రచయితలు స్వయంగా ప్రకటించుకొన్న పుస్తకాల మీద గ్రంథాలయ సంస్థలు డిస్‌కౌంటు తీసుకోవలసిన అవసరములేదు. హైదరాబాదు

సికింద్రాబాదు గ్రంథాలయసంస్థ అధ్యక్షునిగా యీ పద్ధతిని ఆ సంస్థలో ప్రవేశ పెట్టే అవకాశము నాకు లభించినది. ఇతర జిల్లాలలో కూడ యీ పద్ధతి అమలు కాగలదని ఆశిస్తున్నాను. ఈ పద్ధతి అమలుకు జిల్లా గ్రంథాలయ సంస్థలకు ప్రభుత్వ సహకారము సంపూర్ణంగా లభించగలదని ఆశిస్తున్నాను.

సోదర రచయితలారా! ఈ రెండు రోజులు నీలగిరిలో ఉత్తమమైన సాహిత్యపు విందులు జరుగగలవు. సారస్వత ప్రసంగాలు, చర్చలు, సాహిత్య పఠనాలు, కావ్యగానాలు యీ సందర్భములో జరుగగలవు. ఈ రెండు రోజులు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన రచయితలు కలసిమెలసి కాలక్షేపము చేసే పండుగలో ప్రాచీన సాహిత్యాన్ని దృష్టిలో ఉంచుకొని నేటి సాహిత్య ధోరణులను సమీక్షించుకొని ప్రగతిపథంలో ముందంజ వేసే సదవకాశము రచయితలు సంపూర్ణముగా వినియోగించుకోగలరని విశ్వసించవచ్చును. కాలము చాల మారినది. ప్రపంచదేశాలు పరస్పరము మిక్కిలి దగ్గరకు వచ్చినవి. ఇది చంద్రమండలయాత్రల కాలము. ప్రపంచము యేకకుటుంబముగా రూపొందు ఆశలు మబ్బులో మెరుపువలె అప్పుడప్పుడు కలుగుతున్నవి. దేశములోని రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితులను ప్రపంచ పరిస్థితులతో సమన్వయించుకొని ముందంజ వేయవలసి ఉన్నది. ఉజ్వలమైన చరిత్రను స్మరించి గర్వించుటలో సంకోచించవలసిన అవసరము లేదు. కాని. అందుకు అనుగుణంగా వర్తమానమును, భవిష్యత్తును నిర్మించుకోవడము కూడా ఆవశ్యకమే! ప్రాంతీయ అభివృద్ధి, దేశకల్యాణము, విశ్వశాంతి పరస్పర విరోధమైనవి కావు అందుచేత దేశ సౌభాగ్యానికి ప్రపంచశ్రేయస్సుకు అనుగుణమైన రచనలు రావలసి ఉన్నవి. తెలుగుభాషను సంపన్నముచేయు కృషిలో అందరము

సమాన భాగస్వాములము కావలసి ఉన్నది. సంప్రదాయానికి, అభివృద్ధికి మధ్య గట్టి సేతువును నిర్మించవలెనని మీ అందరకు నా విజ్ఞప్తి. రచయితలు యెన్నుకోబడని శాసనకర్తలని ఆర్యోక్తి. సమాజముపైన వారి ప్రభావము అమోఘము, అద్వితీయము. అందుచేతనే అందరు మార్గదర్శకత్వానికి రచయితలవైపు చూడడం పరిపాటి.

"ఆకులందున అణగి మణగి కవితకోవిలపలుకవలెనోయ్
పలుకులనువిని, దేశమందభిమానములు మొలకెత్తవలెనోయ్"

మహబూబ్‌నగరు జిల్లా రచయితలు మహాసభ అధ్యక్షోపన్యాసము 28-5-72

మహబూబునగరం మండలాన్ని గురించి నాకు అనేక మధుర స్మృతులు. ఇంచుమించుగా 30 సం. ల నుండి యీ మండలవాసులతో నాకు పరిచయం. నాకు పరిచితులు, ఆత్మీయులు యీ మండలములో అన్ని రంగాలలో ఉన్నారు. సంస్థానాధీశ్వరుల శ్రేణినుండి సామాన్య జనశ్రేణి వరకు, సాహితీపరులనుండి సర్వోదయ కార్యకర్తలవరకు పెద్దలనుండి పిన్నలవరకు, ఆలంపురం. నుండి హైదరాబాదువరకు ఎందరో మిత్రులు నాకు ఉన్నారు. అందుచేతనే మీ ఆహ్వానాన్ని ఆజ్ఞగా భావించి మీ ముందు నిలిచి నాను.

తెలంగాణాజిల్లాల్లో మహబూబునగరానికి అనేక విశిష్టతలు.

జనాభా వైశాల్యముల దృష్ట్యా యిది అన్నిటికన్న పెద్దది— కరీం నగరం తప్ప— రాయలసీమతో తెలంగాణాన్ని కలిపే జిల్లా మహబూబునగరం. ఇంకో వైపున కన్నడముతో చుట్టరికము మహబూబునగరం వారి వేషభాషలలో యీ ప్రత్యేకత గోచరిస్తుంది. చాలకాలము నిజాము పరిపాలనక్రింద తెలుగుభాష నలిగిపోయి నప్పుడు రాజగౌరవాన్ని యీ భాషకు కలిగించినదీ మహబూబు నగరమే. తెలుగు సాహిత్యమునకు, ఆంధ్ర సంస్కృతికి యీ మండలము విశేషించి గద్వాల, వనపర్తి, ఆత్మకూరు, కొల్లాపురం సంస్థానాలు ఆటపట్టులుగా ఉండెనను సత్యము, తెలుగు సాహిత్య ముతో పరిచయం కలిగినవారందరికి తెలిసినదేగదా. ఈ జిల్లాలోని అలంపురం తుంగభద్రానది తీరమున విలసిల్లుతూ దక్షిణ కాశిగా ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రము. శ్రీశైలానికి పశ్చిమ ద్వారమని ప్రసిద్ధిగాంచినది యీ క్షేత్రము. తెలుగు శిల్పమునకు, ప్రాచీన చరిత్రకు నిలయమేకాక విద్యావిజ్ఞానాలకు కేంద్రము. రాష్ట్రకూటులు, కల్యాణి చాళుక్యులు వారి సామంతులైన చోళులతోపాటు కాకతీయ ప్రతాపరుద్రుడు, విజయనగర కృష్ణరాయలు బ్రహ్మేశ్వరస్వామిని పూజించినట్లు చరిత్ర మనకు తెలుపుతున్నది. వైదికముతోపాటు బౌద్ధజైనాల ప్రభావము కూడ యీ ప్రాంతములో మనకు కన్పి స్తున్నది.

ప్రాచీన చరిత్రలోనే కాదు, ఆధునిక చరిత్రలో కూడ యీ మండలం అగ్రశ్రేణిని అలంకరించింది. గడచిన నూరు సంవత్స రాలలో మనదేశమున అనేక జాతీయోద్యమాలు వ్యాప్తిజెందినవి.

ఈ అన్ని ఉద్యమాలలో కూడ యీ మండలం తన పాలు పంచు కొన్నది. గత శతాబ్దములో పండుగ శాయన్న అనే వీరుడు విప్లవ ధ్వజం యెత్తి స్వాతంత్ర్య పోరాటమునకు నాయకత్వము వహించె నను వృత్తాంతము, మన స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో గ్రంధస్థ మైనది. ఇటువంటివాడే మరొక శూరుడు సర్వాయ పాపడు. వైరి వీరులను గడగడలాడించిన సర్వాయపాపడు యేడు గడియలు గోలకొండకోటను ఆక్రమించి పాలించినాడని ఒక వీరగాథ. సర్వాయపాపని గురించిన వీరగాథలు ఎన్నో ఉన్నవని వాటిని సంపాదించి ప్రకటించవలెనని స్వర్గీయ సురవరం ప్రతాపరెడ్డిగారు పదేపదే చెప్పేవారు.

ఆంధ్రోద్యమము, గ్రంధాలయోద్యమము అప్పటి హైదరా బాదు రాష్ట్రములో జంటగా నడచిన జాతీయోద్యమాలు. ఈ రెండు ఉద్యమాల నిర్వహణలో మహబూబునగరం తన కర్తవ్యాన్ని నెరవేర్చినది. ఈ మండలములో మంచి గ్రంధాలయాలు ఉన్నవి. జాతీయోద్యమ నిర్వహణలో పేరుగాంచిన ఆంధ్రదేశ గ్రంధాలయ మహాసభ వార్షికోత్సవము ఒకటి క్యాతూరులో జరిగి ఆంధ్ర తెలం గాణాల మధ్య సాంస్కృతిక బంధాన్ని బిగించిన వాస్తవము మీలో చాలా మందికి తెలిసినదేగదా. షాద్‌నగర్‌లో ఆంధ్రమహాసభ శోభాయమానంగా, ఉత్తేజకరంగా జరిగిన సంగతి ఆనాటి రాజ కీయాలలో పాల్గొన్నవారందరికి బాగుగా తెలుసును. ఆంధ్ర మహా సభ క్రమక్రమంగా రాజకీయోద్యమంగా మారి అప్పటి స్టేట్ కాంగ్రెస్‌లో లీనమైన తరువాత మొట్టమొదటి ఆంధ్రకాంగ్రెస్

మహాసభ జడ్చర్లలో జరిగి బాధ్యతాయుత పరిపాలన తన ఆశయ మని యెలుగెత్తి చాటలేదా? ఇటువంటి సంఘటనలెన్నియో నా మనస్సులో మెదలుతున్నవి.

ఆనాటి హైదరాబాదు జాతీయోద్యమాలకు నాయకత్వము వహించిన ప్రముఖులు చాలమంది యీ జిల్లా వాసులే. బహుభాషా విశారదులైన స్వర్గీయ బూర్గుల రామకృష్ణారావు షాద్‌నగర్ ఆంధ్ర మహాసభకు అధ్యక్షులై తరువాత హైదరాబాదు రాష్ట్ర ముఖ్య మంత్రిగా పేరుగాంచినారు. స్వర్గీయ అచ్యుతరెడ్డి 1938 సంవత్సర ములో సకల భారత ప్రఖ్యాతిగాంచిన వందేమాతరం ఉద్యమానికి నాయకత్వము వహించినారు. మన మిత్రులైన పల్లెర్ల హనుమంత రావు, రామచందర్‌రావు కళ్యాణి శ్రీ పాగ పుల్లారెడ్డి నేటి మంత్రి వర్యులు శ్రీ మహేంద్రనాథ్ మొదలైన వారందరితోపాటు పండి తులు, పరిశోధకులునైన శ్రీ గడియారం రామకృష్ణశర్మగారు స్వాతంత్ర్య పోరాటములో పాల్గొన్నయోధులే గదా.

ఆ రోజులలో హైదరాబాదు నగరమునుండి వారమునకు రెండుమార్లు వెలువడిన మొదటి తెలుగు పత్రిక గోలకొండ. దీనికి సంపాదకులు, విద్యాధికులు, విమర్శకులు, బహుగ్రంథకర్తకులు నైన సురవరం ప్రతాపరెడ్డిగారు. ఆయన బలపరచని జాతీయోద్య మము ఆ రోజులలో లేదు. తెలంగాణాన్ని జాగృతం చేసిన సంస్థ లలో మొట్టమొదటిగా చెప్పవలసింది గోలకొండ. అదేమి చిత్రమో గాని మొట్టమొదట హైదరాబాదునుండి తెలుగువారు ప్రకటించిన ఉర్దూ వార పత్రిక రయ్యత్— తరువాత దిన పత్రికకు సంపాద

కులు యీ మండలమువారే. ఆయనే శ్రీ మందుముల నరసింగ రావు. ఆ రోజు కృష్ణా పత్రిక సంపాదకీయాలు ప్రజలను ఎంత ఉత్తేజపరిచినవో రయ్యత్ పత్రికా సంపాదకీయాలు కూడ అంతే ఉత్తేజపరిచినవి. భావన ప్రకటనలోను, భాషా గాంభీర్యములోను కృష్ణా పత్రికకు సమానమైనది రయ్యత్. మరికొన్ని ఉర్దూ పత్రికలను నడిపి జాతీయోద్యమాన్ని బలపరచిన సి. యస్. రావు, జలాలొద్దీన్, హసన్ మహమ్మద్ పహిల్వాన్ యీ జిల్లా వాసులైన పత్రికా రచయితలే— మన రామకృష్ణశర్మగారు సుజాత మాస పత్రికను మిక్కిలి సమర్థతతో కొంతకాలం నడిపినారు.

ఆంధ్ర సాహిత్యోద్యమాలకు యీ జిల్లా పుట్టినిల్లని మొదటనే చెప్పితినిగదా. 1946 లో కాబోలు ఆంధ్ర సారస్వత పరిషత్తు మూడవ వార్షిక సభలు అప్పటి జిల్లా కలెక్టర్‌గారైన స్వర్గీయ రామచంద్రరావుగారి ప్రోత్సాహంతో యీ పట్టణములోనే వైభవంగా జరిగినవి. ఆ సభలలోనే మొట్టమొదటిసారి మహాకవి శ్రీ దాశరధితో నాకు పరిచయం. అప్పుడు ఆయన స్వాతంత్ర్య యోధుడుగా

"జన్మజన్మాల బూజు మానిజామురాజు"
"ముసలి నక్కకు రాచరికంబు దక్కునే"
"పీడిత ప్రజావాణికి మైకమర్చెద"
"మూడు కోటులనొక్కటే ముడిబిగించెద"

అనాధునికి, ఆగర్భ శ్రీనాధునికి, అనాదిగా సాగుతున్నది అనంత సంగ్రామము అని సింహగర్జనలు చేస్తుండేవారు. తరువాత

యీ స్వప్నాలు సత్యములైనవి. ఆ సభల సందర్భములో జరిగిన కవి సమ్మేళనానికి అడవి బాపిరాజుగారు అధ్యక్షత వహించి రస వంతంగా నడిపిన సంఘటన యీనాటికి నాకు జ్ఞాపకమున్నది.

జగదాచార్యుడు, తత్వవేత్త అయిన రాధాకృష్ణపండితుడు ప్రారంభించిన ఆంధ్ర సారస్వత పరిషత్తు వార్షికోత్సవాలు 1953లో అలంపురములో జరిగినవి. ఇందులో సుమారు 50 వేల మంది పాల్గొన్నారు. మొట్టమొదటిసారిగా జరిగిన సకలాంధ్ర సాహిత్య సభలు యివేనని చెప్పవచ్చును. శ్రీపాద నుండి శ్రీశ్రీ వరకు యీ సభలలో పాల్గొన్నారు. అదొక మహాపర్వము. ఈనాడు కూడ జ్యోతిర్మయివంటి సాహిత్య సంస్థలు యీ మండల ఉత్తమ సంప్ర దాయాలను చక్కగా కాపాడి పురోగమిస్తున్నవి.

ఆంధ్ర సాహిత్య పరిశోధకులలో సర్వవిధాల మొట్టమొదట చెప్పదగినవారు మానవల్లి రామకృష్ణకవిగారు. వారు చాల రోజులు వనపర్తి సంస్థానాధీశుల ఆదరణకు పాత్రులై, ఆప్తులై యిక్కడ వనపర్తిలోనే బహుశ యీ ప్రాంతములోని మొట్టమొదటి తెలుగు ముద్రణాలయాన్ని నెలకొల్పి అనేక ప్రాచీన గ్రంథాలను ప్రచు రించినారు. ఈ ప్రచురణలోనే ప్రబంధమణిభూషణము, సకల నీతి సమ్మతులను యిటీవలనే సాహిత్య అకాదమి పునర్ముద్రణ చేసినది. తిరుపతి వేంకటకవులు సారస్వత యాత్రలు కొన్ని గద్వాల, వనపర్తి, ఆత్మకూరు, కొల్లాపురం సంస్థానాలలో జరిగి నవి. ఆనాటి విద్యావినోదాలు సాహిత్య చరిత్రలో సువర్ణ ఘట్టాలు. అవి తలచుకొన్నప్పుడు అప్పటి కవి, పండితులెందరో మన

ముందు నిలుస్తున్నారు. ఇందులో కొందరినైనను యీ సందర్భములో పేర్కొనక యుండలేను. అందరిని పేర్కొనుట అసాధ్యము కావున కొల్లాపురము సంస్థాన వాస్తవ్యులైన పెల్లాల సదాశివశాస్త్రి గారు మహాపండితులు, బహుగ్రంథకర్తలు, గొప్ప వ్యాఖ్యాతలు బుక్కపట్టణం శ్రీనివాసాచార్యులవారు మైసూరు, దర్భాంగ, గవాలియార్, ఇందోర్, ధారానగర్, జమ్మూ మొదలైన అనేక సంస్థానాలలో దిగ్విజయాలు గావించిన ఘంటా శతశ్లోక సంధాతలు బహుగ్రంథకర్తలు, అవధానులు, విద్వద్వరేణ్యులు. ఈ శ్రేణికి చెందినవారే వీరి కుమారుడు వేంకటాచార్యులవారు, అలుకూరి మల్లికార్జునశాస్త్రిగారు, పత్రి విశ్వేశ్వరశాస్త్రిగారు, వట్టెం పాపకవి గారు. ఆ రోజులలో ఆదిపూడి ప్రభాకరరావుగారు గద్వాల సంస్థానములో అధికారులుగా ఉండి అనేక కవులను, పండితులను ఆదరించడానికి తోడ్పడినారు. స్వయంగా కవులైన వీరు అనేక గ్రంథాలను రచించినారు. ఇందులో కొన్ని యిటీవలనే సాహిత్య అకాడమి, ఆంధ్రప్రభుత్వ సహాయముతో ముద్రితమైనది ఇంకా ఎందరో మహానుభావులు - మరొక్కరిని మాత్రము పేర్కొనక ఉండలేను. ఆయనే గాడేపల్లి వీరరాఘవశాస్త్రిగారు. ఆయన చేసిన అవధానాలు ఆశుకవితలు అమోఘమైనవి. ఆయన పూరించిన సమస్యలు సర్వదా సంస్మరణీయాలు. ఆయన తన కవిత్వాన్ని గూర్చి ఆశువుగా చెప్పిన పద్యమాలిక అల్లసాని పెద్దనమాలికను స్మరింపజేస్తుంది. ఆయనది సారస్వతవీరవిహారము.

1. అగునె వీరరాఘవుని ఆశువు
పార్థు శరప్రయోగమే ఆగిన నాగుగాక.

2. కుస్త్రీ కీవు డీకొందువా
వందేయంచు వాకొందువా అని

ఆనాడు ఆయనచేసిన వీరాలాపములు దిక్కులు పిక్కటిల్లినవి. ఆయన చాటు పద్యాలు, ఆశుకవిత్వాలను సంపుటీకరించి ఒక చిన్న గ్రంథము కొన్ని సంవత్సరాలక్రిందట ప్రకటితమైనది. త్వరలోనే, విపుల గ్రంథము సాహిత్య అకాడమి సహాయముతో ప్రకటితము కానున్నది. ఈనాడు హైదరాబాదు నగరములో నివసిస్తూ విద్యావ్యాసంగము చేస్తున్న వట్టెం నరసింహశాస్త్రి, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, కేశవపంతుల నరసింహశాస్త్రి, పెరవల్లి లింగయ్యశాస్త్రి మీ జిల్లాకు చెందిన పండితవరేణ్యులు— శ్రీ పి. వి. రాఘవాచారి, శ్రీ గొట్టిముక్కల కృష్ణమూర్తి, శ్రీ రఘుమారెడ్డి, శ్రీ ముకురాల రామరెడ్డి ప్రభృతులైన కవులు, సాహిత్యోపాసకులు అనేకులు యీ ప్రాంతానికి చెందినవారే. ఉస్మానియా విశ్వవిద్యాలయములో రీడరు పదవిని అలంకరిస్తూ సకలాంధ్రదేశములో వక్తృత్వమునందు, పాండిత్యమునందు, విమర్శనయందు, అనేక సాహిత్య ప్రక్రియలందు ప్రవీణురాలుగా ప్రసిద్ధిగాంచిన విదుషీమణి శ్రీమతి పి. యశోదారెడ్డి యీ మండలమువారే గదా. ఇక మరొక వ్యక్తిని గూర్చి ప్రస్తావించక నా ఉపన్యాసమును ముగించలేను గదా. ఆయనే నాకు సహచరుడు, ఆత్మీయుడునైన శ్రీ రామకృష్ణ

శర్మ. ఆయన కవి, పండితుడు, విమర్శకుడు, చరిత్ర పరిశోధకుడు, స్వాతంత్ర్య యోధుడు. ఎంతటి సభనైనను ఆకర్షింపగల వక్తృత్వమూ అందుకు తగిన గంభీరమైన కంఠం ఆయనది. సారస్వత వేదికలమీద, రాజకీయ వేదికలమీద ఆయన చదివిన పద్యాలు ఎప్పటికి మరచిపోలేనివి. వానిని గ్రంథస్థము చేయించవలసిన బాధ్యత యీ మండల భాషాభిమానుల మీద ఉన్నది. ఆయన ప్రబోధ పద్యాలు అనేక సభలను ఉత్తేజపరచిన జాతీయోద్య ప్రతిబింబాలు. మచ్చుకు చూడండి.

1. సాలుకొకసారి జరుగు జల్సాలలోన
ఒక్కరింగ్లీషులో మరొక్కరు ఉర్దూలోన
తమ విరగ్గత జాట దలచువారు.

2. అలవడ్డ రాజకీయ జ్ఞానమంతయు
వర్ధింగు కొరకు వ్యర్థ పరచువారు అనీ

1. మమ్మేలవలసిన మా ప్రజాపతులు
దొమ్మిలో దిగినారు దుర్విధివలన

2. గారాబు ఒక బిడ్డ గణికయైనట్లు
మా రాజకీయాలు మలినంబులయ్యె

3. ఉన్నావో లేవయ్యా ఓ జగన్నాథ
విన్నావా మా గోడు వీనులారంగ

అని, ఆయన గంభీర స్వరముతో చదివినప్పుడు మితవాద రాజకీయ నాయకులు, ఎంత బెదరినారో నాకు తెలుసు. ఆయనే మరొకచోట

లేలెమ్ము కవిరాజ లీలావిహార
శైలకుంజ లతాంత శయ్యపైనుండి
రారమ్ము కవిరాజ రతిరాజకీర
కూజత్ప్రకాంగ నాగోష్ఠి చాలించి
గోజాడు నిరుపేద గోడునాలింప

అని చెప్పి కవిత్వము కొరకు కాదని అది విశ్వకల్యాణానికి ప్రజల అభ్యుదయానికి ఉపయోగపడవలెనని రమ్యంగా ప్రబోధించినారు.

మహబూబునగర మండల రచయితలకు సాహిత్యాభిమానులకు నేను చేయవలసిన విజ్ఞప్తి యేమనగా— యీ మండల సాహిత్య చరిత్రను సమర్థులచే వ్రాయించి ప్రకటించవలెను. ఇక్కడి కవి పండితుల రచనలను సేకరించి భద్రపరచవలెను. అందులో కొన్నింటిని ఏరికూర్చి క్రమక్రమంగా ప్రకటించవలెను. వీలైతే ఒక సాహిత్య మాసపత్రికను నిర్వహించవలెను. అందులో యీనాటి యువకుల రచనలకు స్థానమీయవలెను.